04 . 09. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

గురువారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 97 , పేజీలు : 12 వెల:రూ.5/-

SIMULANEOUSLY PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



## ఏలాంటి విఘ్నాలు రావద్దని విగ్నేశ్వరునికి ప్రార్థన ఎమ్మెల్యే పాయల్ శంకర్

- స్వగ్రామంలోని వినాయక శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జైనథ్ మండలం వెలుతురు సెప్టెంబర్ 03:**
ప్రజలు చేపట్టే ఏ కార్యక్రమంలో ఎలాంటి విఘ్నాలు రాకుండా పనులు పూర్తి చేయాలని ఆ విఘ్నేశ్వరుని

# ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు



- కాంగ్రెస్ అంటేనే పేదలపక్షం
- ఇందిరమ్మ ఇళ్ల బాధ్యతను నెరవేరుస్తున్న పొంగులేటి
- పదేళ్లుగా లేని రేషన్ కార్డులు ఇచ్చాం
- పేదలందరికి సన్నబియ్యం సరఫరా
- బిఆర్ఎస్ సచ్చిన పాము..దానిని మళ్లీమళ్లీ చంపడమెందుకు?
- లక్షకోట్లను పంచుకోవడంలో కెసిఆర్ కుటుంబంలో కలహాలు
- కత్తులతో ఒకరినొకరు పొడుచుకుంటున్నారు
- వారి పంచాయితీలో తలదూర్చే సమయంమాకెక్కడిది
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంలో సిఎం రేవంత్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్3( వెలుతురు):**
హనుమాన్ గుడి లేని ఊరు ఉండొచ్చు గానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలందరికీ ఇళ్లు వచ్చేలా చేయాలన్నా.. ధరణి భూతం నుంచి రైతులకు విముక్తి కల్పించాలన్నా సమర్థుడైన మంత్రి కావాలని భావించా. అందుకే, పార్టీ అధిష్ఠానాన్ని ఒప్పించి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి గృహనిర్మాణ, రెవెన్యూ శాఖలు అప్పగించా. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని మంత్రి పొంగులేటి విజయవంతం చేశారని అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఏర్పాటు చేసిన గృహ ప్రవేశ



కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం దామరచర్లలో నిర్వహించిన బహిరంగసభలో సీఎం ప్రసంగించారు. ఇల్లులేని ప్రతి పేదవాడికి ఇల్లు ఇస్తామని గతంలో వైఎస్ఆర్

# పాలమూరును ఎండబెట్టిన కెసిఆర్

- ఎంపిగా గెలిపించినా పట్టించుకోని నేత
- తెలంగాణ వస్తే అభివృద్ది జరుగుతుందని మోసపోయాం
- గ్రీన్ ఛానల్ ద్వారా ప్రాజెక్టులకు నిధులు మంజూరు
- మూసాపేట కార్నింగ్ కంపెనీలో రెండో యూనిట్ ప్రారంభం
- అవకాశాలను అంది పుచ్చుకోవాలని సిఎం రేవంత్ పిలుపు






**మహబూబ్ నగర్,సెప్టెంబర్3( వెలుతురు):**
ఒకప్పుడు పాలమూరు వలసల జిల్లాగా ఉండేదని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఎక్కడ తట్ట పని, పార పని ఉన్నా పాలమూరు జిల్లా వారే కూలీలని తెలిపారు. అందుకు ప్రధాన కారణం మనం చదువులో వెనకబడి ఉండటమే అని పేర్కొన్నారు. స్వరాష్ట్రం వస్తే.. అభివృద్ధి జరుగుతుందని భావించామని చెప్పుకొచ్చారు. కానీ తెలంగాణ వచ్చాక కూడా అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూసాపేట మండలం వేముల కార్నింగ్ కంపెనీలో రెండవ యూనిట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు..అప్పట్లో పాలమూరు విశ్వవిద్యాలయం కేవలం ఒక ఏ కాలేజీలా మాత్రమే ఉండిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు



## వన దేవతలు సమ్మక్క-సారక్క జాతర ఖ్యాతి
# ఖండాంతరాలు దాటాలి

- తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక సమ్మక్క-సారక్క జాతర
- జాతర చుట్టూ పక్కల శాశ్వత నిర్మాణాలు పటిష్టంగా ఉండాలి
- రెండు కుంభమేళాలు నిర్వహించిన సంస్థలే మాస్టర్ ప్లాన్ రూపకల్పన
- రాష్ట్ర సచివాలయంలో మేడారం మాస్టర్ ప్లాన్ సమీక్షా సమావేశం
- రివ్యూలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:**
తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అయిన సమ్మక్క సారక్క వనదేవతల జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.., పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క.., ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. గతం కంటే ఈ సారి చాలా ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. బుధవారం రాష్ట్ర సచివాలయంలోని దేవాదాయ శాఖ మంత్రి కార్యాలయం కాన్ఫరెన్స్ రూంలో మేడారం మాస్టర్? ప్లాన్? సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశం మంత్రి కొండా సురేఖ

## బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే
# కుట్రలు

- రేపు కెటిఆర్‌కు కూడా ఇలాంటి గతే పడుతుంది
- నన్ను బయటకు పంపేందుకు ఎప్పటినుంచో ప్లాన్‌లు
- కెసిఆర్ ఇది గుర్తించి ముందుకు సాగాలి
- గుంటనక్కలు హరీష్, సంతోష్‌ల పట్ల జాగ్రత్త
- రేవంత్‌తో కుమ్మక్కయిన హరీష్ రావు
- మీడియా సమావేశంలో కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,సెప్టెంబర్3(వెలుతురు):**
బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్కల్లా చుట్టూ చేరిన హరీష్ రావు, సంతోష్ రావులతో జాగ్రత్త అంటూ కెసిఆర్ తనయ కవిత హెచ్చరించారు. అధికారంలో ఉండగా అడ్డగోలుగా సంపాదించుకున్న వీరు ఇప్పుడు మీకు కూడా ఎసరు పెట్టే పనిలో ఉన్నారు..తస్మాత్ జాగ్రత్త అని అన్నారు. అన్నా రామన్నా నీవు కూడా వరితో జాగ్రత్త అంటూ హెచ్చరికలు చేశారు. నన్ను పార్టీ నుంచి బయటకు పంపడానికి కారణమైన వీరు మన కుటుంబం విచ్ఛిన్నం కావాలని పన్నాగం పన్నారని అన్నారు. బిఆర్ఎస్‌లోని కొందరు తనపై పనిగట్టుకుని దుష్ప్రచారం చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. భారత రాష్ట్ర సమితి నుంచి సస్పెండ్ చేసిన నేపథ్యంలో కవిత మీడియా సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మాట్లాడుతూ.. భారత రాష్ట్ర సమితి ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి



రాజీనామా చేస్తున్నట్లు ఈ సందర్భంగా కవిత ప్రకటించారు. పార్టీలో ఉంటూ కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఆలోచన ఉన్నవాళ్లు, వ్యక్తిగత లబ్ధి పొందాలనుకునే వాళ్లు మేం ముగ్గరం కలిసి ఉండకూడదని ఇలా కుట్రలు చేశారని కవిత ఆరోపించారు. ఈ సందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. మా కుటుంబం బాగుండొద్దు.. మేం విచ్ఛిన్నమైతేనే వాళ్లకు

## 6న హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం

- హాజరవుతున్న హోంమంత్రి అమిత్ షా



**హైదరాబాద్, సెప్టెంబర్3(వెలుతురు):**
హైదరాబాద్‌లో నిర్వహించే గణేశ్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న కేంద్ర హోంశాఖమంత్రి అమిత్ షా రానున్నారు. మోజంజాహి మార్కెట్

## ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాలి

జర్నలిస్టులకు మీడియా అకాడమీ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి సూచన



**హైదరాబాద్,సెప్టెంబర్3( వెలుతురు):**
బుధవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో కృత్రిమ మేధలో, టూల్స్ టె-క్నిక్స్, వర్క్ షాపును తెలంగాణ మీడియా అకాడమీ, అదిరా డాటా లీడ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రముఖ దినపత్రికలు, టీవీ ఛానల్స్ కు

## కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్



- ప్రజలకు దమ్మిడీ మేలు చేసేది కాదు
- కాంగ్రెస్‌పై మరోమారు కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,సెప్టెంబర్3( వెలుతురు):**
కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదని కేటీఆర్ విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేత

## ఓటేస్తే భవిష్యత్‌కు
# గ్యారెంటీ అన్నారు

- యూరియా బస్తా కూడా ఇవ్వలేక పోతున్నారు
- రెండేళ్లుగా రైతులకు వరుస ఎరువుల కష్టాలు
- ఉల్లి ధరలు పతనమైనా పట్టించుకోవడం లేదు
- మార్కెట్ స్థిరీకరణ డబ్బులు ఏం చేశారు
- ఎక్స్ వేదికగా జగన్ విమర్శలు

**అమరావతి,సెప్టెంబర్3( వెలుతురు):**
చంద్రబాబూ.. మీకు ఓటేస్తే భవిష్యత్తుకు గ్యారంటీ- అన్నారు. కాని, రైతులకు గతంలో సులభంగా దొరికే బస్తా యూరియా కూడా ఇవ్వలేకపోతున్నారు.. ఇంత అధ్వాన్నంగా ప్రభుత్వాన్ని నడుపుతారా అంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి



## ప్రపంచస్థాయి పర్యాటకంగా ఎపి

- టెంపుల్ టౌన్స్‌లో స్టేట్‌హోమ్‌లకు ప్రోత్సాహం
- పర్యాటక ప్రాంతాల్లో నిరంతరంగా కార్యక్రమాలు
- పర్యాటక అభివృద్ధిపై సమీక్షలో సిఎం చంద్రబాబు

**అమరావతి,సెప్టెంబర్3( వెలుతురు):**
టెంపుల్ టౌన్స్‌లో హోమ్ స్టేలను ప్రోత్సహించాలని, ముఖ్యంగా తిరుపతితో పాటు- ఇతర ప్రముఖ దేవాలయాల పట్టణాల్లో వీటిపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కోనసీమలో గ్రామీణ వాతావరణం అనుభూతి చెందేలా హోమ్ స్టేలను అభివృద్ధి చేయాలని, ఎన్ఆర్ఐలు కూడా ఇందులో పెట్టుబడులు పెట్టేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ హోమ్ స్టేలు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండేలా చూడాలన్నారు. బుధవారం సచివాలయంలో



## విదేశాల నుంచి ఆగిన యూరియా దిగుమతులు

- కొరత అందుకేనని వెల్లడించిన కేంద్రం
- వ్యవసాయ శాఖ మంత్రి తు మ్మల



**న్యూఢిల్లీ,సెప్టెంబర్3( వెలుతురు):**
యుద్దాల కారణంగా కేంద్రం ఇతర దేశాల నుంచి యూరి

వెలుతురు

(మొదటి పేజీ తరువాయి..)

## ఏలాంటి విఘ్నాలు రావద్దని విగ్నేశ్వరునికి ప్రార్ధన ఎమ్మెల్యే పాయల్ శంకర్

వేడుకున్నానని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు ఆయన ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వగ్రామమైన జైనథ్ మండలం ఆడ గ్రామంలో గత రాత్రి జరిగిన వినాయకుని నిమజ్జన శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు. ముందుగా వినాయకునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులతో యువకులతో కలిసి ఉత్సాహంగా నిమజ్జనోత్సవం లో పాల్గొన్నారు. ..

## 6న హైదరాబాద్ గణేశ్ నిమజ్జనం

వద్ద గణేశ్ విగ్రహాలకు స్వాగతం పలికి ప్రసంగిస్తారు. ఆరోజు మధ్యాహ్నం 1:10కి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఐటీసీ కాకతీయకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు బీజేపీ ముఖ్య నేతలతో భేటీ-కానున్నారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తంపై ఆరా తీయనున్నట్లు- పార్టీ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 నుంచి 3:30 వరకు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి 46 ఏళ్ల ప్రయాణంపై ఐటీసీ కాకతీయలో ఏర్పాటు చేసే ఫోటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర హోంమంత్రి ప్రారంభించి.. కమిటీ- సభ్యులతో గ్రూప్ ఫోటో దిగనున్నారు. 3:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎస్ఎస్‌బీ 28వ బెటాలియన్ హెడ్‌క్వార్టర్స్‌కి వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు. ఐటీసీ కాకతీయ నుంచి సాయంత్రం 4 గంటలకు మెజాంజాహీ మార్కెట్ వినాయక చౌక్‌కు చేరుకుని గణనాథులకు స్వాగతం పలకడంతో పాటు- గణేష్ శోభాయాత్రను ఉద్దేశించి ప్రసంగిస్తారని భాజపా వర్గాలు తెలిపాయి.

## ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాలి

చెందిన తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషలకు సంబంధించిన దాదాపు 100 మందికి పైగా జర్నలిస్టులు ఈ వర్క్ షాప్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిజం రంగంలో కూడా ఎఐని విరివిగా వాడుతున్నారని అన్నారు. అందులో భాగంగా న్యూస్ రూములు పరివర్తన చెందినందున జర్నలిస్టులు కూడా ఏఐ పరిజ్ఞానాన్ని తప్పనిసరిగా పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిజంలో భాగంగా డిజిటల్ మీడియా, సోషల్ మీడియాలో ఏఐ ని జర్నలిస్టులు వృత్తిలో భాగంగా ఉపయోగించుకొని రిపోర్టింగ్ లో సులభతరమైన పద్ధతులను పాటించి తక్కువ సమయంలోనే ఎక్కువ అంశాలను పాఠకులకు, వీక్షకులకు అందించవచ్చు అని ఆయన తెలిపారు. ఎఐ సాంకేతికత పై లోతైన నైపుణ్యం ఉన్న, ఇంటర్నేషనల్ -ట్రైనర్ ఉడుముల సుధాకర్ రెడ్డి శిక్షణ నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాలలో ఏఐ శిక్షణ కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నాయన్నారు. అలాగే మన తెలంగాణలో జర్నలిస్టులకు ఏఐలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటి ప్రయత్నం అని ఆయన అన్నారు. ఉడుముల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టు కూడా నిత్య విద్యార్థి లాగా ఉండాలన్నారు. అదేవిధంగా తాను కూడా నిత్యం ఏదో ఒకటి నేర్చుకుంటూ నిత్య విద్యార్థిగానే కొనసాగుతున్నానని తన వృత్తి జీవితం గురించి వివరించారు. ఏఐ శిక్షణలో భాగంగా ఏఐ టూల్స్ ఉపయోగాలు, ప్రమాదాలు, ఏఐ పద్ధతులు, నియమ నిబంధనలు, ప్రాథమిక అంశాల గురించి విస్తృతంగా వివరించారు. కృత్రిమ మేధ జర్నలిస్టుల వృత్తిలో భాగంగా తప్పనిసరి అయిందని, ఏఐ మనసును భ్రమింప జేసి తప్పుడు సమాచారాన్ని వివక్ష లాంటి సమాచారాన్ని అందించే ప్రమాదం ఉందన్నారు. తన వద్ద ఉన్న ఉదాహరణల ఆధారంగా ఏఐ అవుట్ పుట్ టూల్స్ కూడా జాతి, మత, వర్గ, లింగ భేదాలు కలిగించే కంటెంట్ ను అందిస్తాయన్నారు. ఆటోమేషన్ లో భాగంగా ఏఐ ఏజెంట్స్ వస్తున్నాయని, దీని ద్వారా రాబోయే కాలంలో వివిధ రకాల ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆయన తెలియజేశారు. చాట్ జిపిటి, పెర్ప్లెక్సిటీ-, నోట్ బుక్ ఎల్ ఎం, గూగుల్, జమినయి, మిడ్ జర్నీ, సోరా, విఇఓ3, తదితర టూల్స్ ని పరిచయం చేసి జర్నలిస్టులు ఎలా ఉపయోగించాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఉదాహరణల ద్వారా అవగాహన కలిగించారు. ఆఐ డాటా -ట్రెయినింగ్ లో వినియోగంలో లోపం వల్ల, ప్రామ్టింగ్ ఇంజనీరింగ్ సరిగా చేయకపోవడం వల్ల, ఈ వివక్ష లేదా తప్పుడు సమాచారం వ్యాప్తి చేందుతుంది అన్నారు. ఆఐ నైతిక నియమాలు తదితర అంశాలకు లోబడి జర్నలిస్టులు బాధ్యతా యుతంగా కృత్రిమ మేధ పరిజ్ఞానంను ఉపయోగించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీది దండుపాళ్యం బ్యాచ్

ఊకంటి ప్రభాకర్ రావుతో పాటు- 300 మంది కార్యకర్తలు కేటీఆర్ సమక్షంలో చేరారు. దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడి లేకున్నా సంక్షేమ పథకాలు ఆగవు. చిత్తశుద్ధి గల్ల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తది తప్ప సాకులు వెతకదు. ఈ సన్నాసులకు ప్రభుత్వం నడపడం చేతకాదు. ఎంతసేపు ఢిల్లీకి మూటలు పంపడం.. పదవులు కాపాడుకోవాలనే సోయి తప్ప ఇంకోటి లేదు. చివరకు కేసీఆర్‌ను తిట్టాలి అదే వారి పని అని కేటీఆర్ ధ్వజమెత్తారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పార్లమెంట్‌లో తెలంగాణలో అప్పులు ఎంత అని ప్రశ్న వేసిండు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పు, వదిలిపెట్టిపోయిన అప్పు మూడున్నర లక్షల కోట్లు- అని కేంద్రం చెప్పింది. అందులో కేసీఆర్ రాకంటే ముందు 72 వేల కోట్ల అప్పు ఉంది. ఆయన వచ్చిన తర్వాత 2 లక్షల 80 వేల కోట్ల అప్పు చేసిండు. ఇది మాత్రమే అప్పు అంటూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పింది. అయినా కాంగ్రెస్ నేతలకు సిగ్గులేదు. ఒకడు ఆరు లక్షలు అంటడు.. ఇంకొకడు ఏడు లక్షలు అంటడు. ఇంకోడు ఎనిమిది లక్షలు.. నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నాడు.. ఆధారం, ప్రామాణికం, పత్రం అడిగితే లేదంటరు. ఉపన్యాసాలు అదరగొట్టాలి.. మీడియా మేనేజ్‌మెంట్ చేసుకోవాలి.. ఇదే కాంగ్రెస్ నేతల పని. వారి మీదికి దృష్టికి రాకుండా.. డైవర్షన్ గేమ్ ఆడుతున్నారు. కాళేశ్వరం, ఫార్ములా రేస్, విద్యుత్ అంశాల మీద సొల్లు పురాణం తప్ప ప్రజలకు పనికొచ్చే పని చేయలేదు అని కేటీ-ఆర్ నిప్పులు చెరిగారు. పంచాయతీ ఎన్నికలు అయినా, ఢిల్లీ ఎన్నికలు అయినా ఎగరాల్సింది గులాబీ జెండానే. కేసీఆర్ నాయకత్వంలో ముందుకు పోవాలి. చిన్నచిన్న సమస్యలు ఉంటా యి.. వాటిని పక్కన పెట్టాలి. తెలంగాణ ప్రజల కోసం కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి. ప్రజలు ఇవాళ కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటు-న్నారు ఎందుకంటే.. మన మధ్యన ఒక పెద్దాయన ఉంటే ఆయన విలువ తెలియదు. ఆయన ఆ పోజిషన్‌లో లేనప్పుడే తెలుస్తుంది. ఎప్పుడైనా చీకటిని చూస్తనే వెలుగు విలువ తెలుస్తుంది. గాడిదను చూస్తేనే గుర్రం విలువ తెలుస్తుంది. ఇవాళ గాడిదులు ఎవరైతే ఉన్నారో వారిని చూసిన తర్వాత కేసీఆర్ విలువ ప్రస్ఫుటంగా తెలు స్తుంది. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి మోసపోయామని రైతులు బాధపడుతున్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్ల కు ఇస్తామన్న తులం బంగారం ఇవ్వడం లేదు.. చివరకు ఇనుము కూడా ఇవ్వరు. ఇది ఎత్తుకుపోయే బ్యాచ్ తప్ప ఇచ్చే బ్యాచ్ కాదు. ఇది దండుపాళ్యం బ్యాచ్.. బంగారం ఇచ్చే బ్యాచ్ అసలే కాదు. ఒక్కొక్క వర్గాన్ని చైతన్యవంతం చేసి.. గెలుపు దిశగా పయనించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## విదేశాల నుంచి ఆగిన యూరియా దిగుమతులు

యా దిగుమతి చేసుకోలేదని, అందువల్లనే కొరత ఏర్పడిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో యూరియా సరైన సమయంలో ఉత్పత్తి చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న కొరత తెలంగాణను కూడా పీడిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికి 9.8 లక్షల టన్నుల్లో 5.3 లక్షల టన్నులే సరఫరా చేశారు. ప్రతి నెలలో పంపిణీ చేయాల్సిన యూరియాలో కోత పెట్టారు. సెప్టెంబర్‌లో రావాల్సిన 1.6 లక్షల టన్నులు సరఫరా చేయలేదు. ఇతర దేశాల నుంచి వస్తోన్న యూరియానే సరఫరా చేస్తున్నారు. రామగుండం పరిశ్రమ నుంచి కూడా ఒక్క బస్తా ఇవ్వలేదు. కొరత కారణంగా రాష్ట్ర రైతులు ఆందోళనలో ఉన్నారు. అన్ని పంటలకు సెప్టెంబర్‌లో యూరియా చివరి కోటా వేయాల్సి ఉంటుందన్నారు. ఇటీవల భారీ వర్షాల వల్ల ఆరేడు జిల్లాల్లో అన్ని శాఖల్లో తీవ్ర నష్టం సంభవించింది. రాష్ట్రంలో పంటలు, రోడ్లు, మౌలిక సౌకర్యాలు దెబ్బతిన్నాయి. చేనేత రంగంపై పన్నులు ఉండకూడదని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ రద్దు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నాం. ఆయిల్‌పామ్ దిగుమతిపై సుంకాలు 40 శాతానికి పెంచాలని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భారత రాష్ట్ర సమితి నుంచి కవిత సస్పెన్షన్ వ్యవహారంతో తమకు సంబంధం లేని వ్యవహారం అని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాళేశ్వరం వ్యవహారాన్ని సీబీఐ విచారణకు ఇచ్చినట్లు- తెలిపారు. ఏది ఉన్నా.. వాళ్లే చూసుకుంటారన్నారు. ఇదిలావుంటే ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిశారు. ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ. 25000 కనీస మద్ధతు ధర కల్పించేలా ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచాలని మంత్రి విజ్ఞప్తి.చేశారు. తెలంగాణలోని నారాయణపేట, ములుగు, కొమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడం జిల్లాలను ప్రధాన్ మంత్రీ ధన్-ధాన్య కృషి యోజన పథకంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ యంత్రాలపై, మైక్రో ఇరిగేషన్ పరికరాలపై ఉన్న 12 శాతం జిఎస్టీని మినహాంచాలని విజ్ఞప్తి చేశారు. పాస్ఫరస్, పొటాషియం, సల్ఫర్ వంటి పోషకాలపై సబ్సిడీ పెంచి యూరియాతో సమానంగా ధరలో సమతుల్యత తీసుకురావాలని మంత్రి తుమ్మల కోరారు.

## ఇందిరమ్మ ఇల్లు లేని ఊరు ఉండదు

ప్రకటించారు. రాష్ట్రంలో 2004 నుంచి 2014 మధ్య 22 లక్షల ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టించి ఇచ్చింది. ఇందిరమ్మ ఇళ్లలోకి పేదలు ప్రవేశించినప్పుడు వచ్చే ఆనందం వెలకట్టలేనిది. పేదల కష్టాలు మాకు తెలుసు కాబట్టే .. పేదరికాన్ని రూపుమాపాలని నిర్ణయించుకున్నాం. రాష్ట్ర ప్రజలకు పదేళ్లపాటు-.. కొత్త రేషన్ కార్డులు అంటే ఏంటో తెలియదు. మా ప్రభుత్వం రాగానే లక్షలాది రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చాం. మేము ఏ బియ్యం తింటున్నామో.. పేదలకూ అవే సన్నబియ్యం ఇస్తున్నాంఅని రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ విషనాగు. ఈ పాములో కాలకూట విషం ఉంది. అయితే, ప్రజలు దాని కోరలు ఎప్పుడో పీకేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డితో కుమ్మక్కయ్యారంటూ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. లక్ష కోట్లు- దోచుకున్న వ్యక్తి ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. పంపకాల్లో తేడాలు వచ్చి ఒకరినొకరు కొట్టుకుంటున్నారు. అక్క, అన్న, చెల్లి, బావ ఒకరినొకరు కత్తులతో పొడుచుకుంటున్నారు. దోపిడీ సొమ్ము వాళ్లింట్లో చిచ్చు పెట్టింది. సంపాదించుకున్న టీవీలు, పేపర్ల కోసం కొట్టుకుంటున్నారు. వాళ్లు వాళ్లు కొట్టు-కుంటూ మాపై నిందలు వేస్తున్నారు. మీ పంచాయితీల్లోకి మమ్మల్ని లాగొద్దు. చచ్చిన పామును మళ్లీ చంపాల్సిన అవసరం మాకేముంది. బీఆర్ఎస్ ను ప్రజలే బొందపెట్టారని సీఎం రేవంత్ మండిపడ్డారు. దామరచర్ల బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, సొంతిల్లు అనేది ప్రతి పేదవాడి జీవితస్వప్నం అని.. గత పదేళ్లు పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదని అన్నారు. ఏటా 2 లక్షల ఇళ్లు కట్టినా పదేళ్లలో 20 లక్షల మందికి వచ్చేవని.. కానీ డబుల్ బెడ్‌రూమ్ ఇళు అంటూ గత ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్లలో ఆనందం కనబడుతోంది. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తెచ్చిన ధరణికి పాతరేసి భూభారతి తీసుకొచ్చి రైతుల సమస్యలు పరిష్కరించామని వెల్లడించారు. మునుపెన్నడూ లేని విధంగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. మన పిల్లలు బర్రెలు, గొర్రెలు కాచుకోవాలని కేసీఆర్ పార్టీ వాళ్లు అంటారని.. వాళ్ల పిల్లలు మాత్రం చదువుకుని రాజ్యం ఏలి దోచుకుంటారట అంటూ తీవ్రంగా విమర్శించారు. టీవీలు, పేపర్లు సంపాదించుకున్నారు.. వాటి కోసం కొట్టు-కుంటు-న్నారని ఆరోపించారు. దోపిడీ సొమ్మే ఇవాళ వాళ్ల మధ్య చిచ్చు పెట్టిందని, వాటాల కోసం వాళ్లు వాళ్లు కొట్టుకుంటూ మాపై నిందలు వేస్తున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలే బొంద పెట్టారని.. సచ్చిన పామును చంపాల్సిన అవసరం మాకేముందని ఎద్దేవా చేశారు. మీ కుటుంబ పంచాయితీలోకి మమ్మల్ని లాగొద్దని హెచ్చరించారు. బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల పైలాన్???ను ఆవిష్కరించారు సీఎం రేవంత్. అనంతరం ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం చేశారు. తెలంగాణ తొలి దశ ఉద్యమం ఖమ్మం జిల్లా పాల్వంచలోనే మొదలైందని, ఖమ్మం జిల్లా ప్రజల తెలంగాణకు దిశ దిశను చూపించారన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలబడాలని కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో కలిశారు. ఇది ఎన్నికల స్టంట్ కాదు. ప్రజలు ఆలోచన చేయాలి. రోటీ, కప్డా, మకాన్ అనే నినాదాన్ని నాడు ఇందిరమ్మ కొనసాగిస్తే, అదే నినాదాన్ని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి గల్లీ గల్లీ.. ఊరు ఊరు తిరిగి ప్రతి పేద వాడికి 25 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చారు. ఇందిరమ్మ ఇండ్లు ఉన్న ఊర్లోనే ఓట్లు- అడుగుతామని 2023 ఎన్నికల్లో కేసీఆర్‌కు సవాలు విసిరా. పేదలు ఇందిరమ్మ ఇళ్లలోకి గృహ ప్రవేశం చేసినప్పుడు కలిగిన ఆనందం నేను జూబ్లీహిల్స్‌లో గృహప్రవేశం చేసిన రోజు కూడా రాలేదన్నారు. 4500 ఇండ్లు కేవలం అశ్వరావు పేటకు ఇచ్చా. కొందరికి పేదరికం అంటే ఎక్స్ కర్షన్.. మేము పేద వర్గంలో పుట్టి పెరిగి, వారితో అన్ని సమానంగా పంచుకున్నాం. పేదలుగా బతకడం మా జీవన విధానం. పేదరికం తెలిసి, కుటుంబ సభ్యులుగా భావించే పార్టీ కాంగ్రెస్ పార్టీ. ఇందిరమ్మను పేద ప్రజల గుండెల్లో అమ్మలా గుడి కట్టుకున్నారు. పేదలు కళ్లు కాయలు కాసేలా వేచి చూసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి సంక్షేమం అందలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సమయస్ఫూర్తి కలిగిన జిల్లా. అందుకే ఈ జిల్లా నుంచి ముగ్గురు మంత్రులను చేశాం. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలి. పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి ఉండి ఉంటే పేద వర్గాల కష్టాలు తీరిపోయేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కర్యక్రమంలో మంత్రి పొంగులేటి, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## పాలమూరును ఎండబెట్టిన కెసిఆర్

చేశారు. ఇప్పుడు రాష్ట్రాన్ని నడిపించే అవకాశం వచ్చిందని తెలిపారు. ఇపుడు విద్యా, ఉపాధి, అవకాశాలను జిల్లా అంది పుచ్చుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పట్లో దివంగత నేత ఇందిరా గాంధీ ఎస్సీ,ఎస్టీలకు భూములు అసైన్ చేసిందని పేర్కొన్నారు. ఇపుడు చదువుకుంటేనే తలరాత మారుతుందని స్పష్టం చేశారు. మీరు చదువుకోవాలంటే కావలసిన వసతుల కల్పన బాధ్యత తాను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా జిల్లా ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు.పాలమూరు జిల్లా ఒకనాడు వలసలకు మారుపేరు అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసపేటలో సిఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. అనంతరం ఏర్పాటు- చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. పాలమూరు బిడ్డల భాగస్వామ్యం లేకుండా ఏ ప్రాజెక్టు నిర్మాణం జరగలేదని పేర్కొన్నారు. చదువు, నీళ్లు జిల్లా ప్రజలకు అందుబాటు-లో లేక వలసలు పోయారు. కృష్ణా జలాలు పక్క నుంచి వెళ్తున్నా తాగు, సాగు నీటి సమస్యలు ఉన్నాయి. సమస్య పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలు ప్రయత్నాలు చేయలేదు. తెలంగాణ ఉద్యమంలో పాలమూరు జిల్లా అండగా నిలిచింది. కెసిఆర్ మహబూబ్‌నగర్ ఎంపిగా గెలిపించారని సిఎం అన్నారు. కెసిఆర్‌ను ఎంపిగా గెలిపించినా తమ ప్రాంతానికి సముచిత న్యాయం జరగలేదని సిఎం రేవంత్ మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో పలు ప్రాజెక్టులు సంపూర్ణంగా పూర్తి కాలేదు. పేరుకే పాలమూరు వర్సిటీ- అయినా.. పిజి కాలేజీగానే మిగిలింది. చదువు, ఉపాధి, నీటిపారుదలలో జిల్లాను అభివృద్ధి చేసుకోవాలి. ప్రణాళికలు రచించుకోకపోతే జిల్లాకు శాశ్వతంగా అన్యాయం జరుగుతుంది. జిల్లాకు ట్రిపుల్ ఐటీని మంజూరు చేసుకున్నాం. 14 అసెంబ్లీ స్థానాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు- చేస్తున్నాం. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఇవ్వడానికి జిల్లా వేదిక కాబోతోందని సిఎం స్పష్టం చేశారు.కొడంగల్, నారాయణపేటకు ఎత్తిపోతల పథకం తెస్తే.. ఫిర్యాదు చేస్తున్నారుని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అక్కడ భూసేకరణ కోసం వెళ్తే.. రైతులు కొడంగల్లో ఇచ్చినట్లు- రూ. 20 లక్షలు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. కొడంగల్ పరిస్థితి వేరు.. నారాయణపేట పరిస్థితి వేరు అని స్పష్టం చేశారు. నారాయణ పేట వారికి కావాలంటే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. ఇక్కడ భూసేకరణ కోసం మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు.. ఈ ప్రాజెక్టులను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నాయని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మీడియా కూడా లేనిపోని వార్తలకు అపోహలకు తావు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. ఇక్కడ బ్రహ్మోస్ మిస్సైల్ ఉత్పత్తి చేపట్టేందుకు యత్నిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లకు స్థలాలను చూపించండని కోరారు. గతంలో మన పేదరికాన్ని చూపేందుకు పాలకులు టోనీ బ్లెయిర్‌ను తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుడు మన అభివృద్ధిని.. ప్రాజెక్టులను విద్యా సంస్థలను చూపించేందుకు వివిధ దేశాల నాయకులను పిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కుర్చీలో కూర్చున్న ప్రతి నాయకుడు.. ఆయనను నమ్ముకున్న ప్రజలకు మొదటి ముద్దను పెట్టాలని రేవంత్ పేర్కొన్నారు. తనకు ఏ అవకాశం వచ్చినా.. మొదటి ముద్ద పాలమూరుకు పెడతా అని ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు రాష్ట్రంలో ఏ పార్టీ ఉండకూడదని చూసిన వారు.. ఇపుడు వాళ్లకు వాళ్లే కడుపులో కత్తులు పెట్టుకుని.. కౌగిలించుకుంటున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను హరీష్ రావు, సంతోష్ రావు వెనకాల ఉన్నానని ఒకరు, కవిత వెంట ఉన్నానని మరొకరు అంటున్నారని.. ఎవరి వెనకాల తాను ఎందుకు ఉంటా.. అని ప్రశ్నించారు. తాను ప్రజల అభివృద్ధి కోసం ముందు ఉంటానని వివరించారు. ఈ సమావేశంలో సీఎం వెంట మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునే కుట్రలు

అధికారం వస్తుంది. నేను, నాన్న, అన్న కలిసి ఉండటం చాలా మందికి ఇష్టం లేదు. దీనిలో భాగంగా మొదటిగా నన్ను బయటకు పంపించారు. అదిక్కడితో ఆగదు. నాన్నా.. మీ చుట్టూ ఏం జరుగుతుందో ఓసారి చూసుకోండి. రేపటి నాడు ఇదే ప్రమాదం రామన్న (కేటీ-ఆర్)కు, మీకూ పొంచి ఉంది. భారత రాష్ట్ర సమితిని హస్తగతం చేసుకునే కుట్రలోనే నన్ను బయటకు పంపించారని కవిత వ్యాఖ్యానించారు. అక్రమ కేసులు పెట్టి తిహార్ జైలులో ఐదున్నర నెలలు ఉండి వచ్చాక గతేడాది నవంబర్ 23 నుంచి ప్రజాక్షేత్రంలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టానని కవిత తెలిపారు. గురుకులాలు, బీసీ రిజర్వేషన్లు, మహిళలకు రూ.2500 ఆర్థిక సాయం అందించాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేశామన్నారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చినపుడు గళమెత్తినట్లు- చెప్పారు. బనకచర్ల, భద్రాచలం సమీపంలోని ముంపు గ్రామాల అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించినట్లు- కవిత తెలిపారు. సీఎం సొంత జిల్లాలో భూనిర్వాసితులకు అండగా ఉన్నామని చెప్పారు. 47 నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను కలుపుకొని.. గులాబీ కండువాలతో అనేక ప్రజాసమస్యలపై మాట్లాడామన్నారు. ఇవన్నీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు ఎలా అవుతాయని ఆమె ప్రశ్నించారు. ఈ అంశంపై భారత రాష్ట్ర సమితి పెద్దలు పునరాలోచన చేయాలన్నారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీసీల అంశంపై మాట్లాడుతుంటే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు- చిలువలు పలువలుగా ప్రచారం చేశారు. సామాజిక తెలంగాణకు కట్టుబడి ఉన్నానని చెప్పాను. దానిలో తప్పేముంది? నా తండ్రి కేసీఆర్ చిటికెన వేలు పట్టుకుని ఓనమాలు నేర్చుకున్నా. ఆయన స్ఫూర్తితోనే సామాజిక తెలంగాణ అని మాట్లాడా. స్వతంత్ర భారతంలో దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పిన గొప్ప నాయకుడు కేసీఆర్. చెప్పింది చెప్పినట్లు- ఆయన చేశారు. ప్రతి కులాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. అది సామాజిక తెలంగాణ కాదా? నేనేమైనా తప్పు మాట్లాడానా? సామాజిక తెలంగాణ భారత రాష్ట్ర సమితికి అవసరం లేదా? భౌగోళిక తెలంగాణ వస్తే సరిపోతుందా? బంగారు తెలంగాణ అంటే హరీశ్‌రావు, సంతోష్ ఇళ్లల్లో బంగారం ఉంటే అవుతుందా?సమాజంలో ప్రతి ఒక్కరూ బాగుంటేనే బంగారు తెలంగాణ అవుతుందని అంటూ అనేక విషయాలన మీడియాముందుంచారు. తనపై ఎలా కుట్రలు సాగించారో సోదాహరణంగా వివరించారు. నేను రామన్నను గడ్డం పట్టుకొని, బుజ్జగించి అడుగుతున్నా. ఒక చెల్లిని, మహిళా ఎమ్మెల్సీని.. నాపై కుట్రలు జరుగుతున్నాయని గతంలో తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెట్టి చెప్పా. మీరు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఏం జరిగిందో నాకు ఫోన్ చేయరా అన్నా? నేను కూర్చొని ప్రెస్‌మీట్ పెడితేనే న్యాయం జరగలేదంటే.. మామూలు మహిళా కార్యకర్తకు పార్టీలో అన్యాయం జరిగితే స్పందిస్తారా.. నాకైతే అనుమానమే. హరీశ్‌రావు, సంతోష్ గురించి ఆలోచించాలని కేసీఆర్‌కు బిడ్డగా చెబుతున్నా. తెలంగాణ ఉద్యమంలో మొదటినుంచీ హరీశ్‌రావు లేరు. పార్టీ పెట్టిన 10 నెలల తర్వాత వచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు ఎప్పుడో లొంగిపోయారు. ఆయన్ను గమనించుకో రామన్న అంటూ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఒకే విమానంలో ప్రయాణించారా? లేదా? చెప్పాలి. సంతోష్, హరీశ్‌రావు గ్యాంగ్‌లు భారత రాష్ట్ర సమితికి పట్టిన జలగలని కవిత తీవ్రస్థాయిలో విమర్శించారు. కాళేశ్వరంలో అవినీతికి హరీష్ రావే కారణమన్నారు. తుమ్మడిహట్టి నుంచి మార్చిందే హరీష్ రావని అన్నారు. హరీష్ రావు మీద ఆరోపణలు వచ్చిన పాల సరఫరా, ఫామ్ హౌజ్ గురించి మరుసటి రోజే మాయం అయ్యాయని అన్నారు. ఆనో ట్రబుల్ షూటర్ కాదు...ట్రబుల్ క్రియేటర్ అని ఘాటు విమర్శలు చేశారు. మెగా కాంట్రాక్టర్‌తో పోచంపల్లి మోకిల్లాలో 750 కోట్ల విల్లా ప్రాజెక్టులు చేపట్టారని అన్నారు. ఇవన్ఈన గుర్తించి కుటుంబాన్ని విచ్ఛిన్నం చేస్తున్న ఈ ఇద్దరిపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. పార్టీకి కూడా ఇదో హెచ్చరిక అన్నారు.

## వన దేవతలు సమ్మక్క-సారక్క జాతర ఖ్యాతి ఖండాంతరాలు దాటాలి



నేతృత్వంలో జరగ్గా... మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎండోమెంటు ప్రిన్స్ పల్ సెక్రటరీ శైలజా రామాయ్యర్, ములుగు కలెక్టర్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు. పలుమార్లు కుంభమేళలు నిర్వహించిన సంస్థకు మాస్టర్ ప్లాన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్టు అధికారులు మంత్రులకు వివరించారు. సమ్మక్క సారలమ్మ పూజారుల సూచనల మేరకు మేడారం దేవాలయ ప్రాంగణ నూతన డిజైన్ ను మంత్రులు ప్రత్యేకంగా పరిశీలించారు. డిజైన్లలో చేయాల్సిన మార్పులపై మంత్రులు సూచనలు చేశారు. మేడారం నిర్వహణ పనులను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహా మేడారం జాతరలోపు పూర్తి చేయాల్సిన పనులను త్వరగా చేపట్టాలని మంత్రులు సూచించారు. సమ్మక్క సారలమ్మ పూజారులతో చర్చించి వారి అభిప్రాయం మేరకు ఆధునికరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారి గద్దెల ఎత్తు పెంచాలని పూజారులు ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా... తగిన మేరకు డిజైన్లు మార్చాలన్నారు. భక్తుల సందర్శనార్థం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలు ఒకే వరుస క్రమంలో ఉండేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తద్వారా ఎలాంటి జాప్యం లేకుండా సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను భక్తులు దర్శించుకునేందుకు అనువుగా ఉంటుందని మంత్రులు చెప్పారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మక్క సారలమ్మ సేవ కోసం జాతర సమయంలో భక్తులకు సహాయపడేందుకు వాలంటీర్లను నియమించాలన్నారు. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా మేడారం పరిసరాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మేడారం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ మహా మేడారం జాతరకు రూ. 150 కోట్లు ప్రజా ప్రభుత్వం కేటాయించిందని గుర్తు చేశారు. అవసరమైతే ఇతర శాఖల సహాయంతో మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. జాతర నిర్వహణ ఏర్పాట్లు, మేడారం మాస్టర్ ప్లాన్ డిజైన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి... ఆయన అనుమతి తీసుకున్న తర్వాత ముందుకు వెళతామన్నారు. మేడారం అభివృద్ధి ప్రతి దశలో పూజారుల ను భాగస్వామ్యం చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మల త్యాగాన్ని ఔన్నత్యాన్ని మరింత చాటి చెప్పే విధంగా మేడారం ఆలయ ప్రాంగణాన్ని సిద్ధం చేస్తామన్నారు. సమ్మక్క, సారలమ్మ దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వస్తుందని మంత్రులు చెప్పారు. దేశ విదేశాల నుంచి వచ్చే వారి కోసం సకల సౌకర్యాలు కల్పించేందుకు పట్టిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు జరిగితే మేడారం జాతర మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతర సమయంలో వెహికల్ మేనేజ్మెంట్ సరైన విధంగా ఉండేలా డిజైన్‌లు రూపకల్పన చేయాలన్నారు. ప్యూరిఫైడ్ వాటర్ అందించాలని మంత్రి సురేఖ సూచించారు. బెల్లం కింద పడకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి అడ్లూరి సలహానిచ్చారు. బ్యాటరీ వెహికల్స్ ను వినియోగించుకోవాలన్నారు. క్రౌడ్ మేనేజ్ మెంటుకి ఏఐ ఎనబుల్డ్ కెమోరాలను ఉపయోగించాలన్నారు. సేవా పద్ధతిన భక్తులను మ్యాన్ పవర్ కింది వినియోగించుకోవాలన్నారు. వనజాతర వస్తున్న తరుణంలో దారి పొంటి ఉన్న టెంపుల్స్ ను కూడా అవసరమైన మేరకు అలంకరణ చేయాలన్నారు. ఈ క్రమంలో భక్తులు ఆయా టెంపుల్‌లను దర్శించుకుంటారని మంత్రి సురేఖ చెప్పారు. జాతర వెళ్ళే దారి ఇందిరా మహిళా క్యాంటీలను ద్వారా తినుబండారాలను అందే విధంగా చూడాలన్నారు. అవసరమైతే అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలను వివిధ ప్రదేశాల్లో ఉపయోగించుకొని తగు సేవలు భక్తులకు అందజేయాలన్నారు. జాతర విజయవంతం రహదారులపై ఆధారపడి ఉంటుందని... అందుకే, మేడారం - ఊరట్టం, మేడారం - కన్నెపల్లితో పాటు మరో నాలుగు మార్గాల విస్తరణ పనులు చేపడుతున్న వివరాలు మంత్రులకు అధికారులు తెలిపారు. నేషనల్ హైవే అధికారులతో అవసరమైతే మరొకసారి రివ్యూ చేయాలని మంత్రులు నిర్ణయించారు. సమ్మక్క, సారక్క అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పూర్వం నుంచి చోటుచేసుకున్న మార్పులు, పూజారుల ప్రమేయం, అంగీకారంతోనే చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని... మాస్టర్ ప్లాన్ లో భాగంగా దాన్ని క్రమబద్ధీకరించే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. డిసెంబర్ వరకు ఎంతమేరకు వర్కులు పూర్తవుతాయో చెప్పాలన్నారు. మాస్టర్? ప్లాన్?లో మొత్తం రెండు ఫేజ్?లు గా స్థానికంగా అభివృద్ధి పనులు చేపడుతున్నరని అన్నారు.

### మొత్తం రూ. 236.2 కోట్లతో మాస్టర్ రూపొందించగా - అందులో పలు అంశాలకు కేటాయింపులు:


- గద్దెల అభివృద్ధికి రూ. 58.2 కోట్లు
- గద్దెల వద్ద కళాకృతి పనులకు రూ. 6.8 కోట్లు
- జంపన్న వాగు అభివృద్ధి కోసం రూ. రూ39 కోట్లు.
- భక్తుల అకామిడేషన్? నిమిత్తం రూ. 50 కోట్లు
- రోడ్ల అభివృద్ధి నిమిత్తం రూ. 52.5 కోట్లు
- మిగతావి ఇతరత్రా ఖర్చుల నిమిత్తం వెచ్చించనున్నారు.

వెలుతురు

## ప్రపంచంలో అత్యంత పెద్ద కుంభకోణం

# కాళేశ్వరం స్కాం...






**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 03:**
ప్రపంచంలో అత్యంత పెద్ద కుంభకోణం కాళేశ్వరం స్కాం అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కేసీఆర్ బిడ్డ కవిత కూడా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని అంగీకరించిందన్నారు. కాళేశ్వరం విచారణ విషయంలో కాంగ్రెస్ పార్టీ డబుల్ గేమ్ ఆడుతోందన్నారు. అసెంబ్లీలో సీబీఐ విచారణ చేయాలని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం... హైకోర్టులో మాత్రం సరైన వాదనలు విన్పించకుండా బీఆర్ఎస్ కు రిలీఫ్ వచ్చేలా చేశారన్నారు. బీఆర్ఎస్ నేతలు చేసిన స్కాంల విషయంలో ఎడతెరిపి లేని విచారణలతో జాప్యం చేస్తూ దోషులు తప్పించుకునేలా చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ కొనుగోళ్ల అక్రమాలపై నివేదిక వచ్చినా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ అంశంతోపాటు ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ కేసు, గొర్రెల స్కాం కేసులను సీబీఐ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు లేఖ రాయడం లేదని ప్రశ్నించారు. నక్సలిజం ఫిలాసఫీ అని రేవంత్ రెడ్డి మాట్లాడితే కాంగ్రెస్ కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి దానికి అనుకూలంగా మాట్లాడటం విడ్డూరమన్నారు. నక్సలైట్లు కాల్చి చంపిన కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులైన శ్రీధర్ బాబు, పర్ణికారెడ్డి నక్సలిజం ఫిలాసఫీని ఆమోదిస్తారా? అని ప్రశ్నించారు. నక్సలైట్ల విషయంలో కేంద్రం వెరీ క్లియర్ గా ఉందని, వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని అంతమొందించి తీరుతామని ఉద్ఘాటించారు.
బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పగ్గాలు చేపట్టాక తొలిసారి కరీంనగర్ కు విచ్చేసిన నూతన అధ్యక్షులు రామచంద్రావుకు బీజేపీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా కరీంనగర్ లోని కొండా సత్యలక్ష్మీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్ష, కార్యదర్శుల సమావేశంలో బండి సంజయ్ భావో బండి సంజయ్ ప్రసంగంలోని హైలైట్స్...
బీజేపీ స్టేట్ చీఫ్ ఎన్. రామచంద్రరావు పార్టీకి చేసిన సేవలు, త్యాగాలు, ప్రజల కోసం చేసిన పోరాటాలు అనేకం. కష్టపడి పనిచేస్తే పదవులు దక్కుతాయనడానికి రామచంద్రరావు ఉదాహరణ. ఎంతో మంది కార్యకర్తలు అరెస్టైతే కోర్టుల్లో వాదించి వారిని విడిపించిన నాయకుడు రామచంద్రరావు. బీజేపీలో అద్భుతమైన లీగల్ టీం ఉంది. కాంగ్రెస్ కు సరైన లీగల్ టీం లేదు కాబట్టే అన్నింట్లోనూ ఫెయిలవుతున్నారు. రామచంద్రరావు అధ్యక్షుడు కావడం కార్యకర్తల్లో విశ్వాసం ఏర్పడింది. తెలంగాణలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా రామచంద్రరావు నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం. రామచంద్రావు ఆధ్వర్యంలో గొల్లకొండ కోటపై కాషాయ జెండా ఎగరేయడం తథ్యం.బీఆర్ఎస్ పార్టీ పేరెత్తితే జనం అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీతో కుమ్మక్కై వత్తాసు పలుకుతున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలిపించి రామచంద్రరావుకు అప్పగిస్తా. పోటీ చేసే అభ్యర్థులను గెలిపించే బాధ్యత నాది.
కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ సింబల్ పై పోటీ చేసే బీజేపీ అభ్యర్థులను గెలిపించండి. ఏ గ్రామంలోనైతే బీజేపీ అభ్యర్థిని ఎంపీటీసీగా గెలిపించుకుంటారో... ఆ గ్రామానికి 5 లక్షల రూపాయలు ఇస్తా. ఏ మండలంలోనైతే బీజేపీ అభ్యర్థిని జడ్పీటీసీని గెలిపించుకుంటారో ఆ మండలానికి 10 లక్షలు ఇస్తా. దీంతోపాటు మొన్నటి దాకా సర్కార్ స్కూళ్లలో చదివే టెన్త్ క్లాస్ విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసినం. బీజేపీని గెలిపించిన వెంటనే 9వ తరగతి విద్యార్థులకు కూడా త్వరలోనే సైకిళ్లను ఇస్తా. వచ్చే ఏడాది విద్యా సంవత్సరం ఆరంభంలోనే 1 నుండి 6వ తరగతి చదివే విద్యార్థులందరికీ మోదీ కిట్స్ ఇస్తా.
తెలంగాణలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే జరుగుతున్నాయి. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క పైసా ఇయ్యని ప్రభుత్వం ఈ దేశంలో తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సర్పంచులు చేసిన పనులకు కూడా బిల్లులు ఇవ్వకుండా మోసం చేసింది. కేంద్ర నిధుల కోసమే స్థానిక సంస్థలు నిర్వహించాలనుకుంటున్నారుఆ నిధులను దొబ్బి పోవడానికే సీఎం ఈ ఎన్నికలు నిర్వహించబోతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మోదీ నిధులిస్తున్నారు కాబట్టి ఆయన వారసులుగా పోటీ చేస్తున్న బీజేపీ కార్యకర్తలను గెలిపించాలని ప్రజలను కోరుతున్నా.
ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చే లేదు. ఇండ్లు లేక జనం అల్లాడుతున్నరు. కేంద్ర నిధులు దారి మళు ్లతున్నాయి. 6 గ్యారంటీలపై చర్చ లేదు. ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు లేక విద్యార్థులు అల్లాడుతున్నరు. ఆరోగ్యశ్రీ సేవలు బంద్ అయి రోగులు బాధ పడుతున్నరు. ఉద్యోగులు అనేక సమస్యలతో బాధపడుతున్నరు. వీటిపై అసలు అసెంబ్లీలో చర్చలే జరగడం లేదు. ప్రజా సమస్యలపై చర్చించకుండా ప్రజల దారి మళ్లించేందుకు అసెంబ్లీలో కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్





డ్రామాలాడుతున్నాయి.
ప్రపంచంలో అత్యంత పెద్ద కుంభకోణం కాళేశ్వరం స్కాం. కేసీఆర్ సొంత బిడ్డ కేసీఆర్ కూడా కాళేశ్వరంలో అవినీతి జరిగిందని అన్నారు. కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని మొట్టమొదట డిమాండ్ చేసింది నేనే. 20 నెలలుగా విచారణ చేయకుండా కేసును నీరుగార్చిన చరిత్ర కాంగ్రెస్ దే. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికతో సంబంధం లేకుండా ఎందుకు సీబీఐ విచారణ జరపాలని లేఖ రాయడం లేదు? కాళేశ్వరంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు, అధికారుల ఇండ్లపై దాడుల్లో వందల, వేల కోట్ల రూపాయల ఆస్తులు బయటపడ్డాయి... జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై చర్యలేవి? యాక్షన్ టేకెన్ రిపోర్ట్(ఏటీఆర్) ఏది? సీబీఐకి ఇచ్చి చేతులు దులుపుకుని కోర్టులో సరైన వాదనలు విన్పించకుండా కేసును నీరుగార్చి కేసీఆర్ కుటుంబాన్ని కాపాడాలనే కుట్రలు చేస్తారా? కాళేశ్వరంపై వాదనలు విన్పించడంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలైమంది. కాళేశ్వరం అవినీతి, అక్రమాలపై నేరుగా ఆధారాలు చూపుతూ సీబీఐ విచారణ కోసం లేఖ రాస్తే హైకోర్టులో కేసీఆర్ కు రిలీఫ్ వచ్చేదే కాదు... అట్లా రాయకుండా రెండేండ్లుగా ఎందుకు జాప్యం చేసి కేసును నీరుగార్చారు. ఏదేమైనా కాళేశ్వరం స్కాం బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదు.
విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంపైనా జస్టిస్ మదన్ బి.లోకుర్ కమిషన్ నివేదిక ఇచ్చింది కదా? ఆ రిపోర్ట్ పై ఇప్పటిదాకా ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఆ రిపోర్ట్ ను ఎందుకు దాచిపెట్టారు? బీఆర్ఎస్ నుండి ఎన్ని పైసలు తీసుకున్నరు?.. సీబీఐ జరపాలని లేఖ ఎందుకు రాయడం లేదు? కోర్టు ఎక్కడా ఈ స్కాంపై సీబీఐ విచారణ వద్దని చెప్పలేదు కదా?
గొర్రెల స్కాంలో సూత్రధారులపై చర్యలేవి? వందల కోట్ల అవినీతి బయటపడ్డా ఇంకా ఎందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదు? వాళ్లను కాపాడుతున్నందుకు ఎన్ని వందల కోట్ల ముడుపులు ముట్టాయి? సీబీఐ విచారణ ఎందుకు జరిపి ప్రజాధనాన్ని దోచుకున్న దొంగలను ఎందుకు జైలుకు పంపడం లేదు? వాళ్ల ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోవడం లేదు? ఫార్ములా ఈ రేస్ స్కాం పేరుతో ప్రతిసారి ట్విట్టర్ టిల్లును విచారణకు పిలిచి డ్రామాలాడుతున్నారే తప్ప చర్యలేవి? తప్పు జరిగిందని, అవినీతి జరిగిందని మీరే అనేకసార్లు చెప్పారు కదా? ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ఈ స్కాంలో విదేశీ సంస్థ పాత్ర ఉంది కదా? మరి ఈ కేసును సీబీఐ



విచారణ ఎందుకు ఇవ్వడం లేదు?
ఫోన్ ట్యాపింగ్ కేసును డైలీ సీరియల్ లా రెండేండ్ల నుండి ఎందుకు డ్రామాలాడుతున్నట్లు? పెద్దాయన (కేసీఆర్) చెబితేనే ఫోన్ ట్యాపింగ్ చేశామని రాధాకిషన్ రావు వాంగ్మూలమిచ్చారు కదా? తండ్రీ కొడుకు కలిసి వేల కుటుంబాల జీవితాలను నాశనం చేశారు కదా? మరి వాళ్లపై చర్యలేవి? ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు, విదేశీ సంస్థలు ఇమిడి ఉన్నాయి కదా? కేంద్ర పెద్దల, జడ్జీల ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు మీరే చెప్పారు కదా? మరి ఈ కేసును సీబీఐకి ఎందుకు ఇవ్వడం లేదు? విదేశాల నుండి నువ్వు రాకపోతే ప్రభాకర్ రావు ఆస్తులు జప్తు చేస్తామని కోర్టులో వాదించిన ప్రభుత్వం ప్రభాకర్ రావు వచ్చాక ఎందుకు వదిలేసినట్లు?
ఇన్ని స్కాంలు జరిగితే విచారణ చేయకుండా, కాళేశ్వరం అంశాన్ని దారి మళ్లించడానికి కాంగ్రెస్ లోని కొందరు నాయకులు బీఆర్ఎస్ తో కుమ్మక్కై కవిత అంశాన్ని తెరమీదకు తెచ్చి పార్టీ అంతర్గత అంశంపై చర్చ జరిగేలా చేస్తున్నారు... ప్రజలకు కావాల్సింది ఇవా? వాళ్ల సమస్యలు పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, బీఆర్ఎస్ స్కాంలపై విచారణ జరిపి దోషులను జైలుకు పంపకుండా కవిత పేరుతో డ్రామాలాడుతున్నారు. ఈ డ్రామాలతోనే స్థానిక సంస్థల్లో పోటీ చేసి గెలవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ చూస్తున్నాయి.
కాళేశ్వరం స్కాంపై సీబీఐ విచారణ చేసేందుకు సిద్ధమైందని తెలిసింది. వెంటనే ఆ స్కాంకు సంబంధించిన ఆధారాలు సీబీఐకి అందించాలి. అట్లాకాకుండా బీఆర్ఎస్ ను కాపాడేందుకు కావాలనే కోర్టులో బలహీన వాదనలు చేయడం సరికాదు..
అందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ డ్రామాలపై రామచంద్రరావు ఆధ్వర్యంలో గల్లీగల్లీలో ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నాం..
వరదల్లో కామారెడ్డి కొట్టుకుపోయింది. అట్లాగే కాంగ్రెస్ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ కూడా ఆ వరదల్లోనే కొట్టుకుపోయింది. ఎందుకంటే కామారెడ్డి డిక్లరేషన్ లో 10 శాతం ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తామనే ప్రస్తావనే లేదు. 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీ రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్ లో చెప్పారు. కానీ అసెంబ్లీలో మాత్రం 10 శాతం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు చేసి గవర్నర్ కు పంపింది.... ప్రజలకు మీ సంగతి అర్థమైంది. మీకు దమ్ముంటే లోకల్ బాడీ ఎన్నికలు జరపండి. ప్రజలు మీ సంగతి చూసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు తప్పించుకోవడానికే బిల్లుల పేరుతో జాప్యం చేస్తున్నారు.
10.బీఆర్ఎస్ చేసిన అవినీతి స్కాంలన్నింట్లోనూ బాధ్యులుపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడానికి ప్రధాన కారణం కేసీఆర్ తో కాంగ్రెస్ పెద్దలు లాలూచీ పడటమే. అందుకే విచారణల పేరుతో జాప్యం చేస్తున్నారు. దొంగలు దొరకకుండా ఆధారాలు మాయం చేసే అవకాశం ఇస్తున్నారు. కోర్టుల్లో సరైన ఆధారాలు సమర్పించకుండా, గట్టిగా వాదనలు చేయకుండా కేసును వీక్ చేస్తూ దోషులను కాపాడుతున్నారు. అందుకు ప్రతిఫలంగా కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీలపై ప్రజల్లో చర్చ జరగకుండా కాంగ్రెస్ కు సహకరిస్తూ బీఆర్ఎస్ రోజుకో డ్రామాలాడుతోంది. ఇంకెన్నాళ్లీ లాలూచీ డ్రామాలు?.. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు.
నక్సలిజం ఓ ఫిలాసఫీ (సిద్ధాంతం) అని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతుంటే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి అనుకూలంగా మాట్లాడుతుంటే ఏమనాలి? తుపాకీ పట్టి అమాయకులను, ఆదివాసీ బిడ్డలను చంపడం సిద్ధాంతమా? అడ్డొచ్చిన పోలీసులను మందు పాతరలు పెట్టి చంపడమే నక్సలిజం సిద్ధాంతమా? నుదిటిపై తుపాకీ పెట్టి కాలుస్తుంటే వాళ్లతో చర్చలు జరపాలా? కాంగ్రెస్ నేతలను కాల్చి చంపిన చిట్టెం నర్సిరెడ్డి మనవరాలు పర్ణికారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. అట్లాగే శ్రీపాదరావును కాల్చి చంపారు. ఆయన కొడుకు శ్రీధర్ బాబు నక్సలైట్ల ఫిలాసఫీకి మద్దతిస్తారా? రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను తుపాకీ గొట్టంతో కూలుస్తామంటే ఊరుకుందామా? జాతీయ జెండాలను తగలబెట్టి నల్లా జెండాలను ఎగరేసే నక్సలైట్ల ఫిలాసఫీకి మద్దతిస్తారా? ప్రభుత్వంలో నక్సలైట్ల తుపాకీ గొట్టానికి స్థానం లేదు. అందుకే వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలించి తీరుతాం. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఆదివాసీ గూడెంలకు, తండాలకు, మారుమూల పల్లెలకు అందిస్తాం.
ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలను గెలిపించేందుకు మేమంతా కష్టపడ్డాం. బీజేపీ కార్యకర్తల కమిట్ మెంట్, మొండి పట్టుదల, కసితోనే ఈ గెలుపు సాధ్యమైంది. రామచంద్రరావు ఈ బాధ్యత అప్పగించినా కష్టపడి పనిచేసేందుకు సిద్ధం. మీ నాయకత్వంలో పనిచేస్తూ తెలంగాణలో కాషాయ జెండా ఎగరేసేలా చేద్దాం.
నక్సలైట్ల విషయంలో మా లైన్లు వెరీ క్లియర్. వచ్చే మార్చి నాటికి నక్సలిజాన్ని నిర్మూలించి తీరుతాం. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ఆదివాసీ గూడెంలకు, తండాలకు, మారుమూల పల్లెలకు అందిస్తాం.
ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులు మల్క కొమరయ్య, అంజిరెడ్డిలను గెలిపించేందుకు మేమంతా కష్టపడ్డాం. బీజేపీ కార్యకర్తల కమిట్ మెంట్, మొండి పట్టుదల, కసితోనే ఈ గెలుపు సాధ్యమైంది. రామచంద్రరావు ఈ బాధ్యత అప్పగించినా కష్టపడి పనిచేసేందుకు సిద్ధం. మీ నాయకత్వంలో పనిచేస్తూ తెలంగాణలో కాషాయ జెండా ఎగరేసేలా చేద్దాం.
కార్యకర్తలారా... మీ అందరినీ గెలిపించుకునే బాధ్యత నాది. అట్లాగే గెలిసే అభ్యర్థులకే టిక్కెట్లు ఇస్తాం. సర్వే చేస్తున్నాం. ఇందులో వర్గాలకు తావు లేదు. అట్లాగే కష్టపడి పనిచేసే కార్యకర్తలు గెలిచే అవకాశం లేకపోతే పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులిచ్చి న్యాయం చేస్తాం.

# సంపాదకీయం.. అవినీతి కారణంగా బిఆర్ఎస్ అంతర్ధానం !

బిఆర్ఎస్‌లో అవినీతి ఉందని, పాలనను అడ్డంపెట్టుకుని అందరూ బాగా సంపాదించారని కవిత వ్యాఖ్యల వల్ల మరింత స్పష్టం అయ్యింది. హరీష్ రావు, సంతోష్ రావులు బాగా సంపాదించారని కవితే స్వయంగా ఆరోపిస్తున్నారు. వారే మీడియాను ఆడిస్తున్నారని కూడా చెప్పారు. కెసిఆర్ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడమే వారి లక్ష్యం అని కూడా ఆమె చెప్పారు. మొత్తంగా ఇదంతా బిఆర్ఎస్‌లో అంతర్గత సమస్యలకు కారణంగా చూడాలి. అన్నింటికీ మించి కెసిఆర్ కేవలం ఫామ్‌హౌజ్‌కే పరిమితంకావడం, అధికారం పోగానే ప్రజల్లోకి రాకపోవడం వల్ల పార్టీ పతనానికి చేరిందని చెప్పాలి. అధికారం ఉండగా అవినీతిలో మునిగారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను కాలరాశారు. అధికారం, డబ్బుతో విర్రవీగారు. తాను అచేతనంగా మారడంతో సమస్యలు వస్తున్నాయని ఇప్పుడు కెసిఆర్ గుర్తించడం లేదు. తాను కట్టిన కాళేశ్వరం సకల సమస్యలకు సమాధానమని చెప్పిన నేత, దానిని ఎదుర్కొనేందుకు ముందుకు రాలేదు. అసెంబ్లీకి ముఖం చాటేశారు. ఇదంతా కేవంల ఏడాదిన్నరలో పార్టీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయే దశకు చేరుకోవడానికి కేవలం కెసిఆర్ స్వయంకృతం తప్ప మరోటి కాదు. నాయకుడు అన్న వాడు ఎప్పుడూ ఉత్సాహంగా ముందుకు సాగాలి. అవినీతిని ఎదుర్కోవాలి. అధికారం ఉంటే అనుభవించమే కాదు...అవమానాలు వచ్చినా ధైర్యంగా నిలబడాలి. అప్పుడే నేతగా ప్రజలు గుర్తిస్తారు. కవిత వ్యవహారంతోఇప్పుడు బిఆర్ఎస్ అవినీతి పతాక స్థాయిలో కనిపిస్తోంది. అనేక పథకాల ద్వారా పార్టీలో ఉన్నవారు ఎంతగా సంపాదించారో ప్రజలకు అర్థం అయ్యింది. ప్రాంతీయ పార్టీలు అన్నీ తట్టుకుని నిలబడగలగాలంటే నేత అన్నవాడు గట్టిగా ఉండాలి. కానీ కెసిఆర్ తనకు నచ్చిన విధంగా ఉంటూ వచ్చాడు. అధికారం ఉన్నప్పుడు నడిచింది. కానీ ఇప్పుడు నడవదు. అందుకే బిఆర్ఎస్ మనుగడ అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్






సీఎంగా మూడు దశాబ్దాల క్రితం ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబునాయుడు ఇంకా అదే ఉత్సాహంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తనను జైలులో వేసినా గట్టిగా నిలబడి కొట్లాడాడు. పార్టీలో కార్యకర్తలకు, నేతలకు ధైర్యం ఇచ్చాడు. తరిగి పార్టీని అధికారంలోకి తీసుకుని వచ్చే వరకు విశ్రమించలేదు. ఇది చంద్రబాబు పట్టుదలకు తార్కాణంగా చూడాలి. చంద్రబాబుతో పోలిస్తే వయసులో చిన్నవాడైనా కెసిఆర్ అంతగా ఏనాడూ నిలబడలేకపోయారు. ఇకపోతే  ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో ఏ పార్టీతో సంబంధాలు పెట్టుకున్నాయన్నది ప్రధానం కాదు. అవసరార్థం అది కామన్‌గా జరుగుతూనే ఉంటుంది. కాదనుకుంటే వదిలేస్తుంటారు. చంద్రబాబులాగా కరుణానిధి, మమతా బెనర్జీ, జయలలిత కూడా బీజేపీతో నూ కాంగ్రెస్ తోనూ సంబంధాలు ఏర్పర్చుకున్నవారే. అయినా వారు తమ అస్తిత్వాన్ని పణంగా పెట్టి రాజకీయం నెరప లేదు. వారు ప్రజల్లో ఉంటూనే రాజకీయం చేశారు. ఏది జరిగినా ఓటమిని అంత సులభంగా అంగీకరించే వారు కారు. పట్టుబట్టి మళ్లీ గెలవడానికి సర్వశక్తులు ఒడ్డేవారు. ఆ తెగువ కేసీఆర్‌లో కనిపించడం లేదు. ప్రజలకు అసవరమైతే వారే ఓటేస్తారని భావించే రకంగా కెసిఆర్ ఉంటున్నారు. అందుకే ఆయన పార్టీ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పడ్డ లక్ష్యాలకు, ఆశయాలకూ దూరం కావడంతో పాటు, కెసిఆర్ నేల విడిచి సాము చేయడం వల్ల పార్టీ ఈ దుస్థితిని ఎదుర్కొంటుందన్నది ముమ్మాటికి నిజం. కవితను బయటకు పంపడం ద్వారా ఓ రకంగా పార్టీకి మరిన్ని సంక్షోభాలు తెచ్చుకున్న ట్లుగానే గుర్తించాలి.  అలాగే పార్టీ అవినీతి పాలన చేసిందన్న వాదనకు కవిత వ్యాఖ్యలు బలం చేకూర్చాయి. హరీష్ రావు, సంతోష్‌లపై అవినీతి మరకలు వేసినా అవి నేరుగా కెసిఆర్‌కే తాకాయని గుర్తించాలి. ప్రాంతీయ నాయకులకున్న స్థిరత్వం, లక్ష్యశుద్ధి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కేసీఆర్ దగ్గర లేకపోవడం కూడా ఇందుకు కారణంగా చూడాలి. అధికారం వస్తే అనుభవించండ లేకుంటే వదిలేయడం అన్న తార్కిక ధోరణిలో కెసిఆర్ ఉండడం కూడా పార్టీ పతనానికి కారణంగా చూడాలి. తెలంగాణ ప్రజల్లో, ముఖ్యంగా సామాజికంగా బలహీనవర్గాల్లో ఆకాంక్షలు పెరిగిపోయిన క్రమంలో జయశంకర్, కోదండరాం వంటి అనేక మంది నేతలు నిర్మించిన ఉద్యమం ఆయన రాజకీయంగా బలపడేం దుకు తోడ్పడింది. కానీ దానిని ఆయన గుర్తించలేదు. జయశంకర్ సార్ ఎన్ని అవమానాలు ఎదురైనా ఓర్మితో భరించారు. ఇక కోదండరామ్‌తో పాటు అనేకమంది ఉద్యమకారులను కెసిఆర్ మెడపట్టి గెంటేశారు. అసోంలో అస్సాం గణపరిషత్ కూడా ఇలాగే పతనం అయ్యింది. ప్రాంతీయ పార్టీల్లో వారసులు ఉండడం, తండ్రి తరవాత వారు పెత్తనం చేయడం సహజం. మమతా బెనర్జీకి కూడా మేనల్లుడు వారసుడిలా వెన్నంటి ఉన్నారు. కాని ఆ పార్టీలేవీ వారసుల మూలంగా అంతర్గత సంక్షోభంలో చిక్కుకోలేదు. ములాయం, లాలూప్రసాద్, కరుణానిధి, శిబూ సోరెన్‌ల వారసులే ఆ తర్వాత ముఖ్యమంత్రులయ్యారు. పైగా వారి బంధువులు కూడా పార్టీల్లో, పదవుల్లో కీలక స్థానాలు పోషించారు. జయలలిత ఉన్నప్పుడు నెచ్చెలి శశికళ పెత్తనం చేశారు. కానీ పార్టీని దెబ్బతీయలేదు. కాంగ్రెస్‌లో కూడా రాహుల్, ప్రియాంక ఎంత సన్నిహితంగా, ఎవరి బాధ్యతలు వారు నెరవేరుస్తూ, అధికారం కోసం చెమటోడుస్తున్నారు. కానీ బీఆర్ఎస్ కుటుంబసభ్యుల వల్ల దెబ్బతింటున్నదని గట్టిగా చెప్పానికి కవిత సస్పెన్షన్ కారణంగా చూడాలి. కేసీఆర్ పార్టీని గాలికి వదిలేయడం, ప్రజల్లోకి రాకపోవడం, చుట్కోటరీల ప్రభావానికి లోను కావడం వల్ల కవితను దూరం చేసుకోవడంతో పాటు, ఇంటిగుట్టును రోడ్డున పడేసుకున్నారు. కెసిఆర్ అప్రమత్తంగా, జాగ్రత్తగా లేకపోవడం వల్ల, సరైన మార్గదర్శకత్వం అందించపోవడం వల్ల, ఎవరి పాత్ర ఏంటన్నది నిర్దేశించకపోవడం వల్ల ఇప్పుడు కోలుకోలేని దెబ్బతిన్నారనే చెప్పాలి.  కెసిఆర్ విషయాన్ని గ్రహించరు...ఎవరైనా ఏమైనా చెబితే అర్థం చేసుకోరు. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పగలనని ఆశించిన కెసిఆర్ అలా ప్రచారం చేసుకున్న తీరు కూడా ఆయనలోని నాయకత్వ లోపాన్ని ఎత్తి చూపింది. ఫాంహౌజ్‌లో ఉంటూ పూర్తిగా జాతీయ రాజకీయాలపై దృష్టి సారించడం సాధ్యం కాదని తెలుసుకోలేదు. ఇంటిని చక్కదిద్దుకోలేక ఇప్పుడు ప్రజల్లో అభాసు పాలయ్యారు. ఇంటిగుట్టును బయటపెట్టుకున్నారు. కాళేశ్వరం తదితర ప్రాజెక్టుల్లో అవినీతిపై విచారణ జరుగుతున్న వేళ దానిని ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలం కావడం కూడా కెసిఆర్ నాయకత్వ లోపానికి నిదర్శనంగా చూడాలి. అలాగే తనచుట్టూ రాజకీయంగా ఆలోచనలు చేసి చెప్పే అనుభవజ్ఞులను దూరం చేసుకున్నారు. కేవలం అధికారం, డబ్బు సంపాదన మత్తులో తెలంగాణను ఆగం చేసిన పార్టీగా బిఆర్ఎస్ మిగిలిపోయింది. త్వరలో అంతర్థానం అయినా ఆశ్చర్యం లేదు.

# "వాగ్దానాల పర్వతం, ఫలితాల శూన్యం బీజేపీ పదేళ్ల పాలన"

**బీజేపీ పదేళ్ల పాలన ప్రజలకు ఆశలు రేపినంతగా ఫలితాలు ఇవ్వలేకపోయింది. 'అచ్చే దిన్', ఉద్యోగాల లక్షల వాగ్దానాలు, రైతుల ఆదాయం రెట్టింపు మాటలు గాలిలో కలిసిపోయాయి. నోట్ల రద్దు, జీఎస్టీ సంస్కరణలు సాధారణ ప్రజలకు ఇబ్బందులు మాత్రమే తెచ్చాయి. పెరుగుతున్న నిరుద్యోగం, పెరిగిన ధరలు, కూలిపోతున్న మధ్యతరగతి ఆశలను ఛిన్నాభిన్నం చేశాయి. కాశ్మీర్, రామమందిరం వంటి భావోద్వేగ అంశాలతో రాజకీయ లాభం పొందినా, సాధారణ ప్రజల జీవన ప్రమాణాల్లో నిజమైన మార్పు కనిపించలేదు. వాగ్దానాల పర్వతం ఎక్కించినా, ఫలితాల్లో శూన్యం మిగిలింది. ఇకదేశం ఒక దశాబ్దం కాలం బీజేపీ పాలనలో గడిపింది. 2014లో మొదటిసారి అధికారం చేపట్టినప్పుడు బీజేపీ ఇచ్చిన నినాదాలు, వాగ్దానాలు, కలలు దేశ ప్రజల్లో ఒక కొత్త ఆశను రేకెత్తించాయి. "ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు వస్తాయి", "పెట్రోల్ ధర లీటరుకు 35 రూపాయలే ఉంటుంది", "నల్లధనం తిరిగి వచ్చి ప్రతి పౌరుడి ఖాతాలో 15 లక్షలు జమ అవుతాయి", "మహిళలు భద్రంగా ఉంటారు", "రైతులు అభివృద్ధి చెందుతారు" అంటూ ఇచ్చిన హామీలు ఆ కాలంలో ప్రజల విశ్వాసాన్ని ఆకర్షించాయి. కానీ పదేళ్ల కాలం పూర్తయ్యేసరికి ఆ వాగ్దానాల్లో ఒక్కటీ సాకారం కాలేదు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్య విలువలు క్షీణించాయి, ఆర్థిక వ్యవస్థ కుదేలయింది, సామాజిక సౌభ్రాతృత్వం దెబ్బతింది. ఈ నేపథ్యంలో దేశం బీజేపీని ఎందుకు ఓడించక తప్పదో ఒకసారి సమగ్రంగా పరిశీలిద్దాం.**

బీజేపీ పాలనలో మొదటి పెద్ద మోసం ఉద్యోగాలే. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ హామీ ఇచ్చారు. కానీ వాస్తవం ఏమిటి? CMIE గణాంకాల ప్రకారం 2022-23లో దేశంలో నిరుద్యోగం 45 ఏళ్లలోనే అత్యధిక స్థాయికి చేరింది. SSC, రైల్వే, ప్రభుత్వ నియామక పరీక్షల కోసం లక్షలాది మంది యువత సంవత్సరాల తరబడి కష్టపడినా ఉద్యోగాలు రాలేదు. పరీక్షలు రద్దు కావడం, పేపర్లు లీక్ కావడం, నియామకాలు ఆలస్యమవడం వంటి కారణాలతో యువత నిరాశలో మునిగిపోయింది. కోట్ల మంది పట్టభద్రులు చిల్లర పనులు చేస్తూ జీవించాల్సి వచ్చింది. "స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా" అనే నినాదాలు వాస్తవానికి ఒక మాయాజాలం తప్ప మరేం కావు.ఆర్థిక రంగం విషయానికి వస్తే బీజేపీ పాలనలో పేదవాడికి ఊరట లేకుండా, ధనవంతుడికి లాభం కలిగే విధానాలే తీసుకొచ్చారు. 2014లో పెట్రోల్ ధర 60 రూపాయల చుట్టూ ఉండగా, "మేము వస్తే 35 రూపాయలకు తగ్గిస్తాం" అన్నారు. కానీ వాస్తవంగా 2023-24 నాటికి లీటరు పెట్రోల్ 110 రూపాయలకు చేరుకుంది. డీజిల్ ధర కూడా పెరిగి రైతులపై మరింత భారమయ్యింది. గ్యాస్ సిలిండర్ ధర 1200 రూపాయలకు చేరి మధ్యతరగతి, పేదల వంటగదుల్లో మంటలు ఆరిపోయే స్థితి వచ్చింది. నిత్యావసర వస్తువులు అన్నీ రికార్డు స్థాయిలో పెరిగాయి - పప్పులు, వంటనూనె, కూరగాయలు, పాలు - ఇవన్నీ పేదలకు అందని ద్రవ్యాలుగా మారాయి.

ప్రజల ఆర్థిక స్థితిని మరింత దిగజార్చిన మరో అంశం నిరంతర పన్నుల భారమే. GST పేరుతో చిన్న వ్యాపారుల్ని దెబ్బతీశారు. కొత్త కొత్త టాక్సులు వేసి సాధారణ పౌరుడి నోట్లోంచి చివరి ముద్దను కూడా లాగేశారు. కానీ ఇదే సమయంలో పెద్ద కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారు. దేశ సంపద కొద్దిమంది అగ్రవర్ణ కార్పొరేట్ల చేతుల్లో కేంద్రీకరించారు. ఇది సమానత్వానికి వ్యతిరేకంగా, సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఉన్న దోపిడీ విధానం.సామాజిక రంగంలో బీజేపీ పాలన అత్యంత ప్రమాదకర మార్పులను తెచ్చింది. ఈ దేశం పలు మతాల, పలు భాషల, పలు జాతుల సమ్మేళనం. గాంధీ, నెహ్రూ, అంబేద్కర్ కలగన్న భారత్ సౌభ్రాతృత్వం, లౌకికతపై ఆధారపడి ఉంది. కానీ బీజేపీ పాలనలో మతపరమైన ద్వేషం పెరిగింది. ముస్లింలను పౌరసత్వం కోల్పోయేలా చేసే CAA, NRC వంటి చట్టాలను తెచ్చారు. "ఘర్ వాపసి" పేరుతో దళితులను హింసించారు. గోవు పేరుతో ముస్లింలను, దళితులను కొట్టి చంపిన ఘటనలు దేశాన్ని కలవరపరిచాయి. మసీదులు, చర్చిలపై దాడులు పెరిగాయి. "లవ్ జిహాద్" అనే పుకారు పేరుతో యువతను వేధించారు. ఫలితంగా మైనార్టీలు, దళితులు, ఆదివాసీలు భయంతో జీవించాల్సిన పరిస్థితి వచ్చింది. దళితులు, ఎస్టీలు, ఓబీసీలు - వీరిని బీజేపీ "మా వెన్నెముక" అని చెబుతూ రాజకీయంగా వాడుకున్నారు కానీ వాస్తవంగా వారిని అణగదొక్కే విధానాలే అమలు చేశారు. దళితులపై దాడులు పెరిగినా, ఎస్టీ హక్కులు ఉల్లంఘించబడినా, ఓబీసీలకు సముచిత ప్రాతినిధ్యం ఇవ్వకపోయినా బీజేపీ నాయకత్వం కళ్ళు మూసుకుంది. మానవ హక్కుల కంటే మతపరమైన మోజు ముఖ్యమైపోయింది. రైతుల ఉద్యమం దేశ చరిత్రలోనే అతిపెద్ద నిరసన. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 13 నెలల పాటు డిల్లీ సరిహద్దుల్లో కూర్చుని పోరాటం చేశారు. వందలాది మంది రైతులు చలిలో, ఎండలో, వర్షంలో ప్రాణాలు కోల్పోయారు. కానీ వారిని గౌరవించడం బదులు బీజేపీ వారిని "దేశ ద్రోహులు", "ఖలిస్తానీలు" అని ముద్ర వేసింది. చివరికి రైతులే గెలిచారు, చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. కానీ రైతుల గౌరవాన్ని తుంచేసిన ఈ పాలనను ప్రజలు మరచిపోలేరు.మహిళల భద్రత విషయానికొస్తే బీజేపీ ఇచ్చిన హామీలు కేవలం మాటలే. "బేటీ బచావో, బేటీ పడావో" నినాదం వాస్తవానికి ఒక ప్రచార పథకం తప్ప మరోకటి కాదు. హర్యానాలో ఉన్నావ్ ఘటన, ఉత్తరప్రదేశ్‌లో హాతరాస్ అత్యాచారం, మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించిన దారుణం - ఇవన్నీ బీజేపీ పాలనలోనే జరిగాయి. మహిళలు భయంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. న్యాయం కోసం పోరాడిన బాధితులకు మద్దతు ఇవ్వడం బదులు వారినే మౌనంగా ఉంచే ప్రయత్నం జరిగింది.మణిపూర్ ఘటన ఈ దేశ చరిత్రలోనే నల్ల అధ్యాయంగా మిగిలిపోతుంది. జాతి ఘర్షణలతో రాష్ట్రం రక్తపాతంలో మునిగిపోయింది. రెండు మహిళలను నగ్నంగా ఊరేగించిన వీడియో దేశాన్ని కుదిపేసింది. వందలాది ఇళ్లు దహనం అయ్యాయి, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. కానీ ప్రధాని నరేంద్ర మోడీ 80 రోజులు నోరు విప్పలేదు. ఈ మౌనం నాయకత్వ వైఫల్యానికి ప్రతీకగా నిలిచింది. దేశం ఒక అతి పెద్ద అవమానాన్ని అనుభవించింది.

ప్రజాస్వామ్యానికి నాలుగు స్తంభాలు - శాసన, కార్యనిర్వాహక, న్యాయ, మీడియా. కానీ బీజేపీ పాలనలో ఈ నాలుగింటినీ హైజాక్ చేశారు. మీడియా బీజేపీ చేతిలో బందీ అయింది. పెద్ద పెద్ద ఛానళ్ళు అన్నీ మోడీ భజన చేస్తూ ప్రతిపక్షాలకు చోటు ఇవ్వలేదు. ప్రశ్నించే జర్నలిస్టులను జైలుకు పంపారు. న్యాయవ్యవస్థను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారు. స్వతంత్ర సంస్థలు అయిన సిబిఐ, ఈడి, ఐటీ - అన్నీ ప్రతిపక్ష నేతలను వేధించడానికి వాడబడ్డాయి. ప్రజాస్వామ్య ఆత్మను ఇలా నాశనం చేసిన మరో పాలన భారత చరిత్రలో లేదు. ప్రపంచవ్యాప్తంగా కూడా భారత ప్రతిష్ట దెబ్బతింది. ప్రపంచ ఆకలి సూచికలో 2023లో భారత్ 121 దేశాల్లో 111వ స్థానంలో నిలిచింది. కోట్లాది మంది ప్రజలు ఆకలితో, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రపంచ శాంతి సూచికలో భారత్ ర్యాంకులు పడిపోయాయి. మీడియా స్వేచ్ఛ సూచికలో భారత్ 180 దేశాల్లో 161వ స్థానానికి చేరింది. ప్రజాస్వామ్య సూచికలో భారత్ "పాక్షిక ప్రజాస్వామ్యం"గా వర్గీకరించబడింది. ఇవన్నీ బీజేపీ పాలనలో జరిగిన అవమానాలే.ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నీ వమ్మయ్యాయి. యువతకు ఉద్యోగాలు లేవు. రైతులకు గౌరవం లేదు. మహిళలకు రక్షణ లేదు. మైనార్టీలకు న్యాయం లేదు. పేదవాడి తలపై మాత్రం పన్నుల భారమే. మధ్యతరగతి నిత్యావసర ఖర్చులకే కుదేలైపోతుంది. ఒక వైపు కొద్ది మంది వ్యాపారవేత్తల సంపద పెరుగుతుండగా, మరో వైపు కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఇకదేశ రాజకీయాల్లో బీసీల పాత్ర అత్యంత కీలకమైనది. జనాభాలో సగానికి పైగా ఉన్నా వారికి ఇచ్చే గౌరవం మాత్రం మాటలకే పరిమితమైపోతోంది. ప్రతి ఎన్నికల సమయంలోనూ బీసీలను ఆకట్టుకునే మోసపూరిత హామీలు ఇస్తూ, అధికారంలోకి వచ్చిన తరువాత మరచిపోవడం సాధారణ రాజకీయ ధోరణిగా మారింది. ఇటీవల సంవత్సరాల్లో "బీసీ ప్రధాని" అనే నినాదాన్ని ఒక పార్టీ గర్వంగా వినిపిస్తోంది. అది ఒక ప్రతీకాత్మక విజయమే కానీ, నిజంగా బీసీల జీవన స్థాయి మారిందా, వారి హక్కులు పెరిగాయా, విద్యా రంగం లేదా ఉద్యోగ అవకాశాల్లో సమానత్వం వచ్చిందా అన్న ప్రశ్నలకు మాత్రం ఎటువంటి సానుకూల సమాధానం దొరకడం లేదు. కేవలం పదవిని ప్రతీకగా చూపించి, బీసీల మిగిలిన సమస్యలన్నింటినీ పక్కన బెట్టడం వాస్తవ రాజకీయాల్లో జరుగుతోంది. బీసీలకు న్యాయం చేయాలంటే ముందుగా వారి జనాభా ఎంతుందో అధికారికంగా తెలుసుకోవాలి. అందుకే కులగణాంకాలు అత్యంత కీలకమైనవి. ప్రతి సారి రాజకీయ నాయకులు కులగణాంకాలు చేస్తామని, వాటి ఆధారంగా బీసీలకు వారి సంఖ్యకు తగ్గట్టుగా హక్కులు ఇస్తామని మాటిస్తారు. కానీ ఆచరణలో మాత్రం ఏదీ కనిపించడం లేదు. బీహార్ ప్రభుత్వం ఇటీవల కులగణాంక సర్వే చేసి బహిరంగం చేసింది. దాని ప్రకారం బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు కలిపి 80 శాతం వరకు ఉన్నారని బయటపడింది. దీని ఆధారంగా రిజర్వేషన్లలో సవరణలు చేయాలని చర్చ మొదలైంది. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం జాతీయ స్థాయిలో కులగణాంకాలను విడుదల చేయడంలో ఆసక్తి చూపలేదు. దీని వెనుక ఉన్న ఉద్దేశ్యం బీసీల వాస్తవ శక్తి బయటపడకూడదన్నదే. జాతీయ స్థాయిలో బీసీల సంఖ్య బయటపడితే వారికి ఇచ్చే హక్కులు కూడా పెంచక తప్పదు, ఆ బాధ్యతను ఎవరూ తీసుకోవడం ఇష్టపడడం లేదు.రిజర్వేషన్ల విషయంలోనూ బీసీలు నిరంతరం అన్యాయం ఎదుర్కొంటున్నారు. ఒకవైపు రిజర్వేషన్లు ఉన్నాయనిపించినా, వాటి అమలులో అనేక లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒకే కులం ఎక్కువ శాతం రిజర్వేషన్లను ఆక్రమించుకుంటుంది. చిన్న చిన్న ఉపవర్గాలు రిజర్వేషన్ లబ్ధి నుంచి పూర్తిగా దూరమవుతున్నాయి. అంతేకాదు కేంద్ర ప్రభుత్వ రంగాల్లో బీసీల రిజర్వేషన్ల స్థానాలు పూర్తిగా భర్తీ కావడం లేదు. ఖాళీగా ఉన్న పోస్టులను అలాగే వదిలేయడం వల్ల అవకాశాలు తగ్గిపోతున్నాయి. రిజర్వేషన్లు పత్రికల్లో, చట్టపరంగా ఉన్నట్టే కానీ బీసీల జీవితాల్లో వాటి ప్రభావం చాలా పరిమితంగానే మిగిలిపోతోంది.బీహార్, కర్ణాటక రాష్ట్రాల అనుభవాలు ప్రత్యేకంగా చెప్పుకోవాలి. బీహార్‌లో కులగణాంకాల ఆధారంగా కొత్త రాజకీయ సమీకరణాలు మొదలయ్యాయి. అక్కడ బీసీలు నిజమైన శక్తిగా బయటపడ్డారు. ఇది చూసిన తరువాత ఇతర రాష్ట్రాల్లోనూ కులగణాంకాల డిమాండ్ మళ్లీ ఊపందుకుంది. అయితే కేంద్రం మాత్రం దాన్ని పట్టించుకోలేదు. కర్ణాటకలో ఎన్నికల సమయంలో బీసీలను ఆకర్షించడానికి పెద్ద పెద్ద వాగ్దానాలు చేశారు. రిజర్వేషన్లు పెంచుతామని హామీలు ఇచ్చారు. లింగాయత, వొక్కలిగ వంటి ప్రధాన వర్గాలను ప్రసన్నం చేసుకోవడంలో ప్రభుత్వాలు ఆసక్తి చూపాయి. కానీ చిన్న వర్గాలు నష్టపోయాయి. ఈ విధంగా బీసీల మధ్యే విభేదాలు పెంచే రాజకీయాలు ఆడబడ్డాయి. ఫలితంగా బీసీలు ఏకమై హక్కుల కోసం పోరాడే పరిస్థితి లేకుండా విభజన పాలసీలు పెరిగాయి.ఇదిలా ఉండగా, మరో తీవ్రమైన సమస్య దొంగ ఓట్లు. ప్రజాస్వామ్యానికి ఇది ఒక పెద్ద ముప్పు. అనేక రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలు లోపభూయిష్టంగా ఉంటాయి. చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడం, ఒకే వ్యక్తికి రెండు మూడు సార్లు ఓటు ఉండటం, ఇతర ప్రాంతాల వారిని తెచ్చి ఓటు వేయించడం వంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తుంటాయి. బీహార్, కర్ణాటకతో పాటు మరిన్ని రాష్ట్రాల్లో ఈ దొంగ ఓట్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. నిజమైన బీసీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించినా, దొంగ ఓట్లతో వారి ఆశయాలు వక్రీకృతమవుతున్నాయి. ప్రజాస్వామ్యం విలువ తగ్గిపోతోంది.మొత్తం మీద బీసీల ఆవేదన నాలుగు అంశాల చుట్టూ తిరుగుతోంది. బీసీ ప్రధాని ఉన్నా సమస్యలు పరిష్కారం కాలేదు. కులగణాంకాలు చేస్తామని చెప్పి వాయిదా వేస్తున్నారు. రిజర్వేషన్లలో సమానత్వం లేక చిన్న వర్గాలు అన్యాయానికి గురవుతున్నాయి. దొంగ ఓట్ల వల్ల బీసీ ఓటు విలువ తగ్గిపోతోంది. ఈ నాలుగు అంశాలు బీసీల రాజకీయ, సామాజిక స్థితిని దెబ్బతీస్తున్నాయి.అందువల్ల బీసీలకు నిజమైన న్యాయం చేయాలంటే కేవలం హామీలు, నినాదాలు సరిపోవు. జాతీయ స్థాయిలో కులగణాంకాలను బహిరంగం చేయాలి. జనాభాకు తగ్గట్టుగా రిజర్వేషన్లు కేటాయించాలి. ఖాళీగా ఉన్న స్థానాలను నింపాలి. ఎన్నికలలో దొంగ ఓట్లను అరికట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలి. అప్పుడు మాత్రమే బీసీల అసలు శక్తి ప్రతిఫలిస్తుంది. లేకపోతే బీసీలు ఎప్పటికీ రాజకీయ పార్టీల చేతిలో ఓట్ల బస్తాగానే మిగిలిపోతారు.ఈ నేపథ్యంలో బీజేపీని ఓడించడం కేవలం రాజకీయ పోరాటం కాదు. ఇది ప్రజాస్వామ్యాన్ని రక్షించే యుద్ధం. ఇది సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం, స్వేచ్ఛ కోసం జరిగే ఆత్మీయ తిరుగుబాటు. గాంధీ చూపిన మార్గం, అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, ప్రజలు కలగన్న స్వప్న భారత్ - ఇవన్నీ కాపాడుకోవాలంటే బీజేపీని గద్దె దించటం తప్ప వేరే మార్గం లేదు.

దేశం బీజేపీని ఎందుకు ఓడించాలి అనే ప్రశ్నకు ఒకే సమాధానం ఉంది - ఎందుకంటే బీజేపీ అన్ని రంగాల్లో విఫలమైంది. ప్రజలకు ఇచ్చిన హామీలు వమ్మయ్యాయి. ప్రజాస్వామ్యం క్షీణించింది. సమానత్వం ధ్వంసమైంది. ధరలు పెరిగాయి. ఉద్యోగాలు లేవు. భద్రత లేదు. ఆశలు అన్నీ చెదిరిపోయాయి. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజల ఓటు శక్తే మార్గం. ప్రతి పౌరుడు తన ఓటుతో సమాధానం చెప్పాలి

మన్నారం నాగరాజు



## ఇంజనీరింగ్ కళాశాలలో మరియు వర్సిటీల్లో మాదకద్రవ్యాలు నియంత్రణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి

**- దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులు మత్తుకు బానిసలవ్వడం దురదృష్టకరం.**

**- బీసీ నేత జాజుల లింగంగౌడ్**




**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:** విద్యార్థులు డ్రగ్స్ మరియు మాదకద్రవ్యాలు తీసుకోవడం దేశ భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో ముఖ్యంగా ఇంజనీరింగ్ కళాశాలలో డ్రగ్స్ వాడకం ఈ మధ్య ఎక్కువైందన్నారు. ఈ మధ్యన టెక్ మహేంద్ర వర్సిటీలో కొంత మంది విద్యార్థులు డ్రగ్స్ తో పట్టు పడటమే దానికి ఉదాహరణ. మత్తు పదార్థాలు తీసుకునే విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి కోల్పోయి మంచిదో చెడేదో ఆలోచించే విచక్షణ జ్ఞానాన్ని కోల్పోయి ఇష్టారీతిన వ్యవహర్తిస్తారు.విద్యార్థుల భవిష్యత్ పై ఇది తీవ్ర ప్రభావం పడుతుందన్నారు.డ్రగ్స్ వాడకం దానివల్ల కరిగే పరిణామాలు విద్యార్థులకు వివరించాలనీ లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు


## ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించుకున్న టిజివో నాయకులు.





**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:** విశ్వ ప్రఖ్యాతిగాంచిన ఖైరతాబాద్ మహా గణపతిని దర్శించి, ఆయన దీవెనలు పొందుకొనుటకు గాను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్, సిటీ అధ్యక్షులు గండూరి వెంకటేశ్వర్లు వారి కుటుంబము, ప్రత్యేక అర్చనలు గావించి, ఖైరతాబాద్ గణాధీశ్వరుని దర్శించి దీవెనలు పొందుకున్నారు. తెలంగాణ యావత్ ప్రజలు, ఉద్యోగులు సుఖసంతోషాలతో ఉండాలని గణాధీశ్వరుని ప్రార్థించారు ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర మహిళా విభాగ అధ్యక్షురాలు దీప రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ శిరీష రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రామరావు, హైదరాబాద్ జిల్లా జాయింట్ సెక్రెటరీ డాక్టర్.క్రొత్త విద్యాసాగర్, టిన్జీవో నాయకుడు, గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్ (చందు), శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.౦

## ఘనంగా పూజలందుకుంటున్న రత్నానగర్ గణపతి



**హైదరాబాద్, వెలుతురు సెప్టెంబర్ 03:** నల్లకుంట డివిజన్ రత్ననగర్ లో వోల్ఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం అందరినీ విశేషంగా ఆకట్టుకుంటుంది. గణపతిని 80 గ్రాముల వెండితో అందంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ నేత రాజేష్ లాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండప నిర్వహకులు ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ముఖేష్, గణేష్, ప్రకాష్, విజయ్, సాయి గణేష్, సాయి కిరణ్, మహేష్, ఉపేందర్, మనీష్, శివ, పాండు తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ సాగర్‌కు భారీగా గోదావరి జలాలు

**సిద్దిపేట,సెప్టెంబర్3( వెలుతురు):** గజ్వేల్ పరిధిలోని మర్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ జలాశయంలోకి గోదావరి జిల్లాలను ఎత్తిపోసే పక్రియ ప్రారంభమైంది. రంగనాయక సాగర్ జలాశయం నుంచి మల్లన్న సాగర్ జలాశయంలోకి ఎనిమిది పంపుల ద్వారా గోదావరి జలాలను విడుదల చేశారు. మల్లన్న సాగర్ నుంచి కొండపోచమ్మ సాగర్ పంప్ హౌస్‌కు మూడు పంపుల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోసే పక్రియను ఈ రోజు ప్రారంభించారు. మూడు పంపుల ద్వారా 3,750 క్యూసెక్కుల నీటిని జలాశయంలోకి విడుదల చేస్తున్నట్లు- జలాశయం నిర్వహణ విభాగం ఏఈ సాయికుమార్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 6.85 టీ-ఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు- తెలిపారు

## తెలంగాణ కార్మిక శాఖ గెజిటెడ్ అధికారుల రాష్ట్ర అధ్యక్ష గా బి. జాసన్ మరియు కార్యదర్శులుగా శ్యాంసుందర్ జాజు ఎన్నిక.




**హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:** బుధవారం రోజున తెలంగాణ కార్మిక శాఖ రాష్ట్ర స్థాయి ఎన్నికలు, రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు మరియు ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, గార్ల సమక్షంలో టిజిఓ భవన్, నాంపల్లి లో నిర్వహించడం జరిగింది. ఎన్నికల అధికారిగా పి. శ్రీరామ్ రెడ్డి మరియు సహాయ ఎన్నికల అధికారిగా డా. రామా రావు ఈ ఎన్నికలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని ఏకగ్రీవంగా సంఘ సభ్యులను ఎన్నిక చేయడం జరిగింది. ఈ ఎన్నికల్లో కార్మిక శాఖ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షా బి.జాసన్ మరియు కార్యదర్శులుగా శ శ్యాంసుందర్ జాజు సహ అధ్యక్షులుగా ఎన్ చంద్రశేఖర్ గౌడ్, కోశాధికారిగా కె. యాదయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్. శ్రీనివాస రావు, సహకార్యదర్శిలుగా కె. రవీందర్ రెడ్డి మరియు ఏ. సత్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి: సి. హెచ్. వెంకట్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా కె. వినీల, క్రీడల కార్యదర్శిగా: కె. రాజు, కార్యవర్గసభ్యులుగా ఎస్. వెంకటరమణ, జి ప్రభాకర్, ఎం.డి. నిజాముద్దీన్, జి. వినోద్ గార్లు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర టిజిఓ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందించడం జరిగింది. ప్రభుత్వ అధికారులుగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనిచేస్తూనే ప్రజలలో భాగమై మన హక్కుల కోసం పోరాడాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సత్య నారాయణ నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందిస్తూ అధికారులందరూ ఐకమత్యంతో కేంద్ర సంఘ ఆదేశాల ప్రకారం కార్యాచరణలో అందరూ పాల్గొనాలని తెలియ జేశారు. ఇట్టి కార్యక్రమంలో, టిజిఓ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, ఉపాధ్యక్షులు పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## మణికంఠ యూత్ చండీశ్వర యూత్ కురుమ సంఘం వద్ద కడారి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు



**మంచాల వెలుతురు సెప్టెంబర్ 3:** మంచాల మండల కేంద్రంలో మణికంఠ యూత్ ఆధ్వర్యంలో ప్రెస్ కాలనీకి చెందిన కడారి లింగ మహేష్ జంగయ్య దంపతుల భక్తిశ్రద్ధలతో ఘనంగా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదలు అందజేశారు ఈ సందర్భంగా కడారి లింగం మహేష్ మాట్లాడుతూ భక్తితో పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయని అదే విధంగా గత పాతిక సంవత్సరాలుగా ఎంతో నిష్టగా భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రులు నిర్వహిస్తూ మంచాల్లోనే ఒక ఆదర్శంగా నిలిచిన చండీశ్వర యూత్ కుర్మ సంఘం సేవలు మరవలేనని ఈ ఏడాదికూడా ఎంతో ఆకర్షణీయంగా అలంకరణలు గావించి అచ్చం నిజమైన దేవాలయ గాలిగోపురం వలె బంగారు పట్నంలో అద్భుతమైన గోపురం నిర్మించి చూపర్లను ఇట్టే ఆకర్షించే విధంగా మండప నిర్మాణాలు చేపట్టారని నిత్యం భజనలతో భక్తిరస కార్యక్రమాలతో నిర్వాహకులు సేవలు చేస్తున్నారని అన్నారు ఈకార్యక్రమంలో గణేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

## లోయపల్లి గ్రామంలో బంటి యూత్ పోర్స్ గణేశుని దర్శించుకున్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ రెడ్డి (బంటి)



**మంచాల వెలుతురు సెప్టెంబర్ 3:** మంచాల మండలం గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లోయపల్లి గ్రామంలో బంటి యూత్ పోర్స్ ఆ ధ్వర్యంలో ప్రతిష్టించిన గణేష్ ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకుడు మంచి రెడ్డి ప్రశాంత్ రెడ్డి(బంటి) ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని ఆ విఘ్నేశ్వరుని కోరుకున్నాడు ఈకార్యక్రమంలోమంచాల మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చీరల రమేష్ లోయపల్లి కంఠ మహేశ్వర దేవాలయం చైర్మన్, కరింగ్ సదానందంగౌడ్ బంటి యూత్ పోర్స్ నాయకుడు అంగోత్ బొట్టు ప్రవీణ్, బిఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పాలకుర్ల జానయ్యగౌడ్ మాజీ ఎంపీటీసీ ఉయ్యాల కృష్ణయ్య గౌడ్ మాజీ సర్పంచ్ నారి యాదయ్య ఉయ్యాల జంగయ్య గౌడ్ దోసపటి మహేందర్, ఆకుల సురేష్, కర్నే అరవింద్ నోముల మాజీ సర్పంచ్ పల్లాటి బాలరాజు విజయ్ కరుణాకర్ తది తరులుపాల్గొన్నారు

## యాంత్రిక జీవనానికి అలవాటుపడిన ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతతోనే ప్రశాంతత పొందుతారు

**- టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం...**



**కూకట్ పల్లి సెప్టెంబర్ 3 వెలుతురు:** యాంత్రిక జీవనానికి అలవాటుపడిన ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికత తోనే ప్రశాంతత పొందుతారని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం అన్నారు. వినాయక నవరాత్రులు పురస్కరించుకొని కూకట్ పల్లి, అల్లాపూర్ డివిజన్ లో పలు ఉత్సవ కమిటీలు, సంక్షేమ సంఘాలు వివిధ మండపాల్లో ప్రతిష్టించిన వినాయకుల మండపాలని ఆయన సందర్శించి స్థానిక వాసులతో కలిసి గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ గణేశుని చతుర్దతి ఉత్సవాలు ఐక్యతకు ప్రతీకలని, కులమతాలకు అతీతంగా ఈ ఉత్సవాలల్లో అందరూ పాల్గొనడం గణేశు ని దీవెనలతో అన్ని విఘ్నలు తొలిగి ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మొయినుద్దీన్, మస్తాన్ రెడ్డి దేవరింటి, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, పులిగోళ్ళ శ్రీనివాస్ యాదవ్, కూకట్ పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, రాజు చారి, సత్యం, లక్ష్మీనారాయణ, యాదగిరి, అహ్మద్, బొల్లు శ్రీనివాస్, జగన్, పన్నాల రాజశేఖర్ రెడ్డి, కృష్ణ మూర్తి, అసోసియేషన్ సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ప్రజలలో ఐక్యతను, సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తాయి...

- జిల్లా గణేష్ నేత...



**కూకట్ పల్లి సెప్టెంబర్ 3 వెలుతురు:** గణేష్ ఉత్సవాలు ప్రజలలో ఐక్యతను, సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత అన్నారు. వినాయక చవితి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో గల సాయి నగర్, చత్రపతి శివాజీ నగర్, శివమ్మ బస్తి, పీజేఆర్ నగర్, మహావీర్ నగర్, పాపమ్మ బస్తి, దత్తాత్రేయ కాలనీ, ఆల్విన్ కాలనీ లలో నెలకొల్పిన వినాయక మండపాలను ఆయన సందర్శించి గణేష్ ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ నేత మాట్లాడుతూ ప్రతి బస్తీల్లో, కాలనీలలో వినాయకుణ్ణి నెలకొల్పి ఘనంగా పూజ కార్యక్రమాలు చేయడంతో అన్ని కాలనీల్లో ఐక్యమత్యంగా భక్తిభావాని వెదజల్లే అధిదేవుని కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, రాజు, లక్ష్మినారాయణ, హరీష్, వేరేశ్, ముజీబ్, వాసు, సంగమేశ్వర్, సాయి, వెంకటకృష్ణ, లాలన్, రెహమాన్, నరసింహ, శివ, సత్య, గిరి, మహేష్, చిన్న కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పురస్కార గ్రహిత హరిణి




**భాషీర్ బాగ్ వెలుతురు సెప్టెంబర్ 03:** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో విస్తరణ సేవ విభాగం ఆధ్వర్యంలో 2023 కీర్తి పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ పబ్లిక్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం పాల్గొని కీర్తి పురస్కారాలు ప్రదానం చేశారూ. ఇట్టి పురస్కారం కు ఎంపికైన పద్మాలయ ఆచార్య హరికథ భాగవత హారినికి స్కూల్ అసిస్టెంట్ కీర్తి పురస్కారాలు ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ పురసకారం అందుకోవడం చాలా ఆనందంగా ఉన్నాదని హరిణి ఆనందం వ్యక్తం చేశారూ.

## గుండె పోటుతో మరణించిన నూకం జంగయ్య కుటుంబానికి ఆర్థిక సాయం చేసిన తెలంగాణ పబ్లిక్ పాఠశాల ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సభ్యులు



**మంచాల వెలుతురు సెప్టెంబర్ 3:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఈ మధ్య కాలంలో గుండె పోటుతో మరణించిన తెలంగాణ పబ్లిక్ పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యుడు నూకం జంగయ్య ముదిరాజ్ ఇంటికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి జంగయ్య భార్యకు ఇరవై తొమ్మిది వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసిన ఆర్థిక సహాయం చేసిన వారిలో,తెలంగాణ పబ్లిక్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సిద్దగోని గిరిధర్ గౌడ్, తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సుప్రియ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్ గౌడ్ పేరెంట్స్, కమిటీ సభ్యులు కంబాలపల్లి భాస్కర్ చిందం శ్రీశైలం, ఉపాధ్యాయులు పాపిరెడ్డి రాములు చందు జహీర్ శ్రీకాంత్ జగదీష్ ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ సభ్యుడు కంబాలపల్లి భాస్కర్ మాట్లాడుతూ జంగయ్య కుటుంబానికి అండగా ఉంటాం అన్నారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు కై పోస్ట్ కార్డు ఉద్యమం



**ఎల్ బి నగర్ వెలుతురు సెప్టెంబర్ 3, 2025:** బుధవారం రోజున రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శేరి ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కార్తీక్ బాశెట్టి ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ కార్యాలయంలో పోస్ట్ కార్డు ల ఉద్యమం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా పలువురు అడ్వకేట్స్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో న్యాయవాదుల రక్షణ చట్టం యొక్క ఆవశ్యకతను, న్యాయవాదులు ఎదుర్కొంటున్నటువంటి ఇబ్బందులను, జరుగుతున్న దాడులను, హత్యలను, హత్య యత్యాలను, కొందరు అధికారులు వ్యవహారిస్తున్న తీరును తెలుపుతూ చట్టం ఆవశ్యకత గురించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని బార్ అసోసియేషన్స్ ను ఏకం చేసి చట్టం వచ్చే విధంగా అందరం కలిసి విజయం సాధించేలా ప్రతి అద్వకేట్ ఈ పోస్ట్ కార్డు ముఖ్య మంత్రికి చేరలా కృషి చేసేందుకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అదేవిధంగా "తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలనీ పోస్ట్ కార్డు ద్వారా విన్నవించిన తీరును పలువురు సీనియర్లు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా భారత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కార్తీక్ బాశెట్టి, ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు, హైకోర్టు అడ్వకేట్ డాక్టర్ మురహరి బుద్ధారం, బత్తిని ఉపేందర్, గుడిసె గిరిబాబు ముదిరాజ్, వినోద్ చౌహన్, శ్రీశైలం,లోకేష్ వర్మ, రమేష్ మరియు రంగా రెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ కమిటీ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని ప్రత్యేక పూజలో ఎమ్మెల్సీ తెలంగాణ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి..



**కూకట్ పల్లి సెప్టెంబర్ 3 వెలుతురు:** కూకట్ పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ లో మస్తాన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాధుని ఎమ్మెల్సీ తెలంగాణ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి బుధవారం సందర్శించిన గణనాథు నికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కెపిహెచ్బి డివిజన్ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్, కూకట్పల్లి ఏఎంసి డైరెక్టర్ ఫణి, కొమ్ము బాబు, రామక్రిష్ణ రెడ్డి, శ్రీధర్ చారి, గిరి నాయుడు, దాసర్ల గణేష్, మహిళా నాయకురాళ్ళు రేష్మ, దార్ల వనజ, వాణీ, ప్రణతి, యమునా, దివ్య, భాగ్య, సరోజ, గణేష్ కమిటీ సభ్యులు. తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల వెంకటేష్ ను కలిసిన ఎల్లికట్ట గ్రామస్తులు

**వెలుతురు, కల్వకుర్తి సెప్టెంబర్ 03 :**



కల్వకుర్తి మండలంలోని ఎల్లికట్ట గ్రామాని కి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం హైదరాబాదులోని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, తెలంగాణ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారి టబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంక టేష్ ని వారి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొం టున్న వివిధ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, బిఆర్ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్ ,గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు భీమయ్య గౌడ్, బలగం కేశవులు, కంఠం రవి, మట్ట స్వామి గౌడ్, తిరుపతయ్య, యాద య్య, చంద్రయ్య, బాల్ చెన్నయ్య, తిరుపతి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్

**- నిర్వహణ ఏర్పాట్లు, సమన్వయం చేసుకోవాలి.**

**- సమావేశంలో జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.శిరీష.**



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 03**

ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకునేలా, పరిష్కార మార్గం చూపాలని రామన్నపేట సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.శిరీష పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిరహించారు. ఈ సమావేశంలో జడ్జీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు, న్యాయవాదులు, సంబంధిత సిబ్బంది సమన్వయం తో పని చేయాలని సూచించారు. లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడానికి కక్షిదారులకి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవినాష్, రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, మోత్కూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేష్, రామన్నపేట, వలిగొండ, అడ్డగుడూరు ఎస్ఐ లు నాగరాజు, యుగేందర్ గౌడ్, వెంకట్ రెడ్డి, కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో యూరియా కొరతను నివారించాలి.

**- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య.**



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 03**

మండలంలో రైతులకు సరిపడ యూరియా సకాలంలో అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం మండల కార్యాలయంలో జరిగిన కార్యదర్శివర్గ సమావేశంలో మాట్లాడుతూ యూరియా కొరత విషయంలో కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ దోబూచులాడుతున్నాయని అన్నారు. అనేక మంది రైతులు రోజుల తరబడి వేచి చూసిన యూరియా అందడం లేదని, దీనికి గల కారణాలను వెతికి సమస్యను నివారించాలని అన్నారు. బీజేపీ ఎంపీ లు మాట్లాడుతూ ఉక్రెయిన్, రష్యా యుద్ధం మూలంగా చైనా యూరియా ఆపింది.అంటూ హాస్యాస్పదంగా పొంతన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. రైతాంగానికి సరిపడా యూరియా అందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద ఉందని అది సక్రమంగా రైతుల వరకు చేర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం ఉందని అన్నారు. రామన్నపేట మండలంలో గత 20 రోజులుగా యూరియా కొరతతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని. యూరియా సప్లై పై సమగ్ర విచారణ నిర్వహించాలని పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలో యూరియా కొరతను నివారించకుంటే సిపిఎం ఆధ్వర్యంలో రైతాంగాన్ని కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బలుగూరి అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ళ నర్సింహా చారి,బోయిని ఆనంద్,కందుల హనుమతు,జంపాల అండాలు తదితరులు పాల్గొన్నారు.

## దెందే కృష్ణయ్య అకాల మృతి చెదడం చాలా బాధాకరం

**- పార్థివా దేహానికి పూల మాల వేసి నివాళులు హార్పించిన బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అయితగోని లాల్ బహదూర్ గౌడ్**



**మునుగోడు వెలుతురు సెప్టెంబర్ 03:** కొరటికల్ గ్రామములో మాజీ పాల ఉత్పత్తిదారుల ఛైర్మెన్ దెందే కృష్ణయ్య అకాల మృతి చెదడం చాలా బాధాకరం వారి ఆత్మకు భగవంతుడు శాంతి చూకూర్చాలని వారి కుటుంబానికి మనో ధైర్యాని కల్పించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ వారి పార్థివా దేహానికి పూల మాల వేసి నివాళులు హార్పిస్తున్న బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అయితగోని లాల్ బహదూర్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు బోరీష లింగయ్య అన్నం వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమం

### అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసిన టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 03**




తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని బద్నాం చేయాలనే కాంగ్రెస్ కుట్రలను ఖండిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రామన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలోని బాబాసాహెబ్ అంబేద్కర్



విగ్రహానికి పూలమాల వేసి ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలి. అని అంబేద్కర్ విగ్రహానికి వారు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం సుభాష్ సెంటర్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అరెస్టు చేసి వారిని పోలీసు స్టేషన్ కి తరలించారు. తదనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు నిలిపిన కేసీఆర్ పై కుట్రలను యావత్ రాష్ట్రం జీర్ణించుకోలేకపోతున్నా, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్ పై సిబిఐ ఎంక్వైరీ వేయడం సిగ్గు చేటు. ఓటుకు నోటు కేసులో పట్టపగలు అడ్డంగా దొరికిపోయిన దొంగ రేవంత్ రెడ్డి కేసీఆర్ పై విచారణ అనేది పనికిమాలిన చర్య. అమలు కానీ హామీలు, మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డి ఆంధ్రా మీడియాను అడ్డం పెట్టుకొని బిఆర్ఎస్ నాయకులపై విషం చిమ్మిస్తున్నాడు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చలేకే కాంగ్రెస్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. రేవంత్ రెడ్డి, మోడీతో లోపాయికారి ఒప్పందం చేసుకుని కేసీఆర్ ని ఇబ్బందులకు గురి చేస్తోంది. కాంగ్రెస్ వేసిన కాళేశ్వరం కమిషన్ అంతా ట్రాష్. ఎన్నికల కోసమే కమిషన్ల పేరిట బిఆర్ఎస్ పార్టీ నాయకులకు వేదిస్తోంది. కేసీఆర్ పేరుతోనే కాంగ్రెస్ పార్టీ ఇంకా కాలయాపన చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజలు గోసలు పడుతున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు. నాణ్యమైన విద్యుత్ ఇవ్వకుండా, పంట పెట్టుబడిసాయం అందించకుండా, సకాలంలో ఎరువులు అందించకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నది. కాంగ్రెస్ సర్కార్ ఎన్నికలు ఎపుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీకీ ప్రజలు తప్పకుండా గుణపాఠం చెప్తారు. రేవంత్ రెడ్డి వల్లే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ గాడి తప్పింది. రైతులకు యూరియా అందించలేని దద్దమ్మ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే వేల కోట్ల దోసుకున్న కాంగ్రెస్ నాయకులపై సీబీఐ ఎంక్వైరీ చెయ్యాలి. కాంగ్రెస్ మంత్రులకు ఎలాంటి అవగాహన లేకుండా తలోమాట మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కేంద్రంలో మోడీ ఇద్దరూ తోడు దొంగలే,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బిఆర్ఎస్ పార్టీ ధీటుగా ఎదుర్కుంటోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పోలీసుల రాజ్యం నడుస్తోంది. కాంగ్రెస్ నాయకులే రేవంత్ రెడ్డినీ సీఎం పదవి నుండి తప్పించాలని,కోరుతున్నార. ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేసే స్వేచ్ఛ కూడా రాష్ట్రంలో లేదు. కాంగ్రెస్ ఏజెంట్లా వ్యవహరించే అధికారులకు ఊసలు లెక్కపెట్టేలా చేస్తాం. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచులు వార్డ్ నెంబర్లు, కార్యకర్తలు ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

**తిరుమలగిరి వెలుతురు సెప్టెంబర్ 03:**

మండల కేంద్రంలో నూతనంగా మంజూరైన రేషన్ షాపును బుధవారం నాగార్జునసాగర్ శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌక ధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న సన్నబియ్యాన్ని ప్రతి ఒక్క రేషన్ దారుడు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని పేదలకు సన్న బియ్యం పంపిణీతో కడుపు నింపే ప్రయత్నం చేసిందన్నారు. రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియని ఆయన తెలిపారు. అనంతరం తిరుమలగిరి సెంటర్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద







ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల శిథిలావస్థలో ఉండడంతో దాని మరమ్మతులకు నిధులు కేటాయించారు. పాఠశాల మరమ్మతు పనులు ఏ విధంగా సాగుతున్నాయో పరిశీలించారు. ఆయన వెంట మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి,హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి,వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, కాంగ్రెస్ జిల్లా నాయకులు శాగం పెద్దిరెడ్డి,మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్,దేవస్థాన కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి,శాగం రాఘవరెడ్డి,మత్స్య సహకార సంఘం చైర్మన్ పిట్టల కృష్ణ,సామాజిక కార్యకర్త పగడాల సైదులు యాదవ్,ఆవుల నాసర్ రెడ్డి,నాగేండ్ల చిన్న భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి నెమలి శ్రీధర్ రెడ్డి , కాసి మల్ల ప్రవీణ్ , కెలావత్



నగేష్ వల్లందాస్ వెంకటేశ్వర్లు మండల రేషన్ షాప్ డీలర్స్, చాంద్ భాషా శాగం గోపి తదితరులు ఉన్నారు

# ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేయాలి

**తిరుమలగిరి (సాగర్) వెలుతురు సెప్టెంబర్ 3:**

నాగార్జునసాగర్ నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశంలో తిరుమలగిరి సాగర్ మండల విద్యాధికారి కే శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటలలో మంచి ప్రతిభా కలిగిన క్రీడాకారులను తయారు చేయాలని తెలిపారు. బుధవారం రోజున జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిరుమలగిరి సాగర్ నందు జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నాగార్జునసాగర్ నియోజకవర్గస్థాయి పాటల పోటీల వ్యాయామ ఉపాధ్యాయుల సన్నాహక సమావేశంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటల పోటీలను ఎటువంటి పక్షపాత వైఖరి అవలంబించకుండా ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ కన్వీనర్ గా నూతనంగా ఎంపికైన తిరుమలగిరి సాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ



ఉపాధ్యాయులు సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడాకారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఆటల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. నల్లగొండ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి విమల మాట్లాడుతూ క్రీడాకారుల సెలక్షన్స్ లో నిష్పక్షపాతంగా సెలక్టర్లు వ్యవహరించాలని తెలిపారు ఇంకా ఈ సమావేశంలో మిర్యాలగూడ డివిజన్ మాజీ హెచ్ఎఫ్ సెక్రటరీ కోడుమూరు వెంకటరామిరెడ్డి మరియు మాజీ డివిజన్ ఎజిఎఫ్ సెక్రటరీ శోభారాణి మరియు నారాయణరెడ్డి యుగంధర్ రెడ్డి వెంకట్ రెడ్డి , కరుణాకర్ రెడ్డి శ్యామలాదేవి తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సిరిగిరెడ్డి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం

**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 03**

సిరిపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అద్యక్షులు సిరిగిరెడ్డి నర్సిరెడ్డి అధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించడము జరిగింది. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికలు గ్రామ అభివృద్ధి పై విస్తృత చర్చ ను నిర్వహించడం



జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు నాయకులు గ్రామ సీనియర్ నాయకులు తమ అభిప్రయాలను తెలియజేస్తూ,పలు అభివృద్ధి పనులను,గ్రామ లోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టి కి తిసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా అందరు ఏకగ్రీవంగా తిర్మానించటం జరిగింది. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు సిరిగిరెడ్డి మల్లా రెడ్డి పున్న జగన్మోహన్,అప్పం రామేశ్వరం, మాజీ సర్పంచ్ అప్పం లక్ష్మి నర్సి,కట్టా దశరథ రెడ్డి,గంజి సత్యనారాయణ, కూనూరు రమేష్ ,దాసిరెడ్డి వెంకన్న, మామిడి పెంటయ్య,సుక్క శ్రవణ్ కుమార్, కట్టా గోపాల్ రెడ్డి,పున్న అమరేందర్, రాపోలు రమేష్,ఎల్ల మదుసూదన్ రెడ్డి, పవుడాల గణేష్, సూదుల చంద్రారెడ్డి, సిల్వేరు యాదగిరి,కంకల మల్లేష్,రంగయ్య తడితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు

**-విరాళాలు అందజేసిన వారికి దేవాలయ కమిటీ సభ్యులు ఘన సత్కారం...**

**వెలుతురు, చారకొండ సెప్టెంబర్ 03 :**



జేపల్లి గ్రామంలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయ పునర్నిర్మాణ అభివృద్ధికి బుధవారం పలువురు విరాళాలు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ జేపల్లి గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఎం.డి.సిరాజ్ 20,166, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నెమలిగుట్ట తండా కు చెందిన అశోక్ నాయక్ రూ.10, 166 దేవాలయ అభివృద్ధికి విరాళంగా అందజే శారు. విరాళాలు అందజేసిన వారికి దేవా లయ కమి టీ సభ్యులు శాలువాతో సత్క రించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ స భ్యులు, గ్రామస్తులు, యువకులు తది తరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ ప్రజా సేవకుడు సమ్మిగౌడ్ చిలువేరు

## గణేష్ ఉత్సవాలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయి...

**- కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**




**కూకట్ పల్లి సెప్టెంబర్ 3 వెలుతురు:**
గణేష్ ఉత్సవాలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయని కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. వినాయక చవితి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ వినాయక ఉత్సవ కమిటీ , మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్, వెంకటేశ్వర్ నగర్ 33 బ్లాక్ 11వ రోడ్ లోని వీకర్ సెక్షన్ కాలనీ వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్, వెంకటేశ్వర్ నగర్ 35 బ్లాక్ జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ , త్రీ టెంపుల్స్ వద్ద ఆల్విన్ కాలనీ 1వ ఫేస్, ఆల్విన్ కాలనీ ఫేస్ వన్ వినాయక నవోదయ యూత్ అసోసియేషన్ , రిక్షా పుల్లర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, రామకృష్ణ నగర్ మెయిన్ రోడ్ లో నవీన్, బాలకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్,లలో పలుచోట్ల ఏర్పాటు చేసినటువంటి వినాయక మండపాల దగ్గర వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక వాసులతో కలిసి కార్పొరేటర్ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్మాల్ రాయల్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 03**
కోమ్మాయిగూడెం గ్రామంలో కొత్త వాడ లో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీటీసీ వనం చంద్రశేఖర్ పాల్గొన్నాడు. గోపగోని శీను, లలిత, శివ, బుర్ర రాజు, పుష్ప, మనోహర్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రులు భాగంగా అన్న ప్రసాద్ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదినంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనీ విజయవంతం చేశారు.

## శ్రీ విగ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద కార్యక్రమం



**రామన్నపేట వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 03**
కోమ్మాయిగూడెం గ్రామంలో (ఆరెగూడెం) శ్రీ విఘ్నేశ్వర యూత్ ఆద్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు, చిన్నలు పెద్దలు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## శారీరక మానసిక దృఢత్వానికి క్రీడలు ఉపయోగపడుతాయి

**- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



**ఉప్పల్, సెప్టెంబర్ 3(వెలుతురు):**
క్రీడల ద్వారా యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారని, వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్తు లభిస్తుందని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఉప్పల్ నియోజక వర్గంలోని కాప్రా మాణిక్ సాయి ఎంక్లేవ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫైర్ ర్యాలీ బ్యాడ్మింటన్ అకాడమీ ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, క్రీడారంగాన్ని ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందన్నారు.యువత చదువుతో పాటు క్రీడలల్లో కూడా రాణించాలని సూచించారు.అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, క్రీడాభివృద్ధికి తోడ్పడే ఇలాంటి అకాడమీలు మరిన్ని ఏర్పాటు చేయాలని ఆకాంక్షించారు.ఈ అకాడమీని ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్లు స్వర్ణరాజ్, జెర్రిపోతుల ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్ యాదవ్, కొత్త రామరావు, కాసం మహిపాల్ రెడ్డి, కార్యకర్తలు,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ యువసేన ఆధ్వర్యంలో కిష్టాపూర్‌లో విగ్నేశుని నిమర్జనం

**- తూప్రాన్ మండలంలో యువత సాంప్రదాయ పద్ధతిలో గణపతి నిమర్జనం**

**- కార్యక్రమంలో పాల్గొన్న తాజా మాజీ సర్పంచ్ పిట్ల పోచయ్య ముదిరాజ్, బిజెపి నాయకులు.**

**తూప్రాన్ వెలుతురు సెప్టెంబర్ 03:**
మెదక్ జిల్లా తూప్రాన్ మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో శ్రీరామ్ యువసేన యూత్ సభ్యులు ఆధ్వర్యంలో విగ్నేశుని నిమర్జనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్, తూప్రాన్ బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు పిట్ల పోచయ్య ముదిరాజ్, యువసేన అధ్యక్షుడు చుక్క రామ్, చుక్క నవీన్, బిజెపి బూత్ అధ్యక్షుడు మూరా కరుణాకర్, అహ్మద్, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## చంద్రు తండా శ్రీ సేవాలాల్ యూత్ అసోసియేషన్ శాశ్వత మండపానికి సమ్మి గౌడ్ చిలువేరు విరాళం

### మండపం ఏర్పాటుకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సమ్మిగౌడ్

**కేసముద్రం వెలుతురు సెప్టెంబర్ 03:**
కేసముద్రం మండలం చంద్రు తండా గ్రామ పంచాయతీకి చెందిన న్యూ శ్రీ సేవాలాల్ యూత్ అసోసియేషన్ వారి



ఆధ్వర్యంలో శాశ్వత వినాయక మండపం ఏర్పాటుకు తండా పెద్దలు, అసోసియేషన్ సభ్యులు గత సంవత్సరం అడగగా ఈ ఏడాది ఇస్తానని చెప్పి ఇచ్చిన మాట ప్రకారం అడిగిన వెంటనే స్పందించి కాంగ్రెస్ మండల నాయకులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ వారు ఏర్పాటు చేసుకున్న శాశ్వత వినాయక మండపానికి విరాళం అందజేసి మాట నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ...ఆ ఏకదంతుని వినాయక మండపం ఏర్పాటులో నేను భాగస్వామిని అయినందుకు నాకు చాలా సంతోషంగా ఉందని,మీరు భక్తితో శ్రీ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుకోవడం పట్ల ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.అదేవిధంగా శ్రీ సేవాలాల్ యూత్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ... అన్నా అని అడిగిన వెంటనే స్పందించి మాకు విరాళం అందజేయడం మీ ఉన్నతమైన వ్యక్తిత్వానికి నిదర్శనమని అందుకు మా నుండి మీకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం అని, ఇలాంటి




వ్యక్తి ఏమీ ఆశించకుండా మండల కేంద్రంలోని పలు రకాల కార్యక్రమాలకు సహాయార్థం ముందుండి చేస్తున్నందుకు ఆయనకు మనం ఎల్లవేళలా తోడుండాలని,వారికి వారి కుటుంబానికి విగ్నేశ్వరుడు విగ్నానాలను తొలగించి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు అష్టైశ్వర్యాలతో సంపన్నులై ఉండేలా ఆ వినాయకుడి ఆశీస్సులు వారికి ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్య శ్రీనివాస్ నాయక్, బానోత్ లాలు, బానోత్ రాజు,బానోత్ అశోక్,మాలోత్ బాలు, గుగులోత్ బాలు, బానోత్ హచ్చు,బానోతు రవి,భూక్య బాలు,యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై సీఎం సభలో నిరసన

**- ప్రకార్డులతో నిరసన తెలిపిన**

**- ఐజేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ బృందం.**




**భద్రాద్రి కొత్తగూడెం వెలుతురు సెప్టెంబర్ 03:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై తక్షణమే స్పందించాలని చంద్రుగొండ మండలం దామరచర్ల సీఎం సభలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టి యు డబ్ల్యు జే ఐ జేయు జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జర్నలిస్టు సంక్షేమం కోసం పనిచేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం జర్నలిస్టులను విస్మరిస్తుందని అన్నారు . భద్రాద్రి జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం పది ఎకరాల భూమి కేటాయించి ఏళ్ళకేళ్ళు గడుస్తున్నా కోర్టు కేసుతో ముడి పెడుతున్నా రన్నారు. దీంతో జర్నలిస్టుల చిరకాల కోరిక అయిన సొంతింటి కల నెరవేరేలా కనబడడం లేదని అందుకే సీఎం సభలో జర్నలిస్ట్ ల సమస్య తెలిసేటట్లు శాంతియుతంగా ఫ్లకార్డులతో నిరసన తెలిపామని జిల్లా అధ్యక్షుడు ఇమంది ఉదయ్ కుమార్ అన్నారు. నిరసన ఆపేందుకు అక్కడికి వచ్చిన పోలీసులతో కనీసం మా ఆవేదన సీఎం రేవంత్ రెడ్డికి చేర్చాలని కోరారు. ఇప్పటికే అనేకసార్లు జిల్లా మంత్రులకు సమాచార శాఖ మంత్రివర్యులు అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సైతం విన్నవించుకున్నామని ఇప్పటికైనా వెంటనే జర్నలిస్టులకు కేటాయించిన చోట స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, జర్నలిస్టులకు అక్రిడేషన్లు సైతం వెంటనే అందించాలని కోరారు. కార్యక్రమంలో దుద్దుకూరు రామారావు, లక్ష్మణ్, ఈశ్వర్, శంకర్, నరసింహారావు, అశోక్, జానీ, వెంకట్, ఏర్పుల సుధాకర్, నాని, జంపన్న నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్ కి సర్పంచుల పెండింగ్ బిల్లు ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు

**- ప్రభుత్వం బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని లేఖ రాసిన రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య గౌడ్**

**- గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ తో భేటీకి విజ్ఞప్తి**

హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:
గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ కి మీ విలువైన సమయాన్ని ఇచ్చి మాతో భేటీ అయ్యేలా వేడుకుంటూ ఈ లేఖ రాస్తున్నాను.
నా పేరు సుర్వి యాదయ్య గౌడ్, నేను తెలంగాణ రాష్ట్ర సర్పంచుల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడిని. రాష్ట్రంలో పెండింగ్ బిల్లుల కారణంగా అనేకమంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు. గత 15 నెలలుగా తెలంగాణ రాష్ట్రంలోని 12,769 మంది సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడం మాకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. మీతో భేటీ కావడం ద్వారా మా సమస్యలను వివరించడానికి, పరిష్కార మార్గాలను చర్చించడానికి, ఆత్మహత్యల వలయాన్ని ఆపేందుకు తగిన చర్యలు తీసుకోవడానికి ఒక విలువైన అవకాశమని మేము నమ్ముతున్నాము. ఈ బడ్జెట్ సమావేశంలోనే పెండింగ్ నిధులను విడుదల చేయాలని మేము మనవి చేస్తున్నాము.
మేము 2019 నుండి 2024 వరకు పదవిలో ఉన్న సర్పంచులు.
మా పదవీ కాలం 2024 జనవరిలో ముగిసిపోయింది, అయినప్పటికీ ఇప్పటికీ పెండింగ్ బిల్లులు అందలేదు. ఇప్పటికే 10 సంఖ్య మందికి పైగా సర్పంచులు బిల్లుల సమస్య కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ఇంకా అనేకమంది కుటుంబాలు ప్రమాదంలో ఉన్నాయి.
2019–2024 కాలంలో మేము గ్రామాల అభివృద్ధి కోసం అనేక పనులు చేశాము:




చెత్త వర్గీకరణ, షెడ్లు, డంపింగ్ యార్డులు
నర్సరీలు, క్రీడా మైదానాలు,
గ్రామపంచాయతీ భవనాలు
మన ఊరు – మన పాఠశాల, ఆంగన్వాడీ భవనాలు, రీడింగ్ రూములు
సోక్ పిట్స్, పల్లె ప్రగతి (5 దశలు), హరితహారం
సీఎంఎస్‌డీఎఫ్ పనులు, మిషన్ భగీరథ ట్యాపుల అమరిక
వైకుంఠ ధామాలు (స్మశానాలు), బృహత్ పల్లె ప్రకృతి వనాలు
దశాబ్ది వేడుకలు, కంటి వెలుగు కార్యక్రమాలు
ఆజాదీ కా అమృత్ మహోత్సవ్
కోవిడ్ సమయంలో అత్యవసర సేవలు
పరిశుభ్రత కార్మికులకు బీమా, ఆసుపత్రులు/పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం
కంపోస్ట్ ఎరువులు వంటి అనేక అభివృద్ధి పనులు.
ఈ పనులను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఇచ్చిన 20 పురస్కారాల్లో 19 పురస్కారాలు తెలంగాణ సర్పంచులకు లభించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ల ప్రకారం



మేము పనులు పూర్తి చేసాము. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, గవర్నర్ గారు, ముఖ్యమంత్రి గారిని కూడా పున:పున: మనవి చేసినా సమస్య పరిష్కారం కాలేదు. సర్పంచులు వ్యక్తిగతంగా అప్పులు తీసుకుని పనులు చేశారు. అధిక వడ్డీ ఒత్తిడిని తట్టుకోలేక కొందరు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టినట్లు కనబడుతోంది. కాబట్టి మేము వినయపూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని స్థానిక సంస్థల ఎన్నికలకంటే ముందు పెండింగ్ బిల్లులు విడుదల చేయమని విజ్ఞప్తి చేస్తున్నాము. లేనిపక్షంలో మరింత మంది సర్పంచులు ఆత్మహత్యలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర సర్పంచుల పరిస్థితిని మీరు అర్థం చేసుకొని దయచేసి పెండింగ్ బిల్లులు విడుదల చేయడానికి సహకరించాలి అని మా మనవి. మీ సమయానికి మరియు సహకారానికి ధన్యవాదాలు. మీ సమాధానాన్ని ఎదురుచూస్తున్నాము.

## ఆది దేవుణ్ణి దర్శించుకున్న పద్మశాలి మహిళలు

**వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 03 :**
సంగారెడ్డి జిల్లా :- చారిత్రాత్మక ఆలయం గణేష్ గడ్డ సిద్ది వినాయకుడిని నారాయణ ఖేడ్ పద్మశాలి మహిళలు బుధవారం దర్శించుకున్నారు. శాస్త్రోక్తంగా 108 ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు ధూమ్రవర్ణ అవతారంలో



వినాయకుడు భక్తుల కోరికలను తీర్చడానికి, అహమును సంతోషపెట్టడానికి అమరత్వం, సార్వభౌమత్వాన్ని ప్రసాదిస్తాడని చెప్పారు. ధూమ్రవర్ణ అవతారం ఒక అహం అనే వ్యక్తి గణేశుడిని ప్రసన్నం చేసుకోవడానికి తీవ్రంగా తపస్సు చేసినప్పుడు ఏర్పడిందని వినాయకుడు అహం యొక్క భక్తికి సంతోషించి,అతనికి మూడు రంగాలలో అమరత్వం మరియు సార్వభౌమత్వాన్ని ప్రసాదించాడని తెలిపారు. ఆదిదేవుని ప్రసన్నంతోనే అష్టైశ్వర్యాలు పొందవచ్చని చెప్పారు.

# జనరల్ వార్తలు

## స్వచ్ఛందంగా గుంతల పూడ్చివేత....



జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో సిసి రోడ్డు గుంతలు పడటంతో స్థానికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పలు మార్లు ఇట్టి సమస్యను సంబధిత శాఖధికారుల దృష్టికి తీసుకొని వెళ్లిన వారు స్పందించలేదు. ఈ రహదారి గుండా నిత్యం కొని వేలమంది ప్రజలు ప్రయాణం చేస్తుంటారు. ప్రతి రోజు ఎవరో ఒకరు గుంతలో పడి గాయలపాలవుతున్నారు. దింతో యువసేన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు ఏ వన్ ట్రేడర్స్ వారి సహకారంతో హౌసింగ్ బోర్డ్ మెయిన్ రోడ్డుపై గల గుంతలను సిమెంట్ కాంక్రీట్ చే మూయించారు. ఈ సందర్బంగా కాలోనివాసులు యువసేన గణేష్ ఉత్సవ కమిటి వారికి, ఏ వన్ ట్రేడర్స్ యాజమాన్యానికి ధన్యవాదములు తెలిపారు.

## గణనాధునికి ఘనంగా పూజలు



జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ హౌసింగ్ బోర్డ్ కాలనీ 12వ వార్డులో పిఓపి గణేష్ వద్దు మట్టి గణేష్ ముద్దు అనే నినాదంతో యువసేన గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకునికి విశేష పూజలతో పాటు మహిళలు ఆధ్వర్యంలో పెద్దఎత్తున హారతులతో మహోత్సవం నిర్వహించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోనే ఈ యువసేన మట్టి గణేష్ అత్తి పెద్ద గణేష్ ప్రతి రోజు పూజలు అందుకుంటూ భక్తులకు దర్శనం ఇస్తున్నాడు. కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహనికి కాలనీవాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు తెలిపారు.

## గాంధీ యూత్ వినాయక మండపం వద్ద లలితా సహస్రనామాలు అన్నదాన కార్యక్రమం

**- హాజరైన ప్రజాప్రతినిధులు గ్రామస్తులు.**





మెదక్ జిల్లా తూప్రాన్ వెలుతురు న్యూస్ సెప్టెంబర్ 03:-
మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీ నగర్ లో జెండా వద్ద గత కొన్ని సంవత్సరాలుగా వినాయక చవితి మొదలుకొని నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా గాంధీ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుపుతున్నారు.ఇందులో భాగంగా పురోహితులు సలాక రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిత్య పూజలు లలితా సహస్రనామాలు దేవుడి భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.అలాగే మహిళలు నిత్యం ఉదయం మరియు సాయంత్రం వినాయక మండపం వద్ద భక్తిశ్రద్ధలతో పిల్లాపాపలతో పూజలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగా బుధవారం నాడు గాంధీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద తూప్రాన్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ కొడిప్యాక నారాయణ గుప్త సౌజన్యంతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గాంధీ యూత్ యూత్ సభ్యులు, కాలనీవాసులు ప్రజాప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ లో 140 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత...!

**- గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు...**

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అల్గోల్ గ్రామం అల్లనా పరిశ్రమ వద్ద ఎక్సైజ్ పోలీస్ అధికారులు వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఎండు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. తనఖీలో భాగంగా స్కూటీ పై అక్రమంగా తరలిస్తున్న 140



గ్రాముల ఎండు గంజాయిని పట్టుకొన్నారు. అనంతరం వారి వద్ద నుండి 140 గ్రాముల ఎండు గంజాయిని, డియో స్కూటీ, 2 మొబైల్ ఫోన్ లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం నిందితులను జహీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ కి తరలించారని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. పట్టు బడిన ఇద్దరు నిందితులు సత్వార్ గ్రామానికి చెందిన మహమ్మద్ ఖయ్యూం, ఫకీర్ అయూబ్ లు యున్నారు. ఈ కార్యక్రమం లో ఎస్సై లు హనుమంతు, అనుదీప్, కానిస్టేబుల్స్ అరుణజ్యోతి, అంజిరెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బర్దిపూర్ ఆశ్రమంలో వైభవంగా నారాయణ హెూమం

**- ముగిసిన అర్థ చాతుర్మాస దీక్ష**

**- ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి**

**- ఆశ్రమ పీఠాధిపతులు**



జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామంలోని దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో బుధవారం నారాయణ హెూమం భక్తి పరవశంగా, వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ ఉత్తర పీఠాధిపతి మహామండలేశ్వర్ డాక్టర్ సిద్దేశ్వరానందగిరి చేపట్టిన అర్థ చాతుర్మాస దీక్ష భక్తి శ్రద్ధలతో ముగిసింది. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చారణల మధ్య పండితులు శాస్త్రోక్తంగా నారాయణ హెూమాన్ని పూర్తి చేశారు. లోకకల్యాణార్థంగా చేపట్టిన ఈ దీక్ష 60 రోజులపాటు నిర్విరామంగా ప్రతిరోజూ మరకత ఇష్టలింగ రుద్రాభిషేకం,మహా మంగళారతి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి, సిద్దేశ్వరానందగిరి మాట్లాడుతూ... "ప్రతి ఒక్కరు సేవాభావంతో ఉండి, సమాజానికి ఆధ్యాత్మిక శక్తినిచ్చే మార్గంలో నడవాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక ఎమ్మెల్సీ రఘునందన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, నందినిశ్రీగిరిమాత, అర్చకులు శ్రీపాద స్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, కోట శ్రీనివాస్, బోయిని ఎల్లన్న, నాగన్న పాటిల్, కోట నరసింహులు, న్యాలకంటి దత్తు, సుధాకర్ తదితరులు పాల్గొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాటు చేశారు.

## లేగదుడకు సాంప్రదాయ అంత్యక్రియలు

వెలుతురు నారాయణఖేడ్ సెప్టెంబర్ 03 :
నారాయణఖేడ్ మండల పరిధిలోని సత్యగామ గ్రామంలో బుధవారం అనారోగ్యంతో చనిపోయిన లేగ దూడకు గ్రామస్తులు అంతా కలిసి హిందూ సాంప్రదాయబద్ధంగా



అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు. చనిపోయిన లేగ



దూడను భాజ భజంత్రీలతో యాత్రగా తీసుకెళ్ళి గ్రామ శివారులో గోతి తీసి లేగ దూడను ఖననం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

## బాలికల భవిష్యత్ రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకం

**- మహిళలు, బాలల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత....**

**- డీడబ్ల్యూఓ లలితా కుమారి...**




జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:
మహిళలు, బాలల రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకమని, బాలికల విద్య, భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. లలితా కుమారి అన్నారు . పది రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమం లో భాగంగా మంగళవారం జహీరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో పిసిపీఎన్డీటీ చట్టం, పోక్సో చట్టం, గృహ హింస చట్టం, పోష్ చట్టం బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. లలితా కుమారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు . మహిళలు, బాలల



రక్షణలో ప్రభుత్వ చట్టాలు కీలకమని, బాలికల విద్య, భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రీ-కాన్సెప్షన్ అండ్ ప్రీ-నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (నిషేధించడం) చట్టం ప్రకారం లింగ నిర్ధారణ నిషేధమని, దానిని అరికట్టడంలో అందరూ కట్టుబడి ఉండాలని,అన్నారు .పాక్సో చట్టం బాలలపై లైంగిక దాడులను అరికట్టడంలో కఠిన చర్యలు తీసుకుంటుందని, గృహ హింస మరియు పోష్ చట్టాలు మహిళలకు బాలికలకు రక్షణ కల్పిస్తున్నాయని, బాల్య వివాహాల నివారణ సమాజం అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అదే విధంగా, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. బాలికల రక్షణ, విద్య, సాధికారతకు కట్టుబడి ఉంటామని అంగీకరించారు. డీడబ్ల్యూఓ చిరాగ్ పల్లి %-%2 ఆంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి, జరిగిన సెక్టార్ మీటింగ్‌లో ఆంగన్‌వాడీ టీచర్లతో సమావేశమై పౌష్టికాహారం పంపిణీ, గర్భిణీ స్త్రీల, బాలల ఆరోగ్య పరిరక్షణపై సూచనలు అందించారు. అనంతరం చిరాగ్ పల్లి అంగన్వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో అంజమ్మ, మెడికల్ ఆఫీసర్ సోయల్, జిల్లా సమన్వయకర్త పల్లవి, ఆంగన్‌వాడీ టీచర్లు, ఆశలు, సూపర్వైజర్ లు, తదితరులు పాల్గొన్నారు.

## కలియుగ దైవం గోవిందుడి ఆశీషులు ప్రజలందరిపై ఉండాలి

**- నీలం మధు ముదిరాజ్**

**- తిరుమల వేంకటేశ్వర స్వామిని అర్చన సేవలో దర్శించుకున్న నీలం**



సంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 3 వెలుతురు న్యూస్ :
శ్రీవారిని నలభై నిమిషాలపాటు ఆయన ఏడవ ద్వారం లోపల కూర్చొని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం..ఆలయ అర్చకులచే వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందుకున్న నీలం..ఏడుకొండల వాసుడు కలియుగ ప్రత్యక్ష దైవం గోవిందుడి కృపాకటక్షాలు ప్రజలందరిపై ఉండాలి అని ఆ దేవదేవుడిని ప్రార్ధించినట్లు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం తెల్లవారుజామున ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమల వేంకటేశ్వరస్వామి వారి అర్చన సేవలో పాల్గొని ఆ గోవిందుడిని దర్శించుకున్న నీలం మధు ముదిరాజ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభై నిమిషాల పాటు స్వామివారిని ఏడవ ద్వారం లోపల కూర్చొని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతం అని అన్నారు, దర్శన అనంతరం ఆలయ అర్చకులచే రంగనాయక మండపం వద్ద వేద ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు, ఆ శ్రీనివాసుని ఆశీషులతో సమస్త మానవాళి బాగుండాలి అని తెలిపారు..

## అవినీతిలో కవితకు భాగస్వామ్యం లేదంటే ఎలా

**- ఆమె మాటలు నమ్మదగ్గవిగా లేవు: కాంగ్రెస్**

హైదరాబాద్,సెప్టెంబర్3( వెలుతురు):
పదేళ్ల పాటు- బీఆర్ఎస్ పాలనలో కీలక స్థానంలో ఉన్న కవితకు అవినీతి వ్యవహారాల్లో భాగస్వామ్యం లేకుండా అవి జరిగాయని అనటం అసాధ్యమని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రజల సొమ్ము దోచుకున్న తర్వాత, వాటాలో తేడా రావడంతోనే కవిత బహిరంగ వేదికపైకి వచ్చారని వ్యాఖ్యానించారు. కవిత రాజీనామాపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కవిత కొన్ని కఠోర సత్యాలు, కొన్ని అబద్దాలు మాత్రమే మాట్లాడారని ఆయన అన్నారు. కవిత నిజంగా అవినీతి విషయాల్లో ఆధారాలు ఇస్తే వాటిని పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా లిక్కర్ మార్ట్ కేసు, ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రిపై ఎత్తేసిన కేసు వంటి అంశాలపై సరైన వివరాలు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందిస్తుందని హామీ ఇచ్చారు. కేసీఆర్‌పై స్పై చేయాల్సిన అవసరం లేదన్నారు. స్పై చేయడం మాకు అలవాటు- కాదు.. ఫోన్ ట్యాప్‌లు మీరు చేశారు. మీరు మీలో మీరే గొడవ పడి బయటపడుతున్నారని అంటూ బీఆర్ఎస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. ఆయన కవిత ఇటీవలే అమెరికా నుండి తిరిగివచ్చిన తర్వాత హరీష్ రావు, సంతోష్‌పై ఆరోపణలు చేయడం, అంతకు ముందు కేటీ-ఆర్‌పై విమర్శలు చేయడం బీఆర్ఎస్ లోపల విభేదాలను బహిర్గతం చేస్తోందని అన్నారు. ఇదిలావుంటే కవిత రాజీనామా చేయడాన్ని మహేష్ గౌడ్ స్వాగతించారు. నైతికతకు కట్టుబడి ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయడం శుభపరిణామమని అన్నారు. కవిత కేసీఆర్ వదిలిన బాణం మాత్రమే. ప్రజల దృష్టిని డైవర్ట్ చేయడానికి ఇవన్నీ చేస్తున్నారు. అయితే నైతికతతో తీసుకున్న ఈ నిర్ణయం సానుకూలమే అని వ్యాఖ్యానించారు. అంతేకాక, రాబోయే ఎన్నికల నాటికి బీఆర్ఎస్ అనే పార్టీ రాజకీయ ముఖచిత్రంలో ఉండదని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.


## సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

**- పట్టణ సీఐ శివ లింగం, పట్టణ ఎస్ఐ వినయ్ కుమార్...**

జహీరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:
సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలు గురించి విద్యార్థులకు, ప్రజలకు అవగాహనా ఉంటే నేరాలు జరుగకుండా ఉంటాయని జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ పోలీస్ మరియు స్రవంతి జూనియర్ కళాశాల యాజమాన్యం వారి ఆధ్వర్యంలో సైబర్ జాగృతి దివస్ సందర్బంగా స్రవంతి



జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ అవరేనేస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 250 కి పైగా కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమలో పట్టణ సీఐ శివ లింగం, పట్టణ ఎస్ఐ వినయ్ కుమార్ విద్యార్థులకు సైబర్ నేరాల గురించి అవగాహనా కల్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ....సైబర్ నేరాలపై అవగాహన కల్పించి సైబర్ నేరాలను నివారించడమే పోలీసుల లక్ష్యమని అన్నారు. ప్రస్తుతకాలంలో వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాను పిల్లలు ఎక్కువగా వాడుతున్నారని, వాటిని వాడేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమం ద్వారా నేర్చుకున్న ప్రతిఒక్కరూ మిగతా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు సైతం సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలని, ఆన్లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో అందరికీ అవగాహన తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో భాగంగా కానిస్టేబుల్ మహమ్మద్ రషీద్ సైబర్ వారియర్ ఆన్లైన్ లో జరిగే మోసల



గురించి ఆన్లైన్ ఫ్రాడ్స్ గురించి తెలిపారు. కానిస్టేబుల్ భాస్కర్ తాగి వాహనాలు నడిపితే తీసుకునే చర్యల గురించి, ట్రిపుల్ రైడింగ్ వల్ల వచ్చే నష్టాల గురించి తెలిపారు. కానిస్టేబుల్ ప్రజ్ఞ షీ టీమ్స్ గురించి తెలిపారు. కానిస్టేబుల్ దీపిక ఓటిపి ల వల్ల వచ్చే నష్టలా గురించి వివరించారు విద్యార్థులకి మరింత అవగాహన కల్పించడానికి ఇటీవల సైబర్ క్రైమ్ వల్ల డబ్బులు కోల్పోయిన బాధితుడు మొయిన్ ని పిలిపించి అతని ధ్వారా విద్యార్థులకి అవగాహన కల్పించడం జరగింది.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడికి ఘన స్వాగతం..



**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 03:**
బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా నియామకమై తొలిసారిగా కరీంనగర్ జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావుకు గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి రాజీవ్ రహదారి వద్ద బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల బిజెపి అధ్యక్షుడు తిప్పర్తి నికేష్ ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

### రాష్ట్ర అధ్యక్షులకు స్వాగతం పలికిన సొల్లు అజయ్ వర్మ....




బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు మొదటిసారిగా కరీంనగర్ జిల్లాకు పర్యటన కు వచ్చిన సందర్భంగా రేణికుంట టోల్గేట్ వద్ద బిజెపి రాష్ట్ర నాయకులు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షులు సొల్లు అజయ్ వర్మ ఘన స్వాగతం పలికారు. రామచంద ్రావుకు స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి , తిమ్మాపూర్ మండలాధ్యక్షులు జగదీశ్వర చారి, గన్నేరు వరం మండల అధ్యక్షులు నికేష్, మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి , జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి, మహిపాల్ రెడ్డి , బెజ్జంకి మండల అధ్యక్షులు కొలిపాక రాజు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ప్రాజెక్టులోకి వరద ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3**
మంచిర్యాల జిల్లాలో ఎడతెరిప లేకుండా వర్షాలు కురుస్తున్నందున ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటి ఇన్ ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని హాజీపూర్ మండలం లోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు లోకి చేరుతున్న వరదనీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువన ఉన్న ఎస్ ఆర్ ఎస్ పి, కడెం ప్రాజెక్టుల నుండి వరద నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి వరద నీటి చేరిక పెరుగుతుందని, ఈ నేపథ్యంలో జిల్లాలో కురిసిన వర్షాలతో వాగులు, చెరువుల నుండి సైతం వరద నీరు ప్రాజెక్టులోకి రావడంతో ఇన్ ఫ్లో అధికంగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రాజెక్టు నుండి నీటి అవుట్ ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ అధికారుల సమన్వయంతో రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి కోర్టుకు నాగార్జున

**హైదరాబాద్,సెప్టెంబర్3( వెలుతురు):**
హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు సినీ నటు-డు అక్కినేని నాగార్జున, అక్కినేని నాగ చైతన్య హాజరయ్యారు. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై న్యాయమూర్తి ఎదుట నాగార్జున, చైతన్య స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం నాగార్జున మీడియాతో మాట్లాడుతూ తాను వేసిన పరువునష్టం దావా కేసులో కోర్టుకు హాజరైనట్లు- తెలిపారు. న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతోందన్నారు.

### గ్రామ పాలనాధికారుల నియామక ప్రక్రియ

# సమర్థవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్**






**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3**
గ్రామీణ స్థాయిలో పరిపాలన సులభతరం చేసే విధంగా ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారులకు నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలన అధికారుల నియామకం సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, నియామక ఉత్తర్వుల పంపిణీ, మార్గదర్శకాలపై పలు సూచనలు చేశారు. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతులమీదుగా గ్రామ పాలనా అధికారులకు నియామక ఉత్తర్వులు పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమైనదిగా భావించి తగు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఇన్చార్జి మంత్రులు, స్థానిక మంత్రులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే నియమించబడిన గ్రామ పాలన అధకారులను దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లా నుండి హైదరాబాద్ లోని హైటెక్ సిటీ కు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని, సకాలంలో నియామక ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలన అధికారులుగా నియమించబడే వారికి తమ స్వగ్రామం, మండలం, నియోజకవర్గంలో పోస్టింగ్ ఇవ్వకూడదని, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దంపతులకు నిర్దిష్ట పరిస్థితులలో విశేష మినహాయింపులు ఇవ్వవచ్చని, సంబంధిత అంశాలను జిల్లా స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ పాలనాధికారుల పోస్టింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, నిబంధనలకు లోబడి నిర్వహించాలని, ప్రతి క్లస్టర్ కు తగిన అభ్యర్థిని నియమించేందుకు జిల్లా కలెక్టర్ సమీక్షించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం హైదరాబాద్ లో జరగనున్న నియామక ఉత్తర్వులు పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు చెందిన గ్రామ పాలన అధికారులను సకాలంలో తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం నుండి 3 బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి బస్సులో ఒక ఉపతహసిల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్ ఉంటారని తెలిపారు. ఈనెల 5వ తేదీ ఉదయం 8.30 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, గ్రామ పాలన అధికారులకు భోజన సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం గంగిపల్లి గ్రామంలోని పల్లె దవాఖాన, ఆసుపత్రికి వెళ్లే రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పల్లె దవాఖాన కు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పాటించవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. రహదారి నుండి ఆసుపత్రికి వచ్చే అటాచ్ రోడ్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మరమ్మత్తులు చేయాలని తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనలకు లోబడి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించుకునేలా లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. కుందారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిస్టర్లు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, హాజరు పట్టిక, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులను వినియోగించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం విద్యారంగ బలోపేతం దిశగా అనేక చర్యలు చేపడుతుందని, అన్ని ప్రభుత్వ విద్య సంస్థలను అభివృద్ధి చేస్తూ నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ పట్టణంలో ప్రతిష్ఠించిన వివిధ గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్





**ఆదిలాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03:**
ఆదిలాబాద్ పట్టణంలో ప్రతిష్ఠించిన వివిధ గణనాథులను ఎమ్మెల్యే దర్శించుకున్నారు, కుమార్ పెట్ లోని గణనాథునితో పాటు సంజయ్ నగర్ లో ప్రతిష్ఠించిన వినాయకులకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసిన, అనంతరం అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను యువకులు ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సూచించారు. మన హిందూ ధర్మ పరిరక్షణతో పాటు హిందువుల ఐక్యమత్యానికి వినాయక నవరాత్రి ఉత్సవాలు స్ఫూర్తినిస్తుందన్నారు. వీరితో పాటు నాయకులు లాలా మున్నా. దినేష్ మతోలియ. ఆదిత్య తదితరులు పాల్గొన్నారు

## హరీష్ రావు, రేవంత్ కుమ్మక్కు నిజమే

- గతంలోనే తాను ఈ విషయం చెప్పా
- ఇప్పుడు కవిత కొత్తగా చెప్పిందేమీ లేదు
- పోచంపల్లి, నవీన్‌రావు అక్రమాలపై విచారణ జరపాలి
- మీడియాతో ఎంపి రఘునందన్ రావు డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబర్3( వెలుతురు):**
రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు కుమ్మక్కయ్యారని తాను గతంలోనే చెప్పానని భాజపా ఎంపీ రఘునందన్ రావు అన్నారు. కవిత కూడా ఇప్పుడు అదే విషయంచెబుతోందని అన్నారు. ఆమె ఇప్పుడు మీడియాతో కొత్తగా చెప్పింది ఏం లేదని పేర్కొన్నారు. వాళ్ల పార్టీ వ్యవహారాల గురించి మాట్లాడదల్చుకోలేదని తెలిపారు. కవిత చెప్పిన మోకిల ప్రాజెక్టు అవకతవకల గురించి విచారించాలని చెప్పారు. పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాలపై విచారణ జరపాలన్నారు. జడ్పీ అధ్యక్షుడిగా నన్ను ఎవరు ఓడించారో గతంలో కేసీఆర్‌కు చెప్పాను. ఆరోజు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఇబ్బందిపెట్టాలని చూసినట్లు- గతంలోనే చెప్పా. కవిత ఇంకా వేరే విషయాలు కూడా మాట్లాడితే బాగుండేది. ఆమె మాటలతో భారత రాష్ట్ర సమితి అవినీతి పునాదుల మీద విస్తరించబడిందని తేలింది. మళ్లీ వచ్చే ఎపిసోడ్‌లో భారత రాష్ట్ర సమితి పెద్దలు చేసిన



అవినీతిని బయటపెడితే బాగుంటుంది. పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌రావు చేసిన అక్రమాల మీద మీరు పార్టీలో, ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని రఘునందన్‌రావు కవితను ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ పార్టీలో తాజాగా చోటు- చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు స్పందించారు. బుధవారం హైదరాబాద్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. దుబ్బాకకు మీ కుటుంబం చేసిన అన్యాయం గురించి తాను అనేక సార్లు చెప్పానన్నారు. అలాగే దుబ్బాకు హరీష్ రావు వల్లే అన్యాయం జరిగిందని కూడా తాను ఆనాడే చెప్పానని తెలిపారు. బీఆర్‌ఎస్‌లో తాను ఓడిపోవడానికి కారణం ఏమిటో కూడా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు గతంలోనే చెప్పానన్నారు. ఒకే విమానంలో సీఎం రేవంత్ రెడ్డి, హరీష్ రావులు ప్రయాణం చేశారని తాను గతంలోనే చెప్పానని పేర్కొన్నారు. అయితే కవిత చెప్పిన దాంట్లో కొత్తదనం ఏమీ కనిపించడం లేదన్నారు. మోకిల్లాలో జరుగుతున్న విల్లా ప్రాజెక్ట్‌పై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అలాగే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, నవీన్ రావులపై వెంటనే ఏసీబీ డీజీతో విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన సూచించారు. గతంలో నార్సింగి టాస్క్‌ఫోర్స్ డీసీపీగా సందీప్ రావు చేసిన అరాచకాలు చెప్పాల్సి ఉండేదన్నారు. సంతోష్ రావు వియ్యంకుడి హోదాలో మాత్రమే సందీప్ రావు అనేక అరాచకాలు చేశారని వివరించారు. అతడి ద్వారానే సంతోష్ రావు సెటిల్‌మెంట్లు చేసేవారన్నారు.

# పేదలే దేవుళ్లుగా సంక్షేమ పథకాలు అమలు

**- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియ**

**- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**అశ్వారావుపేట / హైదరాబాద్ వెలుతురు సెప్టెంబర్ 03 :**

రాష్ట్రంలో పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ పేదలే దేవుళ్లుగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండలపాడులో ఇందిరమ్మ ఇండ్లను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు బుధవారం ప్రారంభించారు. ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రి పొంగులేటి ఈ కార్యక్రమం అనంతరం దామచర్లలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించారు. ఏవో నాలుగు ఇటుకలు పెట్టి శ్లాబ్‌లు వేసి ఇదే ఇల్లు అని మసిబూసి మారేడుకాయ చేసే విధంగా గాక మానేతలు రాహుల్ గాంధీగారు. సిఎం రేవంత్‌రెడ్డి గార్లు చెప్పినట్లు పేదల ఆత్మగౌరవం. భరోసా, భద్రతలను పరిరక్షిస్తూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని చెప్పారు. ఈ ప్రాంతానికి ఇందిరమ్మ ఇండ్లు అత్యధికంగా ఇవ్వాలన్నసిఎం రేవంత్‌రెడ్డి గారి సూచనలతో 1000 ఇండ్లతోపాటు ఐటిడిఎ పరిధిలో ఉన్నందును మరో 2500 ఇండ్లు అదనంగా మంజూరు చేశామని తెలిపారు. చెంచులు ఇతర ఉప కులాలకు చెందిన 13వేల మందికి ఇండ్లు మంజూరు చేశామని , ప్రతి సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయం నుంచి బటన్ నొక్కుతూ పూర్తయిన మేరకు ప్రతి ఇంటికి లబ్దిదారుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. గతంలో రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం 23లక్షల ఇండ్లు నిర్మించగా ఇప్పుడు మళ్లీ అదేవిధంగా పేదలకు ఇండ్లు వస్తున్నాయని, దీనికి ఈ రోజు జరిగిన గృహప్రవేశాలే సూచికలను అన్నారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు గృహప్రవేశాలలకు రావడం ప్రజాపాలనకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో కాకుండా కులం, మతం, చొక్కారంగులు చూడకుండా పేదలందరికీ పథకాలు ఇస్తున్నామని చెప్పారు. కొత్తగా 7లక్షల రేషన్ కార్డులు, 15 లక్షల కార్డుల్లో కొత్త సభ్యుల చేరిక వంటి చర్యలతోపాటు అన్ని వర్గాల వారికి అందజేస్తున్న పథకాలను మంత్రి సోదాహరణంగా వివరించారు. ఇదే ఒరవడిని రానున్న మూడేళ్లలో కొనసాగిస్తామని చెబుతూ ఆనాటి పెద్దమనిషి నల్గొండ జిల్లాలో తన ఫాంహౌస్ రోడ్డుకోసం వాసాల మర్రి ప్రజలను మోసగించి కనీసం ఒక్క ఇల్లు ఇవ్వలేదని గుర్తుచేశారు. అదే గ్రామానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 119 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. అంతేగాక కేసీఆర్ స్వగ్రామం చింతమడకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే సంక్షేమ పథకాలు అమలు చేసిందని వివరించారు.

# ప్రపంచస్థాయి పర్యాటకంగా ఎపి

పర్యాటక శాఖపై సీఎం సమీక్షించారు. విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి, అనంతపురం, కర్నూలు ఇలా వేర్వేరు ప్రాంతాల్లో నిరంతరం ఏదోక టూరిజం ఈవెంట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అందుకోసం గదుల నిర్మాణం, నూతన ప్రాజెక్టులు, పర్యాటక ఉత్సవాల నిర్వహణ వంటి అంశాలపై దృష్టి సారించాలని సీఎం చెప్పారు. నిర్దేశిరచిన గడువులోగా వేర్వేరు పర్యాటక ప్రాంతాల్లో బస కోసం హోటల్ గదులను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. 2026 మార్చి నాటికి రాష్ట్రంలో 10 వేల గదులు అందుబాటు-లోకి రావాలని సీఎం సూచించారు. అలాగే 2029 నాటికి 50 వేల గదుల లక్ష్యాన్ని కూడా చేరుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు స్థలాలను గుర్తించాలని సీఎం ఆదేశించారు. పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామిక ప్రాంతాలు, టౌన్ షిప్ లతో పాటు- పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలని సీఎం ఆదేశించారు. అనంతపురంలో డిస్నీ వరల్డ్ సిటీ- ఏర్పాటు- చేసేందుకు ఆ సంస్థ ప్రతినిధుల్ని సంప్రదించాలని అధికారులకు సీఎం చెప్పారు. కొండపల్లి ఖిల్లా లాంటి ప్రాజెక్టులను దత్తత తీసుకునేలా ప్రైవేటు- భాగస్వాములను గుర్తించాలన్నారు. ఉండవల్లి గుహల వద్ద లైట్ అండ్ సౌండ్ షో ఏర్పాటు-తో పాటు-, చింతపల్లిలో ఎకో టూరిజం, కుప్పంలో ఏనుగుల సఫారీ, విశాఖలో డాల్ఫిన్ షో వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వివిధ పథకాల కింద రాష్ట్రంలో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టుల పురోగతిపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. స్వదేశ్ దర్శన్ పథకం కింద బొర్రా గుహలు, అరకు, లంబసింగిలో పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం చెప్పారు. సూర్య లంక బీచ్ ఎక్స్ పీరియన్స్ ప్రాజెక్టు పనులను రూ.97 కోట్లతో చేపట్టామని.. 2026 జూన్ నాటికి ఈ ప్రాజెక్టు సిద్ధం అవుతుందని వెల్లడించారు. ప్రసాద్ పథకం కింద సింహాచలం, అన్నవరం దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి పనులపైనా సీఎం ఆరా తీశారు. గండికోట టెంట్ సిటీ-ని వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తైడ, అరకు, గండికోట, సూర్యలంక, బ్రిడ్జిలంక, లంబసింగి వంటి ప్రాంతాల్లో టెంట్ సిటీలను ఏర్పాటు-చేయాలని సూచించారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద హేవ్ లాక్ బ్రిడ్జిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టును పర్యాటకులకు అందుబాటు-లోకి తేవాలన్నారు. రాజమండ్రిని స్పెషల్ టూరిజం హబ్ గా చేపట్టేలా ప్రాజెక్టులను తీసుకువచ్చే అంశం మీద దృష్టి సారించాలని సూచించారు. సుదీర్ఘ తీర ప్రాంతంలో ఆకర్షణీయమైన బీచ్ ఫ్రంట్ లను గుర్తించి అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హెలీ, సీప్లేన్ టూరిజానికి సంబంధించి విజయవాడ-శ్రీశైలం, గండికోట-బెంగుళూరు, విశాఖ-అరకు లాంటి కొత్త మార్గాలను కూడా గుర్తించాలని స్పష్టం చేశారు. కోనసీమలో కాటేజ్ లైఫ్, విలేజ్ లైఫ్ వచ్చేలా ప్రాజెక్టులు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. సీ క్రూజ్ ప్రాజెక్టులతో పాటు- రివర్ క్రూయిజ్ ను కూడా ప్రోత్సహించాలన్నారు. మరోవైపు విజయవాడలో దసరా ఉత్సవాలను మైసూరు ఉత్సవాల తరహాలోనే నిర్వహించేందుకు ప్రణాళిక చేసినట్టు- అధికారులు తెలిపారు. సెప్టెంబరు 22 తేదీ నుంచి అక్టోబరు 2 తేదీ వరకూ విజయవాడలో ఘనంగా దసరా ఉత్సవాలు నిర్వహించాలని సీఎం సూచించారు. అలాగే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే వేర్వేరు ఈవెంట్ల సమయంలో ఆయా పట్టణాలు, నగరాల్లో పండుగ శోభ వచ్చేలా విద్యుత్ దీపాలంకరణతో పండుగ శోభ వచ్చేలా చేయాలని స్పష్టం చేశారు. అలాగే సంప్రదాయ వంటకాలను కూడా ప్రోత్సహించేలా చూడాలని పేర్కొన్నారు. ఈవెంట్ల సమయంలో నగరాలు, పట్టణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేకించి విశాఖ, విజయవాడ, అమరావతి, తిరుపతి లాంటి నగరాలు నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పర్యాట రంగానికి మరింత శోభ తెచ్చేలా అదనపు ఆకర్షణలు జోడించటంతో పాటు-, స్థానికంగా ఉన్న ఉత్పత్తులను కూడా బ్రాండింగ్ చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అన్ని పర్యాటక ప్రాంతాలు, ప్రత్యేకంగా నిర్వహించే ఈవెంట్లలోనూ అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు-చేయటంతో పాటు- అరుదైన ఎర్రచందనం బొమ్మలు, ఫర్నిచర్ లాంటి ఉత్పత్తులను కూడా ప్రదర్శించాలన్నారు. అలాగే మన సంప్రదాయ నృత్య కళ కూచిపూడి, మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి లాంటి చేనేత క్లస్టర్లలో ఉత్పత్తయ్యే వస్త్రాలు, సేంద్రీయ ఉత్పత్తులకు కూడా బ్రాండింగ్ వచ్చేలా చేయాలని అన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి ముందస్తుగా కర్టంల్గ÷న్ రైజర్ కార్యక్రమం నిర్వహిద్దామని మంత్రి కందుల దుర్గేష్ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనికి సీఎం అంగీకరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సూర్యలంకలో ఫెస్టివల్ నిర్వహించవచ్చని సీఎం సూచించారు.

# సాగుకు అనుగుణంగా ఎరువులు పంపిణీ చేయాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 3**

మంచిర్యాల జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో యూరియా, ఎరువులు కార్యచరణ ప్రకారం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భుక్యా ఛాత్రు తో కలిసి మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో యూరియా, ఎరువుల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, వ్యవసాయ సాగుకు అనుగుణంగా



సకాలంలో కార్యచరణ ప్రకారం రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ఫర్టిలైజర్ దుకాణాలలో యూరియా, ఎరువుల నిల్వలు పరిశీలించి దుకాణ యజమానులు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ - పాస్ మిషన్లలో నమోదు చేయబడిన వివరాలు, సంబంధిత ఫర్టిలైజర్ దుకాణాలలో నిల్వ ఉన్న ఎరువుల వివరాలలో ఎలాంటి విభేదాలు ఉండకూడదని తెలిపారు. యూరియా పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ఫర్టిలైజర్ దుకాణాల నుండి అధిక మొత్తంలో కొనుగోలు చేసే వారి వివరాలు పరిశీలించాలని, కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు జారీ చేసి వివరాలు రిజిస్టర్ లో నమోదు చేయాలని, ఫర్టిలైజర్ దుకాణంలో ధరల వివరాలు, నిల్వ ఉన్న ఎరువుల వివరాలు ప్రదర్శించాలని తెలిపారు. పంట సాగు చేస్తున్న రైతులు, సాగు చేయని రైతుల వివరాలు సేకరించి నివేదిక అందించాలని తెలిపారు. కాలానికి అనుగుణంగా సాగు చేయవలసిన పంటల వివరాలు, సాగు మెలకువలను రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పంట సాగు విస్తీర్ణం, యూరియా, ఎరువుల పంపిణీ, పంట సాగు చేసే రైతుల వివరాలు తదితర అన్ని అంశాలు అనుసంధానమై ఉంటాయని, నివేదిక స్పష్టంగా ఉన్నట్లయితే వరి ధాన్యం, పత్తి, ఇతర పంటల దిగుబడి, కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ప్రజలకు శుభవార్త

**- ఇకపై జమ్మికుంటలో ఆగనున్న దక్షిణ్, రాయపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైళ్లు**

**- బండి సంజయ్ విజప్తి మేరకు రైలును ఆపేందుకు రైల్వేశాఖ నిర్ణయం**

**- కేంద్ర మంత్రి, రైల్వే శాఖ అధికారులకు ధన్యవాదాలు తెలిపిన బండి సంజయ్**


**- బండి సంజయ్ కు థ్యాంక్స్ చెబుతున్న కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు**

11. Karimnagar MP Constituency.xlsx Done

| SL NO | TRAIN NO | FROM | TO | STATION NAME | PTT TIMINGS | MP Constituency | Name of MP |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 12721 | HYB | NZM | JAMMIKUNTA | 01.34/01.35 | Karimnagar | Shri Bandi Sanjay Kumar |
| 2 | 12722 | NZM | HYB | JAMMIKUNTA | 23.19/23.20 | Karimnagar | Shri Bandi Sanjay Kumar |
| 3 | 12771 | SC | R | JAMMIKUNTA | 01.04/01.05 | Karimnagar | Shri Bandi Sanjay Kumar |

**కరీంనగర్ వెలుతురు సెప్టెంబర్ 03:**

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు శుభవార్త. ఈ నియోజకవర్గ ప్రజలకు మరో మూడు రైళ్లు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ నుండి హజ్రత్ నిజాముద్దీన్ (దక్షిణ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ నెంబర్ 12721), హజ్రత్ నిజాముద్దీన్ నుండి హైదరాబాద్ (ట్రైన్ నెంబర్ 12722), సికింద్రాబాద్ నుండి రాయపూర్ వరకు (రాయపూర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్, ట్రైన్ నెంబర్ 12771) రైళ్లు ఇకపై జమ్మికుంటలో ఆగనున్నాయి. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రత్యేక చొరవతో రైల్వే శాఖ ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నుండి హజ్రత్ నిజాముద్దీన్ బయలుదేరే రైలు అర్ధరాత్రి 1.34 నిమిషాలకు జమ్మికుంటకు చేరుకుంటుంది. ఒక నిమిషం తరువాత జమ్మికుంట నుండి బయలుదేరుతుంది. తిరిగి హజ్రత్ నిజాముద్దీన్ నుండి హైదరాబాద్ వెళ్లే రైలు రాత్రి 11.19 గంటలకు జమ్మికుంటలో ఆగుతుంది. ఒక నిమిషం తరువాత తిరిగి హైదరాబాద్ బయలుదేరుతుది. అట్లాగే సికింద్రాబాద్ నుండి రాయపూర్ వెళ్లే రైలు రాత్రి 1.04 నిమిషాలకు జమ్మికుంటలో ఆగుతుంది. ఒక నిమిషం తరువాత రాయపూర్ బయలుదేరుతుంది. ఈ మూడు రైళ్లు ఏ రోజు నుండి జమ్మికుంటలో ఆగుతాయనే విషయాన్ని ఒకటి, రెండ్రోజుల్లో దక్షిణ మధ్య రైల్వే శాఖ నోటిఫికేషన్ జారీ చేయనుంది. వాస్తవానికి గతంలో ఈ రై ఎక్స్ ప్రెస్ ను జమ్మికుంటలో ఆపేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. దీనిని ద్రుష్టిలో పెట్టుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పలుమార్లు కేంద్రం ద్రుష్టికి తీసుకెళ్లారు. సాధ్యాసాధ్యాలపై రైల్వే శాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తో స్వయంగా మాట్లాడారు. తప్పనిసరిగా జమ్మికుంటలో ఆగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన రైల్వేశాఖ తాజాగా ఈ మూడు రైళ్లను జమ్మికుంటలో ఆపాలని నిర్ణయిస్తూ కేంద్ర మంత్రి



కార్యాలయానికి సమాచారమిచ్చారు. రైల్వే శాఖ నిర్ణయంపట్ల బండి సంజయ్ కుమార్ సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైల్వే శాఖ అధికారులకు క్రుతజతలు చెప్పారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రయాణీకులకు ఎంతో ప్రయోజనం కలుగనుందని పేర్కొన్నారు. మరోవైపు జమ్మికుంట మీదుగా ఆయా ప్రాంతాలకు ప్రయాణించే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు బండి సంజయ్ కుమార్ కు ధన్యవాదాలు చెబుతూ ఫోన్లు చేస్తుండటం గమనార్హం.

## వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేలా

# వేలాది పోలీస్ బలగాలతో హైదరాబాద్

**- బందోబస్తు కమిషనర్ సివి ఆనంద్ పండుగ శోభ తగ్గకుండా బ్రహ్మాండమైన ఏర్పాట్లు**

**- సామూహిక నిమజ్జనోత్సవానికి హాజరు కానున్న అమిత్ షా**

**- సమన్వయ సమావేశంలో ప్రసంగిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్,**

**- రాచకొండ సీపీ సుధీర్ బాబు, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ తదితరులు పాల్గొన్నారు**




**బషీర్బాగ్ వెలుతురు సెప్టెంబర్ 3:**

నగరంలో వినాయక సామూహిక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు గాను 29 వేల మంది పోలీసు బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గత పదిహేను రోజులుగా పోలీస్ స్టేషన్ నుంచి మొదలుకుని కమిషనరేట్ వరకు పలు దఫాలుగా సమీక్ష సమావేశాలను నిర్వహించి చిన్న చిన్న లోటు పాట్లను గుర్తించినట్లు తెలిపారు.

జోన్ల వారిగా గుర్తించిన లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పోలీస్ స్టేషన్ల వారిగా బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలలో భద్రత భావాన్ని పెంపొందించామని తెలిపారు. దీంతో ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు పెరిగాయన్నారు. చాలా ప్రాంతాలలో దర్శనమిస్తున్న చెత్త కుప్పలు, అధ్వాన్నంగా మారిన రహదారులకు మరమ్మతులు చేపట్టాలని పలువురు మండప నిర్వాహకులు కోరగా యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం భారీ ఎత్తున విగ్రహాలను ఏర్పాటు చేశారని, సామూహిక వినాయక నిమజ్జనోత్సవం శోభ ఏ మాత్రం తగ్గకుండా ఏర్పాట్లను బ్రహ్మాండంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాభై వేల వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగే అవకాశం ఉందన్నారు. బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు తిరిగి ఏర్పాట్లను పరిశీలించినట్లు వివరించారు. వినాయక నిమజ్జనోత్సవానికి క్రేన్లను సిద్ధంగా ఉంచడంతో పాటు ఎప్పటిప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు, సిబ్బందికి సూచనలు చేసినట్లు తెలిపారు. సామూహిక నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని పోటీగా కాకుండా ఆరోగ్యవంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక ప్రతిమలను తొందరగా నిమజ్జనోత్సవానికి తరలించాలని మండప నిర్వాహకులను కోరారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ వినాయక సామూహిక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. 269 మొబైల్ క్రేన్లు, విగ్రహాల నిమజ్జనం కోసం 134 క్రేన్ల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు 13 కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామని, వినాయక విగ్రహాలకు అడ్డు రాకుండాఎత్తుగా పెరిగిన చెట్టు కొమ్మల తొలగింపు పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ జాయింట్ కమిషనర్ రమేష్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు బుచ్చిరెడ్డి, మెట్టు వైకుంఠం, ఆలె భాస్కర్, గోవిందరాఠి, కోశాధికారి శ్రీరాం వ్యాస్, ఉమా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఏర్పాట్లు సకాలంలో జరగాలి డాక్టర్ రావినూతల శశిధర్, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి....

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సువర్ణాక్షరాలతో రాసుకునే విధంగా ఈ సంవత్సరం సామూహిక వినాయక నిమజ్జనోత్సవానికి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్షా విచ్చేసి ప్రసంగించనున్నట్లు ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ పేర్కొన్నారు. నిమజ్జనం రోజు నగరమంతా కాషాయమయమవుతుందనిప్రజలు భారీగా తరలి వచ్చి వినాయక నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### చెరువులతో పాటు తాత్కాలిక ఏర్పాట్లు చేపట్టాం సుధీర్ బాబు, రాచకొండ పోలీస్ కమిషనర్....

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత సంవత్సరం 13250 విగ్రహాల నిమజ్జనం జరగగా ఈ సంవత్సరం ఇప్పటికే 11700 విగ్రహాలు నిమజ్జనమయ్యాయని కమిషనర్ సుధీర్బాబు తెలిపారు. తమ కమిషనరేట్ పరిధిలో 59 చెరువులు ఉండగా తాత్కాలిక పౌండ్లను ఏర్పాటు చేసి వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. ప్రజలు శాంతి యుత వాతావరణంలో వినాయక నిమజ్జనోత్సవాన్ని జరుపుకోవాలని కోరారు.

విగ్రహాల నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేపట్టాం: సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి..

సామూహిక వినాయక నిమజ్జనోత్సవాన్ని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. వినాయక మండపాలలోని వినాయక ప్రతిమలను తొందరగా నిమజ్జనోత్సవానికి తరలించాలని కోరారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా అవసరమైన మేరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు నిర్భయంగా వేడుకలను జరుపుకోవాలని కోరారు.

https://epaper.velthuru.com

వెలుతురు

cinema



## ప్రపంచానికి కెన్యా ప్రకృతి దృశ్యాలు

### రాజమౌళి సినిమాపై ఆ దేశ మంత్రి వ్యాఖ్య

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఎస్ఎస్ఎంబి29' (వర్కింగ్ -టైటిల్). భారీ బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. అదే స్థాయిలో విడుదల చేసేందుకు రాజమౌళి ప్లాన్ చేశారు. కెన్యాలో షూటింగ్ చేస్తున్న సందర్భంగా.. ఆ దేశ మంత్రి ముసాలియా ముదావాదిని మూవీ టీమ్ మర్యాదపూర్వకంగా కలిసింది. భేటీ అనంతరం ముఖ్యాంశాలను సోషల్ మీడియాలో అక్కడి మంత్రి పోస్టు చేశారు. రెండు దశాబ్దాలుగా రాజమౌళి సినీ ఇండస్ట్రీలో కొనసాగుతున్నారు. చాలా శక్తిమంతమైన కథనాలను, విజువల్స్‌ను, లోతైన సాంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడంలో ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారు. తూర్పు ఆఫ్రికా అంతటా పర్యటించిన అనంతరం 120 మందితో కూడిన రాజమౌళి టీమ్ కెన్యాను ఎంచుకుంది. మసాయి మరా మైదానాల నుంచి మొదలు సుందరమైన నైవాషా, ఐకానిక్ అంబోసెలి వంటి ప్రాంతాలు ఆసియాలోనే అతిపెద్ద చలనచిత్రంగా తెరకెక్కుతున్న మూవీలో భాగం కాబోతున్నాయి. 120 దేశాల్లో ఈ మూవీని విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికిపైనే చేరువయ్యే అవకాశం ఉంది. కెన్యాలో షూటింగ్ చేయడం ఒకమైలురాయిగా నిలిచిపోతుంది. ప్రపంచ వేదికపై మా దేశ అందాలను, ఆతిథ్యాన్ని, సుందర దృశ్యాలను చూపడంలో ఈ సినిమా శక్తిమంతంగా పనిచేయనుంది. ఎస్ఎస్ఎంబీ 29 చిత్రంతో కెన్యా తన చరిత్రను ప్రపంచంతో పంచుకోవడానికి సిద్ధంగా ఉంది. ఈ విషయంలో గర్వంగా ఉంది అని ముసాలియా ముదావాది పేర్కొన్నారు. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు-, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నట్లు- ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఈ చిత్రంతో ఆవిష్కరించనున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

## మళ్లీ నటించాలనే ఉంది

### గోవా బ్యూటీ ఇలియానా

గోవా బ్యూటీ- ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి... ఇవన్నీ నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు. అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

## గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో నిశాంఛి

బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం 'నిశాంఛి' జార్ పిక్చర్స్ బ్యానర్‌పై అజయ్ రాయ్, రంజన్ సింగ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ఆయిశ్వర్య్ థాకరే హీరోగా బాలీవుడ్‌కి పరిచయం అవుతుండగా, వేదిక పింటో, మోనికా పన్వార్, మహమ్మద్ జీషన్ అయ్యూబ్ , కుముద్ మిశ్రా(ఔషపష ఃరసశ) కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమా సెప్టెంబర్ 19న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి -ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గ్యాంగ్‌స్టర్ కథాంశంతో రాబోతున్న ఈ సినిమా -ట్రైలర్ ప్రస్తుతం ఆకట్టుకుంటుంది.




## సుదీప్....మార్క్ సినిమా టైటిల్ గ్లింప్స్ విడుదల

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటిస్తున్న 47వ చిత్రానికి 'మార్క్' టైటిల్ ఖరారు చేశారు. సినిమా -టైటిల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'మార్క్' చిత్రాన్ని టీజీ త్యాగరాజన్ సమర్పణలో సత్యజ్యోతి ఫిలింస్, కిచ్చా క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. సెంథిల్, త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. భారీ యాక్షన్ డ్రామా కథతో దర్శకుడు విజయ్ కార్తికేయా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. 'మార్క్' సినిమా ఈ క్రిస్మస్ పండగకు పాన్ ఇండియా స్థాయిలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.మార్క్' సినిమా -టైటిల్ గ్లింప్స్ పవర్ ఫుల్ గా ఉండి ఆకట్టుకుంటోంది. మ్యాడ్, ఆటిట్యూడ్, రూత్ లెస్, కింగ్...అంటూ మార్క్ పేరులోని అక్షరాలకు డెఫనేషన్ ఇచ్చారు. ఈ గ్లింప్స్ లో అజయ్ మార్కండేయ పాత్రలో కిచ్చా సుదీప్ ను ఇం-టె-న్స్ లుక్ లో పరిచయం చేశారు. ఆయన క్యారెక్టర్ పేరుతోనే -టైటిల్ 'మార్క్' ఉండబోతోంది. ఈ గ్లింప్స్ కు అజనీష్ లోకనాథ్ అందించిన బీజీఎం ఆకర్షణగా నిలుస్తోంది. కిచ్చా సుదీప్ కెరీర్ లో బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్ -టైనర్ గా రూపొందుతున్న 'మార్క్' సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.






## వస్తాను..ఎలా అన్నది చెప్పను

### మంత్రి నిమ్మల కూతురు పెళ్లికి ఆహ్వానంపై బాలకృష్ణ

త్వరలో ఏపీలో మంత్రి, పాలకొల్లు శాసన సభ్యుడు నిమ్మల రామనాయుడు కుమార్తె వివాహం జరగనుంది. ఈ క్రమంలో ఆయన నందమూరి బాలకృష్ణను వివాహానికి ఆహ్వానించారు. దీంతో ఆయన ఆసక్తికరంగా స్పందించారు. వస్తానని ఎలా వస్తానో చెప్పనని తెలిపారు. ఈ విషయాన్ని రామానాయుడు సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు. ఈ మేరకు బాలకృష్ణను ఆహ్వానిస్తున్న వీడియో సైతం షేర్ చేశారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో హిందూపురం ఎమ్మెల్యే, సినీ హీరో బాలకృష్ణ గారు ను కలిసి పాలకొల్లులో ఈనెల 24వ తేదీన జరగబోయే నా కుమార్తె శ్రీజ వివాహ శుభలేఖ అందజేసి రమ్మని ఆహ్వానించగా వస్తానని ఎలా వస్తానో చెప్పనని తెలిపారు. మరియు ప్రముఖ చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను గారు ను కూడా రమ్మని ఆహ్వానించడం జరిగింది అని రామానాయుడు పేర్కొన్నారు.

## అనుకున్న సన్నివేశాలు మిస్ అయ్యాం


### హరిహరవీరమల్లుపై దర్శకుడు క్రిష్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పాన్-ఇండియా సినిమాగా వచ్చిన హరి హర వీర మల్లు బాక్సాఫీస్ వద్ద అనుకున్నంతగా కలెక్షన్లను రాబట్టలేక పోయింది. కేవలం కలెక్షన్స్ పరంగా మాత్రమే కాకుండా కంటెంట్ కూడా ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం రీచ్ కాలేదని టాక్. ఈ సినిమాకు మొదట దర్శకుడిగా ఉన్న క్రిష్ జాగర్లమూడి సినిమా మధ్యలో తప్పుకోవడంతో, తర్వాత సినిమా దర్శక బాధ్యతలు జ్యోతి కృష్ణకి చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, తాజాగా ఘాటి సినిమా ప్రమోషన్స్ సందర్భంగా దర్శకుడు క్రిష్ హరి హర వీర మల్లులోని కొన్ని కీలక విషయాలను బయటపెట్టాడు. ఆయన చెప్పినదాని ప్రకారం.. తాను తెరకెక్కించిన ఎక్కువ సన్నివేశాలు ఢిల్లీ దర్బార్ నేపథ్యంలోనే జరుగుతాయి. అందుకోసం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ప్రత్యేకంగా ఒక అద్భుతమైన సెట్ వేసి వాటిని తీశాం. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ఒక ఛాండెలియర్‌పై జరిగే ఫైట్ సీక్వెన్స్ లో అద్భుతంగా యాక్ట్ చేశారు. కానీ, ఈ ఎపిసోడ్ కథ ఢిల్లీకి వెళ్లిన తర్వాత వస్తుంది. ఇందుకు సంబంధించి దాదాపు 40 నిమిషాల ఫుటేజ్ సెకండ్ పార్ట్ కోసం ఉంచామని తెలిపారు.అలాగే పవన్ కళ్యాణ్ స్వయంగా ఫైట్స్‌లో పాల్గొని అద్భుతంగా పని చేశారన్నారు. ఆయన ఔరంగజేబ్ దర్బార్‌కి వెళ్లి సూటిగా సవాల్ చేస్తారని, మొఘల్ చక్రవర్తి కోసం ప్రత్యేకంగా చేసిన సింహాసనంపై కూర్చొని, అక్కడి నుండి కోహినూర్ వజ్రం దొంగిలించే సన్నివేశం ఉందంటూ సినిమా విశేషాలను రివీల్ చేశారు. ఇలాంటి ఎన్నో మంచి సన్నివేశాల ఫుటేజ్ ఇంకా ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉందని ఆయన అన్నారు. నేను పవన్ కళ్యాణ్ పై నా ప్రేమను ఈ సినిమాతో చూపించాను అని క్రిష్ వెల్లడించారు.

# చైనా రక్షణ పాటవ ప్రదర్శన

**- పుతిన్ సహా ప్రపంచ దేశాల ప్రతినిధులు హాజరు**



**బీజింగ్,సెప్టెంబర్3( వెలుతురు):**

చైనా మరోమారు తన సైనిక పాటవాన్ని ప్రదర్శించింది. తియాన్మెన్ స్క్వేర్ వేదికగా ఏర్పాటు చేసిన సైనిక బలాన్ని ప్రపంచదేశాలు వీక్షించేలా చేసింది. రష్యా అధ్యక్షుడు పుతిన్ లాంటి వారు పాల్గొనడం విశేషం. అమెరికా సుంకాల బెదిరింపుల వేళ.. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచం ముందు రెండు ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని అన్నారు. శాంతా–యుద్ధమా, చర్చలా–ఘర్షణా.. ఏం కావాలో తేల్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వ్యాఖ్యానించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా ఆయుధ ప్రదర్శన ఏర్పాటు–చేసింది. ఈక్రమంలో తొలిసారి అధునాతన యుద్ధ విమానాలు, క్షిపణులు, ఎలక్ట్రానిక్ యుద్ధ సామగ్రిని ప్రదర్శించింది. ఈ కార్యక్రమానికి 26 దేశాల నేతలు హాజరయ్యారు. ప్రతిష్ఠాత్మక తియానన్మేన్ స్క్వేర్ ఇందుకు వేదికైంది. దీనిని ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించారు. జిన్‌పింగ్‌తో పాటు– ఇందులో పాల్గొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్ , ఉత్తరకొరియా నాయకుడు కిమ్‌జోంగ్ ఉన్ గురించి ట్రంప్ మాట్లాడుతూ.. ఈ ముగ్గురు యూఎస్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. రెండో ప్రపంచయుద్ధంలో చైనా కోసం పోరాడిన అమెరికన్ సైనికుల త్యాగాలను గుర్తించాలన్నారు. యుద్ధం నేపథ్యంలో చైనాకు మద్దతిచ్చి, ప్రాణత్యాగం చేసిన అమెరికన్ సైనికులను జిన్‌పింగ్ గుర్తిస్తారా.. లేదా..? అనేది పెద్ద ప్రశ్న అని ట్రంప్ అన్నారు. ఈ తరుణంలో జిన్‌పింగ్ నుంచి స్పందన వచ్చింది. దేశం సైనిక సామర్థ్యాలను మరింత పెంచుతామని ఈసందర్భంగా చైనా అధ్యక్షుడు ప్రతిజ్ఞ చేశారు. దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని రక్షించడంలో సైనికులు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈసందర్భంగా తైవాన్‌ను పరోక్షంగా ప్రస్తావించారు. అది తమ దేశంలో భాగమని బీజింగ్ ఎప్పటినుంచో వాదిస్తోంది. ప్రస్తుతం అక్కడ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇక, ఈ కార్యక్రమంలో చైనాలో భారత రాయబారి ప్రదీప్ కుమార్ రావత్ హాజరయ్యారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలీ, మాల్దీవులు అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు పాల్గొన్నారు.

# బీజింగ్‌లో కిమ్‌తో పుతిన్ ప్రత్యేక భేటీ

**- ఉక్రెయిన్‌తో యుద్ధంలో సాయపడినందుకు కృతజ్ఞతలు**




**బీజింగ్,సెప్టెంబర్3( వెలుతురు):**

ఉక్రెయిన్ ఆక్రమించుకొన్న క్రస్క్ ప్రాంతాన్ని తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు ఉత్తరకొరియా నేత కిమ్ జోంగ్ ఉన్ చేసిన సాయానికి రష్యా అధినేత పుతిన్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ యుద్ధంలో మాస్కో సేనలకు అండగా.. ఉత్తరకొరియా నుంచి కూడా ప్రత్యేక దళాలు రంగంలోకి దిగిన విషయం తెలిసిందే. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌పై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చైనా బీజింగ్‌లో ప్రత్యేక పరేడ్ ఏర్పాటు–చేసింది. దీనికి పుతిన్ , కిమ్ హాజరయ్యారు. ఈసందర్భంగా వీరిద్దరి మధ్య ప్రత్యేక భేటీ– జరిగింది. దీనిలో కిమ్ సాయాన్ని రష్యా అధినేత అభినందించారు. ఇరువురు నేతలు కలిసి ఒకే కారులో ప్రయాణించారు. ఈసందర్భంగా పలు అంశాలపై చర్చించారు. రష్యాలోని దాదాపు 2 లక్షల జనాభా ఉన్న క్రస్క్ ప్రాంతాన్ని గతేడాది ఉక్రెయిన్ (÷ఖసశ) దళాలు ఆక్రమించాయి. దీంతో అక్కడి ప్రజలు నగరాన్ని వీడారు. కొన్ని నెలల తరువాత ఉత్తర కొరియా దళాల సాయంతో రష్యా ఈ ప్రాంతంలో చాలా భాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకొంది. కిమ్ దాదాపు 11,000 మంది సైనికులను ఇక్కడికి పంపారు. ఈ ఏడాది జనవరిలో ఇద్దరు సైనికులను ఉక్రెయిన్ దళాలు బంధించాయి.


# పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా

**- సస్పెండ్ చేయడంతో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్,సెప్టెంబర్3( వెలుతురు):**



తను పార్టీ నుంచి సస్పెండ్ చేసిన కారణంగా బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పార్టీ అధినేత కేసీఆర్ తనపై సస్పెన్షన్ వేటు– వేయడంతో.. తన నిజాయితీని నిరూపించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు– ఆమె వివరించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు– చేసిన విలేకర్ల సమావేశంలో కవిత మాట్లాడారు. తన ఆత్మాభిమానం కాపాడుకునేందుకు తాను ఈ పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తాను చేసిన వ్యాఖ్యల వల్ల ఏదో జరిగిపోయినట్లు– దుష్టచతుష్టయం ఏదో ప్రచారం చేస్తుందంటూ కవిత మండిపడ్డారు. తన విషయంలో రెండు గ్యాంగులు జరగనిది జరిగినట్లుగా ప్రచారం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ వద్దకు వెళ్లితే.. తనను గన్‌మెన్లు అడ్డుకున్నట్లు రాయించారన్నారు. ఆరడుగుల బుల్లెట్ ఈ రోజు తనను గాయపరిచిందన్నారు. సంతోష్ రావు.. చేసిన పనులతో కేటీఆర్‌కు చెడ్డ పేరు వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్, సంతోష్ మూఠాలు.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో కుమ్మక్కయ్యాయన్నారు. హరీష్ రావును పక్కన పెట్టుకుని.. నిజాలు మాట్లాడిన తనను బయటకు పంపాంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.




# నిజాం రాజుల కాలంలో వెట్టిచాకిరీ



అధికారమదంతో జమీందార్లు పేదలపై దౌర్జన్యాలు చూసేవారు. పేదల భూములు ఆక్రమించేటోళ్ళు. దుక్కిదున్నిన రైతుకు సరిగా తిండి దొరికేదికాదు. రైతుల మహిళలపై అత్యాచారం చేసేవారు.. ఈ వెట్టిచాకిరీ హైదరాబాద్ సంస్థానం మొత్తం ఏడుగురు నిజాంల కాలంలో గూడ ఉండేది..

Part-2.

**మా నాన్న కపిలవాయి సీతారామ శాస్త్రి.**

**మా తాతయ్య రామలింగయ్య.**

**ముత్తాత సీతయ్య..**

**సీతయ్య అయిదవ నిజాం కాలంనాటి వాడు.**

మొదటి నిజాం నుంచి నిజాం రాజులందరూ హిందూ వ్యతిరేకులేనని,ప్రజలపై అధిక పన్నులువేసి, కట్టకపోతే కఠినంగా శిక్షించేవారని, ఎదురుతిరిగితే,జైళ్లలో పెట్టేవారనీ, హత్యలు చేసేవారని, బలవంతపు మతమార్పిడులు చేసేవారనీ, మతం మారితే పన్నులు కట్టవలసిన అవసరం లేదని, స్వేచ్ఛగా ఉండొచ్చనీ,మా ముత్తాత సీతయ్యగారు మానాన్నకు చెప్పేవారట. చదువుకోవటానికి అవకాశాలే ఉండేవికావు, నిజాంల పాలనలో తెలుగుభాషపై నిషేధం విధించారు. చదుకోవాలంటే ఉర్దూ మీడియంలో చేరాలి. ఉర్దూ రాయాలి,చదవాలి. అధికారిక ఉత్తర్వులు,పరిపాలన మొత్తం ఉర్దూ భాషలోనే. వినాయక చవితి, దసరా పండుగలు బహిరంగంగా జరుపుకునే వీలులేదు. ఊరేగింపులపై,సభలపై నిషేధం ఉండేది. హిందువులు తమ పండుగలు జరుపుకోవటానికే భయపడేవారు.. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కాలంలో జమీందార్లు, దేశ్‌ముఖ్‌ల ఆధీనంలో ఎక్కువ భూములు ఉండేవి. వాళ్ళు ఏంచేసినా,ఏంచెప్పినా నిజాం వినేటోడు. ఆ పంటను కూడా గూండాలను పెట్టి దోచుకునేటోళ్ళు.. ప్రజలు భూస్వాములకు బానిసలుగా బతికేవాళ్లు. వెట్టిచాకిరీ చేయించేవారు. చివరి నిజాం కాలంలో ఇది మరీ దారుణంగా ఉండేది. వెట్టి అంటే వట్టి అని అర్థం. వట్టిగనే పనిచేయాలి. పనికి జీతం,కూలీ ఏమీ ఉండదు. పల్లెల్లో చాకలి,కమ్మరి, కుమ్మరి,మంగలి వడ్రంగి, హరిజన, బేగరి (గుర్రాల మాలీష్), నీరడులు అంటే నీళ్లు తెచ్చేవాళ్లు మొదలైన అనేక కులాలవారు ఉచితంగా సేవలు చెయ్యాలని హుకుం జారీ చేసేవారు. గ్రామాలకు తహసీల్దార్ లు, పోలీసులు,అటవీశాఖాధికారులు వచ్చినప్పుడు ఈ కులాలవాళ్లు వెట్టి చేయాల్సిందే.. చేయకపోతే కొట్టి,చిత్ర హింసలు పెట్టి పనులు చేయించుకునేవాళ్లు. వెట్టి చేసే



రేపు Part-3.

# ఓటేస్తే భవిష్యత్‌కు గ్యారెంటీ అన్నారు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరత, రైతుల అవస్థలపై ఆయన ట్వీట్ చేస్తూ.. చంద్రబాబు సర్కార్ నిర్లక్ష్యంపై తీవ్రంగా మండిపడ్డారు. మీరు అధికారంలోకి వచ్చింది మొదలు వరుసగా ఈ రెండేళ్లపాటు– రైతులకు ఎరువుల కష్టాలే. బస్తా యూరియా కోసం రోజుల తరబడి రైతులు క్యూల్లో నిలబడే దారుణ పరిస్థితిని ఎందుకు తీసుకొచ్చారు? మరో వైపు తాజాగా ఉల్లి, చీనీ, మినుము ధరలు కూడా పతనమై రైతులు లబోదిబో మంటున్నారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా మీలో కనీసం చలనం లేదు చంద్రబాబూ? అన్నారు. ఏటా ఏ సీజన్‌లో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగవుతాయి, ఎరువులు ఎంత పంపిణీ చేయాలన్నదానిపై ప్రతిఏటా ప్రభుత్వంలో జరిగే కసరత్తే కదా. మరి యూరియా సమస్య ఎందుకు వచ్చింది? ఐదేళ్ల మా పాలనలో ఇలాంటి సమస్య ఎప్పుడూ లేదన్నది వాస్తవం కాదా? ఇవాళ మీరు వైఫల్యం చెందారంటే ప్రభుత్వం అనేది సరిగ్గా పనిచేయడంలేదనే కదా అర్థం‘ అంటూ వైఎస్ జగన్ నిలదీశారు. ప్రభుత్వం నుంచి కిందకు వెళ్లిన ఎరువులను మీ పార్టీ నాయకులే దారి మళ్లించి అధిక ధరకు అమ్ముకుంటు–న్నారు. మరో వైపు ప్రైవేటు– వ్యాపారులు నల్లబజారుకు తరలించి, వాటిని బ్లాక్ చేసి, బస్తా యూరియా రేటు– రూ.267లు అయితే, దీనికి మరో రూ.200లు అధికంగా అమ్ముకుంటు–న్నారు. అక్రమ నిల్వలపై తనిఖీల్లేవు, ఎవ్వరిమీదా చర్యల్లేవు. ఆఈ÷ూలకు, ఇఔలకు సరైన కేటాయింపులు లేవు. దీనికి కారకులు మీరేకదా చంద్రబాబూ.. మా హయాంలో ఆర్‌బికెల 12 లక్షల టన్నుల ఎరువులను రైతుల వద్దకే స్లప్లైచేశాం. మార్కెట్ రేటు– కన్నా రూ.50ల తక్కువ రేటుకు రైతుకు అందించగలిగాం. మీరెందుకు ఆపని చేయలేకపోతున్నారు చంద్రబాబుగారూ? ఎందుకంటే బ్లాక్ మార్కెట్‌ల నుంచి మీ కొచ్చే కమిషన్లకోసం కాదా?అన్నారు. మరో వైపు పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు లబోదిబోమంటున్నారు. వరుసగా పంటల ధరలు పతనమవుతున్నా, ఈ రెండేళ్లలో వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జ, రాగులు, అరటి, చీనీ, కోకో, పొగాకు ధరలు పడిపోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా, చిత్తశుద్ధితో ఏరోజూ రైతును ఆదుకోలేదు. క్వింటా ఉల్లి సగటున క్వింటాలుకు రూ.400–500లకు క్షీణించినా పట్టించుకునే నాథుడే లేడు. మరోవైపు ఇదే ఉల్లిని బహిరంగ మార్కెట్లో కిలో రూ.35లకు పైగా అమ్ముతున్నారు. మా ప్రభుత్వ హయాంలో ఉల్లి క్వింటా రూ.4వేల నుంచి రూ.12వేలు అమ్ముడయ్యేది. అంటే కేజీ రూ.40 నుంచి, రూ.120 దాకా రైతులు అమ్ముకున్నారు. ధరలు పతనమైనప్పుడు మా హయాంలో ప్రభుత్వమే జోక్యంచేసుకుని గిట్టు–బాటు– ధరలు కల్పించింది. మా ఐదేళ్ల కాలంలో, రైతులకు ఇలాంటి కష్టకాలం వచ్చినప్పుడు, 9,025 టన్నులను ఉల్లిని ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులకు తోడుగా నిలబడ్డాం. చీనీ ధర కూడా ఇప్పుడు మీ హయాంలో పడిపోయి టన్ను రూ.6వేల నుంచి రూ.12వేలు మాత్రమే పలుకుతోంది. మా హయాంలో టన్నుకు కనిష్టంగా రూ.30 వేలు, గరిష్టంగా రూ.1లక్ష ధర రైతులకు లభించింది. కోవిడ్‌లాంటి మహమ్మారి ప్రపంచాన్ని కుదిపేసిన సమయంలో రైతుల వద్ద చీనీ పంట ఉండిపోతే, ప్రభుత్వమే కొనుగోలు చేసి, ప్రత్యేక రైళ్లు ప్రవేశపెట్టి ఒక ప్రభుత్వంగా రైతులను ఆదుకోవడానికి అన్నిరకాలుగా చర్యలు తీసుకున్నాం. ఇప్పుడు ఇంత సంక్షోభం వచ్చినా చంద్రబాబుగారూ మీరు పట్టించుకోవడంలేదు. నిద్ర నటించేవాళ్లని ఎవరైనా లేపగలరా?‘ అంటూ వైఎస్ జగన్ దుయ్యబట్టారు. మేం ఏర్పాటు– చేసిన ధరలస్థిరీకరణ నిధికి ఎగనామం పెట్టారు. దీనికింద రూ.7,802 కోట్లు– ఖర్చుచేసి మేం రైతులకు తోడుగా నిలబడితే మీరు ఆ విధానానికి మంగళం పాడారు. మీకు ఓటేస్తే భవిష్యత్తుకు గ్యారంటీ– అన్నారు. కాని, రైతులకు గతంలో సులభంగా దొరికే బస్తా యూరియా కూడా ఇవ్వలేకపోతున్నారు.

ఇంత అధ్వాన్నంగా ప్రభుత్వాన్ని నడుపుతారా? మీరు అధికారంలోకి వచ్చింది మొదలు వరుసగా ఈ రెండేళ్లపాటు– రైతులకు ఎరువుల కష్టాలే. ఏ సీజన్‌లో పంట నష్టం వస్తే, అదే సీజన్ ముగిసేలోపు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ, మరుసటి సీజన్‌లోగా ఇచ్చే క్రాప్ ఇన్సూరెన్స్(పంట నష్టపరిహారం)ను అందించే పద్ధతినీ ధ్వంసంచేశారు. రైతులకు సున్నా వడ్డీ పథకాన్నీ ఎత్తివేశారు. మేం క్రమం తప్పకుండా ఇస్తున్న రైతు భరోసాను ఎత్తివేసి, పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా, రైతులకు పెట్టు–బడి సహాయం కింద ఏడాదికి రూ.20వేలు, అన్నదాత సుఖీభవ పేరుతో ఇస్తామని ఎన్నికల్లో మాట ఇచ్చి, వెన్నుపోటు– పొడిచారు. మొదటి ఏడాది ఎగ్గొట్టారు. రెండేళ్లకు కలిపి రూ.40వేలు ఇవ్వాల్సి ఉంటే ఇచ్చింది రూ.5వేలు మాత్రమే. అదికూడా సుమారు 7 లక్షల మంది రైతు కుటు–ంబాలకు ఎగ్గొట్టారు. అందుకే బాబు ష్యూరిటీ–, మోసం గ్యారంటీ–‘ అంటూ వైఎస్ జగన్ ఎండగట్టారు.

# రెండు దశాబ్దాలు పార్టీ కోసం కష్టపడ్డా

**- ఇదా నాకు దక్కిన గౌరవం**

**- మీడియా ముందు కవిత ఆవేదన**

**- సంతోష్‌కు ధనదాహం ఎక్కువే**

**- పోచంపల్లి శ్రీనివాసరెడ్డితో వెంచర్లు**

**హైదరాబాద్,సెప్టెంబర్3( వెలుతురు):**

రెండు దశాబ్దాల పాటు పార్టీ కోసం కష్టపడి పని చేస్తే.. చివరకు తనకు సస్పెన్షన్ దక్కిందంటూ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. వివరణ కూడా కోరకుండా తనపై సస్పెన్షన్ వేటు– వేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న సమయంలో తాను పార్టీ కోసం, తెలంగాణ కోసం మాత్రమే కష్టపడ్డానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. బిడ్డను చంకన వేసుకుని వచ్చి తెలంగాణ కోసం కష్టపడడ్డానని అన్నారు. అమ్మకు కూడా దూరంగా ఉండాల్సి రావడం బాధగా ఉందన్నారు. అయితే తాను ఏ పార్టీలో చేరనన్నారు. తనకు ఏ పార్టీతో పనిలేదని కుండ బద్దలు కొట్టారు. జాగృతి కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడిన తర్వాతే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానన్నారు. పార్టీని హస్తగతం చేసుకోవాలనే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఉంటే ఎంత.. లేకుంటే ఎంత అని తాను అనలేదన్నారు. కేసీఆర్‌కు నష్టం చేసే పార్టీ ఉంటే ఎంత.. లేకుంటే ఎంత అని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తన శరీరం బీఆర్ఎస్ అయితే.. తన ఆత్మ జాగృతి అని అభివర్ణించారు. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా తాను పని చేశానన్నారు. బీఆర్ఎస్‌లో తన భాగస్వామ్యం ఏం లేదా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్‌రావు, సంతోష్‌రావు భాగస్వామ్యం మాత్రమే ఉందా? అని అడిగారు. తన విషయంలో రెండు గ్యాంగులు జరగనిది జరిగినట్టుగా ప్రచారం చేశాయని మండిపడ్డారు. కేసీఆర్ దగ్గరకు వెళ్తే గన్‌మెన్లు తనను అడ్డుకున్నట్టు రాయించారన్నారు. లేఖ లీక్ చేసిన వ్యక్తులపై ఎందుకు చర్యలు తీసుకోలేదంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను ఆమె ప్రశ్నించారు. పార్టీ తనపై సస్పెన్షన్ వేటు– వేయడంతో.. తన పుట్టింటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో తనకు అమ్మ అంటే చాలా ఇష్టమన్నారు. ఆమెను కలవ లేక పోతున్నట్లు కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీ, కేసీఆర్ మరో బంధువు అయిన జోగినపల్లి సంతోష్ కుమార్ మీద కూడా కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు గుప్పించారు. సంతోష్ రావు దన దాహానికి అడ్డుఅదుపు లేదు. సిరిసిల్ల ఇసుక లారీ కేసులో దళితులను టార్చర్ చేసింది సంతోష్.. చెడ్డ పేరు మాత్రం కేటీఆర్‌కు ఇచ్చారు. ముందులో మంచింగ్ చేయడానికి ఒకడు ఉండాలి వీడు వాడే అంటూ విమర్శలు గుప్పించారు. సంతోష్‌కు ఎమ్మెల్యే పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడు. ఇప్పుడు షాట్. ఇది నాకు చెప్పింది పల్లా రాజేశ్వర్ రెడ్డి. 750 కోట్ల విల్లా ప్రాజెక్టు నిర్మాణంలో వీరిద్దరి దోస్తానా ఉంది. నవీన్ రావు ఎమ్మెల్సీకి పదవి ఎలా వచ్చింది.. సంతోష్ వల్లనే అని నవీన్ స్వయంగా చెప్పుకున్నాడు. హరీష్ రావు , సంతోష్ రావులు తలో వర్గం మేంటేయిన్ చేస్తూ కాంగ్రెస్ , బీజేపీలతో కుమ్మక్కు అయి బిఆర్ఎస్ ఓడిపోయేలా చేశారు. చివరకు కెసిఆర్ కామారెడ్డిలో ఓడిపోయేలా చేశారు. హరీష్ రావు మీడియాను మేనేజ్ చేస్తే, రాం అన్న యూట్యూబ్ ను మేనేజ్ చేస్తారు. రాం అన్నకు చెప్తున్న.. నువ్వు కూడా హరీష్ రావు లాగా నేర్చుకో. కూతురిగా చెప్తున్న వీళ్ళను పార్టీలో ఉంచుకుంటే వీళ్లు మిమ్మల్ని కూడా మింగేస్తారు. వీరు ఇద్దరు మేక వన్నె పులులు అంటూ కెసిఆర్‌ను కవిత హెచ్చరించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com